మన సమగ్ర
# ప్రజావాణి
RNI NO:TGTEL/25/A5443
తెలుగు డైలీ
MANA SAMAGRA PRAJAVANI TELUGU DAILY

Wanted Reporters
తెలుగు రాష్ట్రాలలో దిగ్విజయంగా నడుపబడుతున్న
ప్రజావాణి దిన పత్రిక మరియు మన ప్రజావాణి NEWS TV చానల్
నందు పనిచేయుటకు జిల్లాలు మరియు మండలాల వారీగా
విలేఖరులు కావలెను
( కొత్తవారికి అవకాశం, అనుభవం కల వారికి ప్రాధాన్యత )
Ph: 9440032006

| రాజన్న సిరిసిల్ల | శనివారం | 26.09.2026 | సంపుటి : 01 | సంచిక : 267 | పేజీలు : 12 | వెల : 2/- |
|---|---|---|---|---|---|---|
| RAJANNA SIRICILLA | SATURDAY | 26.09.2026 | Volume : 01 | Issue :267 | Pages : 12 | Cost : 2/- |



## గంగమ్మ ఒడికి చేరిన ఖైరతాబాద్ గణనాథుడు

**ఘనంగా ఖైరతాబాద్ గణేశుని శోభాయాత్ర**

**భారీ భద్రతా వలయంలో హైదరాబాద్**

**11 రోజుల పాటు భక్తులతో విశేష పూజలందుకున్న ఖైరతాబాద్ గణనాథుడు గంగమ్మ ఒడికి చేరుకున్నాడు. వినాయక నిమజ్జన కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ మహాగణపతిని కడసారి దర్శించుకునేందుకు భక్తులు అశేషంగా తరలివచ్చారు.**

**హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** అశేష భక్త వాహిని జయజయధ్వానాల మధ్య ఖైరతాబాద్ వినాయకుడి నిమజ్జన కార్యక్రమం అత్యంత వైభవంగా ముగిసింది. 11 రోజుల పాటు భక్తులతో ధూపదీప నైవేద్యాలందుకున్న ఆ గణనాథుడు గంగమ్మ ఒడిని చేరుకున్నాడు. ఈ క్రతువును చూసేందుకు ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దీంతో హైదరాబాద్ నగరం జనసంద్రంగా మారింది.తొలుత బాహుబలి క్రేన్‌లో సాంకేతిక లోపంతో బడా గణేశ్ టస్కర్‌పైకి ఆలస్యంగా చేరాడు. ఉదయం 6 గంటలకు ప్రారంభం కావాల్సిన శోభాయాత్ర, క్రేన్‌లో సమస్య కారణంగా 3 గంటల ఆలస్యంగా 9 గంటలకు ప్రారంభమైంది. 'జై బోలో గణేశ్ మహరాజ్ కీ జై' అంటూ భక్తుల జయజయధ్వానాలు మిగతా2లో...

# తెలంగాణలో 200 కొత్త కోర్టులకు ఆమోదం

**తొలి దశలో అదనపు జూనియర్ సివిల్ న్యాయస్థానాల ఏర్పాటు.. కేసుల భారాన్ని తగ్గించడమే లక్ష్యం**



**హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** రాష్ట్రంలో పెరుగుతున్న కేసుల భారాన్ని తగ్గించి, ప్రజలకు స్థానికంగానే వేగంగా న్యాయ సేవలు అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రవ్యాప్తంగా తొలి దశలో 200 అదనపు జూనియర్ సివిల్ న్యాయమూర్తి, అదనపు ప్రథమ శ్రేణి న్యాయ మేజిస్ట్రేట్ న్యాయస్థానాల ఏర్పాటుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు న్యాయశాఖ కార్యదర్శి బీ. పాపిరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. **594 న్యాయస్థానాల అవసరాన్ని గుర్తించిన హైకోర్టు** రాష్ట్రంలో కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో మొత్తం 594 కొత్త న్యాయస్థానాలు, వాటికి అవసరమైన సిబ్బంది, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలని తెలంగాణ హైకోర్టు రిజిస్ట్రార్ ప్రభుత్వానికి ప్రతిపాదించినట్లు సమాచారం. దీనిపై ప్రభుత్వం స్పందించి తొలి దశగా 200 న్యాయస్థానాలకు అనుమతి మిగతా2లో...

## సీబీఎస్ఈ నూతన చైర్మన్‌గా మందీప్ కే బండారి

**- కేంద్ర మాధ్యమిక విద్యా మండలి నూతన సారథిగా సీనియర్ ఐఏఎస్ అధికారి**




## ఓటు బ్యాంకు రాజకీయాలు కాదు.. సామాజిక మార్పుపై దృష్టి

**సామాజిక సంస్కరణలు, సానుకూల మార్పు కోసం పనిచేయాలి: ప్రధాని మోదీ**



**న్యూఢిల్లీ:సెప్టెంబర్ 25 :** ఓటు బ్యాంకు రాజకీయాలపై దృష్టి పెట్టకుండా సామాజిక సంస్కరణలు, సమాజంలో సానుకూల మార్పు కోసం కృషి చేయాలని ప్రధాని నరేంద్ర మోదీ బీజేపీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. శుక్రవారం వారణాసి నుంచి వాద్‌నగర్ వరకు కొనసాగుతున్న 'సేవా యాత్ర'లో పాల్గొంటున్న వారితో మిగతా2లో...

## రేవంత్‌రెడ్డికి ఉత్తమ ప్రజాసేవకుడి పురస్కారం

**- రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్యుల సంక్షేమ పాలనకు గుర్తింపు**




## రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలి

**ప్రధాని, హోంమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేశారన్న కిషన్ రెడ్డి**



**హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాపై రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ ఆయన వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికైన ప్రజాప్రతినిధులపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇతర పార్టీల గుర్తులపై గెలిచిన పలువురు శాసనసభ్యులను మిగతా2లో...



## 'స్టాలిన్ సార్.. నోరు విప్పండి': విజయ్

**వీరమణి వ్యవహారంపై మాజీ ముఖ్యమంత్రిని ప్రశ్నించిన తమిళగ వెట్రి కళగం అధినేత**

**చెన్నై:సెప్టెంబర్ 25 :** తమిళనాడులో అధికార డీఎంకే, అన్నాడీఎంకేలపై తమిళగ వెట్రి కళగం అధినేత, ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ విమర్శలు గుప్పించారు. మదురాంతకం శాసనసభ ఉపఎన్నిక ప్రచారంలో భాగంగా శుక్రవారం నిర్వహించిన సభలో ఆయన డీఎంకేను తీవ్రంగా విమర్శిస్తూ, రెండు ద్రవిడ పార్టీల మధ్య రాజకీయ అవగాహన ఉందని ఆరోపించారు.గ్రానైట్ వ్యాపారి మిగతా2లో...

## గ్రామీణ తెలంగాణకు శాశ్వత వసతులే లక్ష్యం

**- తొలి దశలో 7,448 కి.మీ. రహదారుల అభివృద్ధి.. దసరా నాటికి పనులు ప్రారంభించాలి: మంత్రి సీతక్క**



**హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** గ్రామీణ తెలంగాణలో శాశ్వత మౌలిక వసతుల కల్పనే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి సీతక్క అన్నారు. వరంగల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గ్రామీణ రహదారుల అభివృద్ధిలో హైబ్రిడ్ వార్షిక చెల్లింపు విధానం కీలకంగా నిలవాలని ఆకాంక్షించారు. తొలి దశలో 7,448 కిలోమీటర్ల మేర రహదారులను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. దసరా నాటికి అన్ని ప్యాకేజీల్లో పనులు ప్రారంభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతి ఆవాసం నుంచి రాష్ట్ర రాజధానికి మెరుగైన రహదారి సౌకర్యం కల్పించడమే లక్ష్యమన్నారు.వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో నీటి భద్రతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని సీతక్క సూచించారు. ప్రతి జలాశయంలో నీటి మట్టాలను ప్రతిరోజూ పర్యవేక్షించి, ఏడాది తాగునీటి అవసరాలను ముందుగానే నిర్ధారించాలని అన్నారు. మిషన్ భగీరథలో సమస్యలు ఉన్న 86 జనావాసాల్లో నీటి సరఫరాను అత్యవసరంగా పునరుద్ధరించాలని ఆదేశించారు.ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి గ్రామానికి ఊటకుంట ఉండేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. "కూలీకి పని.. మిగతా2లో...

## బ్రహ్మోస్‌తో పాక్‌కు నిద్రలేని రాత్రులు

**- లఖ్నవూలో తయారవుతున్న క్షిపణితో శత్రువులకు భయం: అమిత్ షా**



**లఖ్నవూ:సెప్టెంబర్ 25 :** లఖ్నవూలో తయారవుతున్న బ్రహ్మోస్ క్షిపణితో పాకిస్థాన్‌కు నిద్రలేని రాత్రులు వచ్చాయని కేంద్ర హోంమంత్రి అమిత్ షా అన్నారు. అమేఠీలో తయారవుతున్న ఏకే203 తుపాకులతో నక్సలైట్లు, ఉగ్రవాదులకు కూడా కంటిమీద కునుకు లేకుండా మిగతా2లో...

# తెలంగాణలో 200 కొత్త కోర్టులకు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చింది. కొత్త న్యాయస్థానాల ఏర్పాటుతో కేసుల విచారణకు అదనపు సామర్థ్యం ఏర్పడటంతో పాటు న్యాయం కోసం దూర ప్రాంతాల నుంచి వచ్చే ప్రజలకు స్థానిక స్థాయిలోనే సేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంటుంది. **రంగారెడ్డికి అత్యధికంగా 30 న్యాయస్థానాలు** కొత్త న్యాయస్థానాల కేటాయింపులో రంగారెడ్డి జిల్లాకు అత్యధికంగా 30 కేటాయించారు. రాజేంద్రనగర్, ఎల్‌బీనగర్, కూకట్‌పల్లి, హయత్‌నగర్, చేవెళ్ల, షాద్‌నగర్, ఆమనగల్, ఇబ్రహీంపట్నం ప్రాంతాల్లో ఇవి ఏర్పాటు కానున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకు 25, హైదరాబాద్ నగర పరిధిలోని సిటీ సివిల్, సెషన్స్ న్యాయస్థానాల పరిధికి 16 న్యాయస్థానాలు కేటాయించారు.

ఇతర జిల్లాల్లో నల్గొండకు 10, ఖమ్మం, సంగారెడ్డికి 8 చొప్పున, కరీంనగర్, సూర్యాపేటకు 7 చొప్పున, నిజామాబాద్, జగిత్యాలకు 6 చొప్పున, సిద్దిపేట, మంచిర్యాలకు 5 చొప్పున న్యాయస్థానాలు మంజూరయ్యాయి. వరంగల్, హనుమకొండ జిల్లాలకు కలిపి 12 న్యాయస్థానాలు కేటాయించారు. **ప్రజలకు వేగవంతమైన న్యాయ సేవలపై ఆశలు** కొత్త న్యాయస్థానాల ఏర్పాటు ద్వారా ఇప్పటికే ఉన్న న్యాయస్థానాలపై కేసుల భారం కొంత మేర తగ్గే అవకాశం ఉంది. ముఖ్యంగా చిన్న, సాధారణ స్వభావం గల కేసుల విచారణకు అదనపు న్యాయస్థానాలు అందుబాటులోకి రావడం వల్ల విచారణ ప్రక్రియ మరింత సులభతరం కానుంది. అయితే న్యాయస్థానాల పూర్తి స్థాయి కార్యకలాపాలకు అవసరమైన న్యాయమూర్తులు, సిబ్బంది, భవనాలు, ఇతర మౌలిక వసతుల ఏర్పాటు కూడా కీలకం కానుంది.

# రేవంత్‌రెడ్డికి ఉత్తమ ప్రజాసేవకుడి పురస్కారం

**హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డికి కేరళకు చెందిన ఆర్యదాన్ మహమ్మద్ ఫౌండేషన్ ప్రతిష్ఠాత్మక 'ఆర్యదాన్ మహమ్మద్2026 ఉత్తమ ప్రజాసేవకుడి పురస్కారం' అందజేసింది. కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కే.సీ. వేణుగోపాల్ చేతుల మీదుగా ముఖ్యమంత్రి పురస్కారాన్ని స్వీకరించారు. ఈ పురస్కారం కింద రూ.లక్ష నగదు బహుమతి, ప్రశంసాపత్రం, జ్ఞాపికను అందించారు. **సంక్షేమ కార్యక్రమాలకు గుర్తింపు** తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య ప్రజల సంక్షేమం కోసం చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, దూరదృష్టితో కూడిన నాయకత్వాన్ని పరిగణనలోకి తీసుకుని రేవంత్‌రెడ్డిని పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ చైర్మన్, నిలంబూర్ శాసనసభ్యుడు ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. ప్రజాస్వామిక విలువల పట్ల ముఖ్యమంత్రి చూపుతున్న నిబద్ధతను ఎంపిక కమిటీ ప్రత్యేకంగా ప్రశంసించినట్లు వెల్లడించారు.

**ముగ్గురితో కూడిన ఎంపిక కమిటీ** పురస్కార ఎంపిక కమిటీలో పార్లమెంట్ సభ్యుడు బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ శాఖ మంత్రి ఏ.పీ. అనిల్‌కుమార్, ప్రముఖ మేధావి కల్పెట్ట నారాయణన్ ఉన్నారు. ఈ కమిటీ పరిశీలన అనంతరం రేవంత్‌రెడ్డిని పురస్కారానికి ఎంపిక చేసింది.

కేరళకు చెందిన ఈ పురస్కారాన్ని తొలిసారిగా కేరళ వెలుపలికి చెందిన వ్యక్తికి అందిస్తున్నట్లు కార్యక్రమంలో పేర్కొన్నారు. **ఆర్యదాన్ మహమ్మద్ స్మారకార్థం** కేరళకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ మంత్రి ఆర్యదాన్ మహమ్మద్ స్మారకార్థం ఈ పురస్కారాన్ని ఏర్పాటు చేశారు. ఆయన ఎనిమిదిసార్లు శాసనసభ్యుడిగా ఎన్నికై, నాలుగు వేర్వేరు మంత్రివర్గాల్లో మంత్రిగా పనిచేశారు. ప్రజా సంక్షేమం, లౌకిక విలువలు, ప్రజాస్వామిక విధానాల పట్ల ఆయనకున్న నిబద్ధతకు గుర్తింపుగా ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని కొనసాగిస్తోంది. ఆర్యదాన్ మహమ్మద్ నాలుగో వర్ధంతి సందర్భంగా నిలంబూర్‌లో ఈ అవార్డు ప్రదాన కార్యక్రమం నిర్వహించారు.

**వేడుకలో రేవంత్‌రెడ్డి ప్రసంగం** పురస్కారం స్వీకరించిన అనంతరం రేవంత్‌రెడ్డి ఆర్యదాన్ మహమ్మద్ ప్రజా జీవితాన్ని స్మరించుకున్నారు. కేరళలో లౌకిక విలువలు, ప్రజాస్వామ్య భావాలకు ఉన్న ప్రాధాన్యాన్ని ప్రస్తావించారు. పురస్కారాన్ని తన వ్యక్తిగత గౌరవంగా కాకుండా కాంగ్రెస్ కార్యకర్తగా అందుకుంటున్న గుర్తింపుగా పేర్కొన్నారు. కే.సీ. వేణుగోపాల్ ఆర్యదాన్ మహమ్మద్ స్మారక ఉపన్యాసం చేశారు.

# చైనాలో చదువుకోండి.. అమెరికా యువతకు జిన్‌పింగ్ ఆహ్వానం

### ఐదేళ్లలో లక్ష మంది యువతను ఆహ్వానిస్తాం.. విద్య, సాంస్కృతిక మార్పిడితో సంబంధాలు బలోపేతం

**వాషింగ్టన్,సెప్టెంబర్ 25 :** చైనాఅమెరికా సంబంధాలను ప్రజల స్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కీలక ప్రతిపాదన చేశారు. వచ్చే ఐదేళ్లలో లక్ష మంది అమెరికా యువతను చైనాకు ఆహ్వానించనున్నట్లు ఆయన ప్రకటించారు. విద్య, పర్యటనలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఈ అవకాశాలను కల్పించనున్నట్లు తెలిపారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో కలిసి వాషింగ్టన్‌లో చేసిన సంయుక్త ప్రకటనలో జిన్‌పింగ్ ఈ విషయాన్ని వెల్లడించారు.



**ఇప్పటికే 50 వేల మంది లక్ష్యం పూర్తి** 2023లో తాను ప్రకటించిన 50 వేల మంది అమెరికా యువతను చైనాకు ఆహ్వానించాలన్న లక్ష్యం నిర్ణీత గడువుకు ముందుగానే పూర్తయిందని జిన్‌పింగ్ తెలిపారు. దీనికి కొనసాగింపుగా మరో ఐదేళ్లలో లక్ష మంది యువతను విద్యా, సాంస్కృతిక మార్పిడి కార్యక్రమాల కోసం ఆహ్వానించనున్నట్లు చెప్పారు. ఇరుదేశాల మధ్య పరస్పర అవగాహన పెరగడానికి యువత మార్పిడి కార్యక్రమాలు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు. చైనాఅమెరికా సంబంధాల భవిష్యత్తు ఇరు దేశాల ప్రజలపై, ముఖ్యంగా యువతపై ఆధారపడి ఉందని జిన్‌పింగ్ అన్నారు. ప్రజల మధ్య స్నేహం బలపడితే రెండు దేశాల మధ్య సంబంధాలకు మరింత స్థిరమైన పునాది ఏర్పడుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. **చారిత్రక సంబంధాలను గుర్తుచేసిన జిన్‌పింగ్** రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా చైనా, అమెరికా ప్రజలు కలిసి పోరాడిన విషయాన్ని జిన్‌పింగ్ ప్రస్తావించారు. ఆ చారిత్రక సహకారాన్ని ఇరు దేశాల ప్రజలు గుర్తుంచుకున్నారని చెప్పారు. చైనా తన జాతీయ పునరుజ్జీవన లక్ష్యాలను సాధించడం, అమెరికా తన దేశాన్ని మరింత బలోపేతం చేసుకోవడం రెండూ పరస్పర విరుద్ధమైన లక్ష్యాలు కావని పేర్కొన్నారు. ఇరు దేశాలు ప్రజల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకుని సహకారాన్ని పెంచుకోవాలని, ప్రజల మధ్య స్నేహాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. ప్రపంచ శాంతి, సుస్థిరతకు ఇరు దేశాల మధ్య స్థిరమైన సంబంధాలు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. **ఉమ్మడి ప్రయోజనాలపై ట్రంప్ దృష్టి** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఇరు దేశాల మధ్య ఉమ్మడి ప్రయోజనాలపై దృష్టి పెట్టాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో జపాన్‌కు వ్యతిరేకంగా చైనాకు అమెరికా అందించిన సహాయాన్ని గుర్తుచేశారు. భద్రత, సాంకేతికత, కృత్రిమ మేధస్సు వంటి కీలక రంగాల్లో ఇరుదేశాల నాయకులు తీసుకునే నిర్ణయాలు భవిష్యత్ దశాబ్దాల్లో శాంతి, సౌభాగ్యంపై ప్రభావం చూపగలవని అన్నారు. ప్రస్తుతం వాణిజ్యం, సాంకేతికత, భద్రత వంటి అంశాల్లో అమెరికాచైనా మధ్య విభేదాలు కొనసాగుతున్నప్పటికీ, తాజా భేటీలో ఇరు దేశాల మధ్య సంభాషణ, సహకారం కొనసాగించాలనే అంశానికి ప్రాధాన్యం లభించింది. **యువత మార్పిడికి ప్రాధాన్యం** జిన్‌పింగ్ ప్రకటించిన లక్ష మంది యువత ఆహ్వానం ఇరు దేశాల మధ్య విద్యా, సాంస్కృతిక సంబంధాలను ప్రజల స్థాయిలో విస్తరించే ప్రతిపాదనగా నిలిచింది. ప్రభుత్వాల మధ్య చర్చలతో పాటు విద్యార్థులు, యువత, విద్యా సంస్థలు, సాంస్కృతిక వర్గాల మధ్య ప్రత్యక్ష సంబంధాలను పెంచడం ద్వారా పరస్పర అవగాహనను మెరుగుపరచాలన్న ఉద్దేశం ఇందులో కనిపిస్తోంది. తాజా అమెరికా పర్యటనలో జిన్‌పింగ్, ట్రంప్ ద్వైపాక్షిక సంబంధాల భవిష్యత్తుపై చర్చలు జరిపిన నేపథ్యంలో ఈ ప్రకటన వెలువడింది.

# ఐక్యత చాటిన తెలంగాణ.. ప్రశాంతంగా గణేష్ నిమజ్జనాలు

### రాష్ట్రవ్యాప్తంగా 88 వేల విగ్రహాల నిమజ్జనం.. హైదరాబాద్‌లో 25 వేల మందికిపైగా పోలీసులతో బందోబస్తు

**హైదరాబాద్,సెప్టెంబర్ 25 :** తెలంగాణలో గణేష్ నిమజ్జనోత్సవాలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని డీజీపీ సి.వి. ఆనంద్ తెలిపారు. ప్రజలు సంయమనం, సహకారంతో ఉత్సవాలను నిర్వహిస్తూ రాష్ట్ర ఐక్యతను చాటారని పేర్కొన్నారు. శుక్రవారం డీజీపీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నిమజ్జన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, ఇప్పటివరకు పూర్తయిన నిమజ్జనాల వివరాలను వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా గణేష్ ఉత్సవాల కోసం ఏర్పాటు చేసిన విగ్రహాల్లో 1.24 లక్షలు అధికారిక పోర్టల్‌లో నమోదయ్యాయని డీజీపీ తెలిపారు. గతేడాది నమోదైన సంఖ్యతో పోలిస్తే ఈసారి పెరుగుదల నమోదైందన్నారు. ఇళ్లు, అపార్ట్‌మెంట్లు, వ్యక్తిగత ప్రదేశాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను కలిపితే రాష్ట్రవ్యాప్తంగా మొత్తం సంఖ్య 3.5 నుంచి 4 లక్షల వరకు ఉండే అవకాశం ఉందని వివరించారు. శుక్రవారం ఉదయం వరకు సుమారు 88 వేల విగ్రహాల నిమజ్జనం పూర్తయిందని, మిగిలిన విగ్రహాల నిమజ్జనం శనివారం ఉదయానికి పూర్తయ్యే అవకాశం ఉందని తెలిపారు.



**భారీ బందోబస్తు.. సమన్వయంతో ఏర్పాట్లు** హైదరాబాద్‌లో నిమజ్జనోత్సవాల కోసం గత పది రోజులుగా 25 వేల మందికిపైగా పోలీసు సిబ్బందిని బందోబస్తులో వినియోగించినట్లు డీజీపీ తెలిపారు. రద్దీ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణ, భద్రత కోసం పోలీసు శాఖతో పాటు వివిధ ప్రభుత్వ విభాగాలు సమన్వయంతో పనిచేశాయని చెప్పారు. నిమజ్జన మార్గాలు, వంతెనలు, రహదారులను ముందుగానే పరిశీలించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. **శోభాయాత్రలకు కొంత ఆలస్యం** శుక్రవారం కావడంతో మతపరమైన అంశాలను గౌరవిస్తూ హైదరాబాద్‌లో కొన్ని శోభాయాత్రలు మధ్యాహ్నం కొంత ఆలస్యంగా ప్రారంభమయ్యాయని ఆనంద్ వివరించారు. దీంతో కొన్ని ప్రాంతాల్లో నిమజ్జన ప్రక్రియ కూడా ఆలస్యంగా కొనసాగుతోందన్నారు. ముఖ్యంగా హైదరాబాద్‌లో భారీ సంఖ్యలో విగ్రహాలు ఒకేసారి నిమజ్జనానికి తరలివస్తుండటంతో సమయం పడుతోందని తెలిపారు. అయినప్పటికీ ప్రజలు, ఉత్సవ కమిటీలు, పోలీసులు పరస్పరం సహకరించుకో వడంతో నిమజ్జనాలు ప్రశాంతంగా కొనసాగుతు న్నాయని పేర్కొన్నారు. గణేష్ ఉత్సవాల ప్రారంభం నుంచే భద్రతపై ప్రత్యేక దృష్టి పెట్టిన పోలీసు శాఖ.. విగ్రహాల వివరాలను నమోదు చేయ డం, నిమజ్జన మార్గాలను ముందస్తుగా గుర్తించడం, రద్దీ ప్రాంతాలను పర్యవేక్షించడం వంటి చర్యలు చేపట్టింది.

# గంగమ్మ ఒడికి చేరిన ఖైరతాబాద్ గణనాథుడు

(మొదటి పేజీ తరువాయి)

మార్మోగాయి. అశేష భక్తజనావళి నినాదాల మధ్య ఆ గణనాథుడు గంగమ్మ ఒడిని చేరాడుబడా గణేశ్ శోభాయాత్ర ఆద్యంతం కన్నుల పండువగా సాగింది. భక్తుల కోలాహలం మధ్య సంప్రదాయ మేళతాళాలతో ఖైరతాబాద్ గణేశుడి శోభాయాత్ర ట్యాంక్‌బండ్ క్రేన్ 4 వద్దకు చేరుకుంది. భక్తులు గణనాథుడిపైకి పుష్పాలు చల్లుతూ, డోలు వాయిస్తూ శోభాయాత్రలో పాల్గొన్నారు. ఆ గణనాథుని కడసారి చూసేందుకు జనం తండోపతండాలుగా తరలివచ్చారు. దారి పొడవునా జై బోలో గణేశ్ మహరాజ్ కీ అంటూ నీరాజనాలు పలికారు. సెన్సేషన్ థియేటర్, టెలిఫోన్ భవన్, తెలుగు తల్లి ఫ్లైఓవర్ పక్క నుంచి సచివాలయం మీదుగా సాగర తీరానికి గణేశుడు చేరుకున్నాడు. నిమజ్జనాల సందర్భంగా హైదరాబాద్‌లో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. గణేశ్ నిమజ్జనాల సందర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా అధికారులు చర్యలు చేపట్టారు. నగరాన్ని భారీ భద్రతా వలయంలోకి తీసుకొచ్చారు. 20 వేల మందికి పైగా సిబ్బందితో పాటు కేంద్ర బలగాలను రంగంలోకి దించారు. ఇక మహా నిమజ్జన శోభాయాత్రను క్షణక్షణం పర్యవేక్షించేందుకు హైదరాబాద్ సిటీ పోలీస్ అత్యాధునిక సాంకేతికతను వినియోగించింది. 10 వేల సీసీ కెమెరాలు, 24 డ్రోన్లు, హైరైజ్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేసింది.

# సీబీఎస్‌ఈ నూతన చైర్మన్‌గా మందీప్ కే బండారి

**న్యూఢిల్లీ:సెప్టెంబర్ 25 :** కేంద్ర మాధ్యమిక విద్యా మండలి నూతన చైర్మన్‌గా సీనియర్ ఐఏఎస్ అధికారి మందీప్ కే బండారి నియమితులయ్యారు. ఆయన నియామకానికి కేబినెట్ నియామకాల కమిటీ శుక్రవారం ఆమోదం తెలిపింది. ఇటీవల పరీక్షల నిర్వహణ, తెరపై మార్కుల నమోదుకు సంబంధించి విమర్శలు ఎదుర్కొన్న కేంద్ర మాధ్యమిక విద్యా మండలికి ఆయన సారథ్యం వహించనున్నారు. మందీప్ కే బండారి 2001 బ్యాచ్‌కు చెందిన అగ్ముట్ కేడర్ ఐఏఎస్ అధికారి. వైద్య విద్యలో పట్టా పొందిన ఆయన ఎంబీబీఎస్‌లో స్వర్ణ పతకం సాధించారు. రెండు దశాబ్దాలకు పైగా పరిపాలనా రంగంలో సేవలందించిన ఆయన, ఇకపై విద్యా వ్యవస్థలో సంస్కరణ లు, పరీక్షల నిర్వహణ తదితర అంశాలపై దృష్టి సారించనున్నారు. చైర్మన్ పదవిని తాత్కాలికంగా అదనపు కార్యదర్శి స్థాయికి మార్చడంతో ఆయనకు అదే స్థాయి వేతన, భత్యాలు వర్తించనున్నాయి.

# ఓటు బ్యాంకు రాజకీయాలు కాదు.. సామాజిక మార్పుపై దృష్టి

(మొదటి పేజీ తరువాయి)

దృశ్య మాధ్యమం ద్వారా మాట్లాడారు. గత 12 ఏళ్లలో నగరాలు, గ్రామాల మధ్య అంతరం గణనీయంగా తగ్గిందని, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు మెరుగుపడ్డాయని మోదీ పేర్కొన్నారు. మహిళల స్వావలంబన కూడా పెరిగిందన్నారు. మహాత్మా గాంధీ స్వాతంత్ర్య పోరాటంతో పాటు సామాజిక సంస్కరణల కోసం కృషి చేశారని గుర్తుచేశారు. ప్రయాగ్‌రాజ్‌లో పారిశుద్ధ్య పనులు చేపట్టిన వారి సేవలను ప్రధాని ప్రశంసించారు. వారి కృషితో కుంభమేళాకు పారిశుద్ధ్య నిర్వహణలో ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు లభించిందన్నారు. సమాజానికి సేవ చేసేవారికి తగిన గౌరవం దక్కాలని, సేవా యాత్ర తన జీవితంలో ఎంతో ప్రాధాన్యమైనదని మోదీ పేర్కొన్నారు.

# 'స్టాలిన్ సార్.. నోరు విప్పండి': విజయ్

(మొదటి పేజీ తరువాయి)

ఆర్. వీరమణికి సంబంధించిన బాలలపై లైంగిక నేరాల నిరోధక చట్టం కేసును విజయ్ ప్రస్తావించారు. గత డీఎంకే ప్రభుత్వ హయాంలోనే కేసు నమోదైనప్పటికీ దర్యాప్తు తీరుపై ప్రశ్నలు తలెత్తాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై మాజీ ముఖ్యమంత్రి ఎం.కె. స్టాలిన్‌ను ఉద్దేశించి 'స్టాలిన్ సార్.. నోరు విప్పండి' అని ప్రశ్నించారు. కేసులో పోలీసులు తొలుత దర్యాప్తు ముగించేందుకు నివేదిక సమర్పించగా, ప్రత్యేక న్యాయస్థానం దానిని తిరస్కరించి తదుపరి దర్యాప్తుకు ఆదేశించింది. అనంతరం వీరమణితో పాటు మరికొందరిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే, గత ప్రభుత్వం ఎవరినీ కాపాడేందుకు ప్రయత్నించలేదని స్టాలిన్ స్పష్టం చేశారు. తన ప్రభుత్వంపై వస్తున్న ఆరోపణలు అసత్యమైనవని ఆయన పేర్కొన్నారు.

# బ్రహ్మోస్‌తో పాక్‌కు నిద్రలేని రాత్రులు

(మొదటి పేజీ తరువాయి)

పోయిందని పేర్కొన్నారు. గ్రేటర్ నోయిడాలో ఉత్తరప్రదేశ్ వాణిజ్య ప్రదర్శన ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడారు. ఉత్తరప్రదేశ్ రక్షణ పారిశ్రామిక మార్గంలో ఝాన్సీ, చిత్రకూట్, లఖ్నవూ, ఆగ్రా, అలీగఢ్, కాన్పూర్ ప్రాంతాల్లో పెట్టుబడులు వస్తున్నాయని అమిత్ షా తెలిపారు. అంతర్జాతీయంగా ప్రతికూల పరిస్థితులు ఉన్నప్పటికీ భారత్ ఆర్థికంగా పురోగమిస్తోందని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో వివిధ దేశాలతో పలు స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదిరాయని పేర్కొన్నారు.

# రాహుల్ గాంధీ బహిరంగ క్షమాపణ చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్‌లో చేర్చుకున్నారని కిషన్ రెడ్డి ఆరోపించారు.
దానం నాగేందర్ విషయంలో సుప్రీంకోర్టు అనర్హత వేటు నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఈ అంశాలపై రాహుల్ గాంధీ, కాంగ్రెస్ నాయకత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

# గ్రామీణ తెలంగాణకు శాశ్వత వసతులే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

గ్రామానికి శాశ్వత ఆస్తి" అనే లక్ష్యంతో ఉపాధి పనులు చేపట్టాలని తెలిపారు.
అక్టోబర్ 2న జరిగే గ్రామసభల్లో వచ్చే ఏడాది చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ప్రజలతో చర్చించి ఆమోదించాలని అధికారులకు సూచించారు.

# హైదరాబాద్‌లో రాపిడో ఫుడ్ డెలివరీ సేవలు




**హైదరాబాద్,సెప్టెంబర్ 25** బెంగళూరు తర్వాత రాపిడో సంస్థ తన ఓన్లీ ఫుడ్ డెలివరీ సేవలను హైదరాబాద్‌లోకి విస్తరించింది. ఇది జీరో కమిషన్ మోడల్‌పై పని చేస్తోంది. దీని సహ వ్యవస్థాపకుడు అరవింద్ శంకర్ మాట్లాడుతూ, హైదరాబాద్ గొప్ప ఫుడ్ నగరమని, కస్టమర్లకు నిజమైన ధరలకే ఆహారం అందిస్తామని తెలిపారు. ఈ యాప్ ద్వారా రెస్టారెంట్లకు ఎలాంటి కమిషన్ భారం ఉండదని, ప్రస్తుతం ఇది 20 వేలకు పైగా రెస్టారెంట్లతో భాగస్వామ్యం కలిగి ఉందని కంపెనీ వెల్లడించింది.

# ధర్మారావుపేట్ పాఠశాలకు టీవీ విరాళం



**ధర్మారావుపేట్:** ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించేందుకు టీవీ అవసరమని ఉపాధ్యాయులు చేసిన విజ్ఞప్తికి స్పందించిన గ్రామ సర్పంచ్ కొత్త ధర్మయ్య, బోనగిరి ప్రభాకర్ తమ సొంత ఖర్చులతో టీవీని కొనుగోలు చేసి పాఠశాలకు అందజేశారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి సహకరించిన కొత్త ధర్మయ్య, బోనగిరి ప్రభాకర్‌లకు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వి.బి.జి. రామ్‌జీ ఫీల్డ్ అసిస్టెంట్ కొత్త సతీష్, అంగన్‌వాడీ ఉపాధ్యాయురాలు దాసరి ప్రసన్న, గ్రామ సభ్యులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో వినాయక శోభాయాత్ర.. స్వామివారికి హారతి ఇచ్చిన మొలుగు ఆనంద్ రావు





**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 25 (ప్రజావాణి):** కూకట్‌పల్లి నియోజకవర్గంలో శ్రీ వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించినఎ వినాయక శోభాయాత్రలో బీఆర్ఎస్ నాయకుడు మొలుగు ఆనంద్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వినాయకుడికి ప్రత్యేక హారతి ఇచ్చి, కొబ్బరికాయ కొట్టి స్వామివారిని భక్తిశ్రద్ధలతో పూజించారు. ఈ కార్యక్రమంలో కురుమయ్య తిరుపతిరావు, ధర్మేని వెంకట్రావు, కురుమయ్య, కొండలరావు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శోభాయాత్ర భక్తుల సందడితో, ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది.

# బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్ భరోసా

- బాధితుడికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు
- ఎమ్మెల్సీ దండే విఠల్ చేతుల మీదుగా అందజేత
- కార్యక్రమంలో కాంగ్రెస్ యువ నాయకుడు కుశాభ్‌రావు



**కొమురంభీమ్/సిర్పూర్ ( టీ), సెప్టెంబర్ 25, (ప్రజావాణి ప్రతినిధి)** సిర్పూర్(టి): మండలం పారిగాం గ్రామానికి చెందిన దంద్రే గోపాల్ (దంద్రే రామారావు)కు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సాయం అందింది. శుక్రవారం ఎమ్మెల్సీ దండే విఠల్ తన నివాసంలో గోపాల్‌కు చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో పారిగాం కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు చౌదరి కుశాభ్‌రావు పాల్గొన్నారు. తనకు ఆర్థిక సహాయం అందేలా చొరవ చూపిన ఎమ్మెల్సీ దండే విఠల్, కుశాభ్‌రావుకు గోపాల్ కృతజ్ఞతలు తెలిపారు.

# అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో వైభవంగా గణనాథుడి నిమజ్జనోత్సవం





**దండేపల్లి: సెప్టెంబర్ 25 (ప్రజావాణి)** మండలంలోని తాళ్లపేట గ్రామంలో అంబేద్కర్ యూత్ ఆధ్వర్యంలో గురువారం వినాయకుడి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వినాయక నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించిన అనంతరం గణనాథుడి నిమజ్జనాన్ని అంగరంగ వైభవంగా చేపట్టారు. ఈ సందర్భంగా వినాయక విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించి, గ్రామంలోని ప్రధాన వీధుల గుండా భారీ శోభాయాత్ర నిర్వహించారు. యువకులు, మహిళలు డప్పులు, ఆటపాటలు, నృత్యాలతో ఉత్సాహంగా పాల్గొనగా, భక్తులు భక్తిశ్రద్ధలతో గణనాథుడికి వీడ్కోలు పలికారు. 'జై బోలో గణేష్ మహారాజ్‌కి జై' అంటూ నినాదాలతో గ్రామంలో సందడి నెలకొంది. అంబేద్కర్ యూత్ సభ్యులు నిమజ్జన కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహించారు. గ్రామంలోని యువత, భక్తులు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిమజ్జన శోభాయాత్రను విజయవంతం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించారు.

# భవిష్యత్ గ్రామాభివృద్ధికి సమగ్ర ప్రణాళిక -- అడవిదేవులపల్లి మండలంలో VGPP అవగాహన కార్యక్రమం





**ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం సెప్టెంబర్ 25** VB G RAM G కార్యక్రమం కింద విలేజ్ గ్రామ పంచాయతీ ప్లాన్ (VGPP) తయారీపై అడవిదేవులపల్లి మండలంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల భవిష్యత్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని సమగ్ర ప్రణాళికను రూపొందించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యంగా వివరించారు. ఈ కార్యక్రమంలో వీణా హందాని, MPO ఎం.డి. మొహిసిన్ బిన్ అహ్మద్, APO సూరా నాయక్‌తో పాటు మండలంలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు (FAs) మరియు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోషల్ మ్యాపింగ్, రిసోర్స్ మ్యాపింగ్ నిర్వహించే విధానం, గ్రామ అవసరాలు, అందుబాటులో ఉన్న వనరులు మరియు భవిష్యత్ అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులను ఎంపిక చేసే విధానంపై అధికారులకు మార్గదర్శకత్వం అందించారు. ప్రతి గ్రామ పంచాయతీలో స్థానిక వనరులను గుర్తించి పక్క ప్రణాళికలతో అభివృద్ధి పనులు చేపట్టినప్పుడే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని MPDO హందాని సూచించారు. ప్రజల భాగస్వామ్యం మరియు వివిధ శాఖల మధ్య సమన్వయంతో గ్రామాల సమగ్ర, సుస్థిర అభివృద్ధికి అవసరమైన పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో ప్రణాళిక రూపొందించాలని తెలిపారు.

# ఆరోగ్య సంరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర కీలకం

- పలాస ఎమ్మెల్యే శ్రీమతి గౌతు శిరీష





**పలాస ప్రజావాణి ప్రతినిధి** ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో, ప్రజారోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టుల పాత్ర అత్యంత కీలకమైనదని పలాస ఎమ్మెల్యే శ్రీమతి గౌతు శిరీష పేర్కొన్నారు. వరల్డ్ ఫార్మసిస్ట్ డే సందర్భంగా పలాస ఎమ్మెల్యే కార్యాలయంలో ఫార్మసిస్టులతో కలిసి కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఫార్మసిస్టులందరికీ వరల్డ్ ఫార్మసిస్ట్ డే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీమతి గౌతు శిరీష మాట్లాడుతూ, వైద్యులు సూచించిన మందులను రోగులకు సక్రమంగా అందించడంతో పాటు వాటి మోతాదు, వినియోగ విధానం, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడంలో ఫార్మసిస్టులు కీలక బాధ్యత నిర్వహిస్తున్నారని అన్నారు. ముఖ్యంగా ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు మందుల వినియోగంపై సరైన సూచనలు అందిస్తూ, ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఫార్మసిస్టులు నిరంతరం సేవలందిస్తున్నారని కొనియాడారు.

కరోనా మహమ్మారి సమయంలో ఫార్మసీ రంగం అందించిన సేవలు మరువలేనివని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కోవిడ్ వ్యాక్సిన్లు, ఔషధాల తయారీ, సరఫరా మరియు అవసరమైన మందులు ప్రజలకు అందుబాటులో ఉండేలా చేయడంలో ఫార్మసీ రంగానికి చెందిన వారు విశేషంగా కృషి చేశారని తెలిపారు. అత్యంత క్లిష్టమైన పరిస్థితుల్లో సైతం ప్రజలకు అవసరమైన ఔషధ సేవలు అందించడంలో ఫార్మసిస్టులు బాధ్యతాయుతంగా వ్యవహరించారని అభినందించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ ప్రజారోగ్య కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు సమర్థవంతంగా చేరేలా చేయడంలో ఫార్మసిస్టులు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని ఎమ్మెల్యే సూచించారు. మందుల సరైన వినియోగం, ఆరోగ్యంపై అవగాహన, ప్రభుత్వ వైద్య సేవలు మరియు ఆరోగ్య కార్యక్రమాల గురించి ప్రజలకు తెలియజేయడంలో మరింత చొరవ చూపాలని కోరారు.

వైద్య ఆరోగ్య వ్యవస్థలో వైద్యులు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందితో పాటు ఫార్మసిస్టులు కూడా ఒక ముఖ్యమైన భాగమని పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటమే లక్ష్యంగా అంకితభావంతో సేవలందిస్తున్న ఫార్మసిస్టుల సేవలను సమాజం గుర్తించాలని అన్నారు. భవిష్యత్తులోనూ ఫార్మసిస్టులు ప్రజలకు నాణ్యమైన ఔషధ సేవలు అందిస్తూ, ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షిస్తూ వరల్డ్ ఫార్మసిస్ట్ డే సందర్భంగా ఫార్మసిస్టులందరికీ ఎమ్మెల్యే శ్ గౌతు శిరీష హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోనెల గోపాల్, జిల్లా అధ్యక్షుడు రేజేటి సుబ్రహ్మణ్యం, సీనియర్ ఫార్మసీ ఆఫీసర్ రమేష్, ఫార్మసీ ఆఫీసర్లు లీల, ఎ. స్వర్ణ, సతీష్, శైలజ, దీప, తులసి, ఎస్. స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

# అప్పుల ఊబిలో అభాగ్యుడు.. ఉపాధి లేని బ్రతుకులు...?

- రేపటి భరోసా కోసం మనుషుల ఎదురు చూపులు.
- అప్పులు తీర్చలేక సతమతమవుతున్న మధ్యతరగతి బ్రతుకులు.
- అప్పుల వలయం.. కోల్పోతున్న ఆత్మగౌరవం..?
- అప్పుల వాళ్ళ ఒత్తిళ్లతో క్షణికావేశంలో ప్రాణాలు తీసుకుంటున్నోలెందరో.
- ఉపాధి లేని చోట.. ఉచితాలతో ప్రయోజనం ఏమిటి...?
- చదువుకున్న నిరుద్యోగులు పనులు దొరక్క రోడ్లపై తిరుగు తున్నారు.
- ఖాళీగా ఉన్న నిరుద్యోగులకు పని కల్పించే నాధుడే కరువు
- చేతికి పనిలేదు.. కడుపుకు తిండి లేదు...?
- అన్నదానాలు పెట్టేది ఎక్కడో అని వెతకడం..?
- మనిషి తన శ్రమశక్తి ని స్వాభిమానాన్ని కోల్పోతుండు.
- రేషన్ బియ్యం తప్ప గతి లేదు..కూరగాయలకు కొనేందుకు పైసలు లేవు.

**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25** చిదుముతున్న మధ్య తరగతి బతుకులపై మన ప్రజావాణి ప్రత్యేక కథనం.




తెలంగాణలో నేడు సామాన్యుడి బ్రతుకు ఒక విషాద నాటకంగా మారింది...చేతిలో చిల్లిగవ్వ లేదు , కుటుంబ పోషణ భారమైంది , అప్పుల ఊబిలో కూరుకు పోయిన మనిషికి రేపటి భరోసా పూర్తిగా కరువైంది..! అప్పు ఇచ్చినవాడి బాధ ఒకెత్తయితే...ఆ అప్పు తీర్చలేక సతమతమ వుతున్న వాడి బాధ వర్ణనాతీతం..ఈ దయ నీయ స్థితిలో పండగలు వస్తే కనీసం కుటుంబానికి కొత్త బట్టలు కొనుక్కునే స్థోమత కూడా లేని దుస్థితిలో ఎంతోమంది సామాన్యులు కొట్టు మిట్టాడుతున్నారు..?

అప్పుల వలయం.. కోల్పోతున్న ఆత్మ గౌరవం...!

సక్రమమైన సంపాదన లేకపోవడంతో రోజువారీ ఖర్చుల కోసం , అనారోగ్య ఖర్చుల కోసం ప్రైవేట్ వడ్డీ వ్యాపారులను శ్రయించక తప్పని పరిస్థితి ఏర్పడింది..!

విపరీతంగా పెరిగి పోతున్న వడ్డీలు , అసలు తీర్చే మార్గం లేక మానసిక కుంగుబాటుకు గురవు తున్న కుటుంబాలు..!

సమాజంలో ఎవరి ముందూ తలెత్తుకుని మాట్లాడే పరిస్థితి లేకపోవడం ("బయట మాట లేదు") , అప్పుల వాళ్ళ ఒత్తిళ్లు భరించలేక క్షణికావేశంలో ప్రాణాలు తీసుకుంటున్న నిరుపేదల ఉదంతాలు కంటతడి పెట్టిస్తున్నాయి..?

ఉపాధి లేని చోట ఉచితాల వల్ల ప్రయోజనం ఏమిటి...?

ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు , ప్రభుత్వాలు ఇస్తున్న ఉచితాలు తాత్కాలికంగా ఆకలి తీర్చగలవేమో కానీ , శాశ్వత ఆర్థిక భద్రతను ఇవ్వలేవు..!

చేతికి పని లేదు.. కడుపుకు నిండా లేదు...

ఆత్మగౌరవంతో కూడిన బ్రతుకు ఇస్తే..? మనిషి తలెత్తుకుని బ్రతుక గలడు...కానీ , ఉపాధి అవకాశాలు లేకుండా కేవలం ఉచితాల మీద ఆధారపడేలా చేయడం వల్ల మనిషి తన శ్రమ శక్తిని , స్వాభిమానాన్ని కోల్పోతున్నాడు..?

చదువుకున్న యువతకు ఉద్యోగాలు లేక...ఉపాధి మార్గాలు కరువై నిరాశ నిస్పృహల్లో కూరుకు పోతున్నారు...కళ్ళకు కనబడటం లేదా పెద్దలకు..? ఒకప్పుడు పండగ వచ్చిందంటే ఇంటిల్లపాదికి కొత్త బట్టలు , నచ్చిన పిండి వంటలు , కళకళలాడే ముఖాలతో ఉండేవి..కానీ నేడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది... కడుపున పుట్టిన పిల్లలకు కనీసం నూలు పోగు బట్టలు కొనివ్వలేని నిస్సహాయ స్థితిలో తల్లి దండ్రులు కుమిలి పోతున్నారు. పండగ పూట కూడా పూట గడవని పరిస్థితి ఉంటే , ఆ ఇళ్లలో పండుగ సంబరాలు ఎలా ఉంటాయి..? తినడానికి కేవలం రేషన్ బియ్యం ఇచ్చి చేతులు దులుపు కుంటే సరిపోతుందా ఆ బియ్యం వండుకోవడానికి కావలసిన కూరగాయలు కొనే స్థోమతను కూడా కేంద్ర ప్రభుత్వాలు ఆలోచించాలి కదా..?

ప్రభుత్వాలు కేవలం సంక్షేమ హామీలతో సరి పెట్టకుండా , పారిశ్రామికీ కరణ , ఉద్యోగ కల్పన , స్థానిక ఉపాధి అవ కాశాలు మెరుగుపరిచే దిశగా అడుగులు వేయాలి..! మనిషికి భిక్షం వేయడం కాదు , తన కాళ్ళ మీద తాను నిల బడేలా చేయడమే నిజ మైన ప్రజాస్వామ్య పాలన అవుతుంది..లేదంటే ఈ ఆర్థిక అసమానతల సమాజాన్ని మరింత లోతైన సంక్షోభంలోకి నెట్టేస్తాయి. ఎందుకో... సారే...పెద్ద సారే కావాలనే కోరిక... ఎందుకంటే ఆర్థిక సంక్షోభాన్ని అర్థం చేసు కొని చదువుకున్న నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి..

చౌక ధర దుకాణాలలో ఉచిత బియ్యంతో పాటు నిత్యవసర సరుకులు కూడా ఉచితంగా పంపిణీ చేసి పేద , మధ్య తరగతి ప్రజలను ఆదుకునే సారే కావాలనుకునే కోరిక తెలంగాణ రాష్ట్రంలో మొదలైతే అప్పుడు నిజమైన మార్పు వస్తుందని ఆశిద్దాం..పెద మధ్య తరగతి బ్రతుకులపై మన ప్రజావాణి దినపత్రిక మరో కథనంలో చూద్దాం.

# ఖమ్మం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

- ఏఐకేఎంఎస్ జిల్లా కమిటీ పిలుపు



**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి, సెప్టెంబర్ 25:** రైతు, వ్యవసాయ కూలీలు, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేయాలని అఖిల భారత రైతు--కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) పెద్దపల్లి జిల్లా కమిటీ పిలుపునిచ్చింది. ఈ నెల 28, 29, 30 తేదీల్లో ఖమ్మం జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఏఐకేఎంఎస్ జాతీయ 4వ మహాసభలు, బహిరంగ సభలను విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు మేరుగు చంద్రయ్య మాట్లాడుతూ రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమగ్రంగా స్పందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో రైతులు, వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వాలు పూర్తిస్థాయిలో అమలు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగంలో తీసుకొస్తున్న విధానాలు రైతుల ప్రయోజనాలకు విరుద్ధంగా ఉన్నాయని ఆయన ఆరోపించారు. గతంలో తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా రైతులు పెద్దఎత్తున ఉద్యమించడంతో 2021లో ఆ చట్టాలను రద్దు చేయాల్సి వచ్చిందని గుర్తుచేశారు. ప్రస్తుతం అదే తరహా విధానాలను ఇతర మార్గాల్లో అమలు చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. రైతులకు పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)కు చట్టబద్ధత కల్పించాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల మేరకు సి2ం50 శాతం సూత్రాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు, వ్యవసాయ కూలీల సమస్యలను సమగ్రంగా చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించేందుకు జాతీయ మహాసభలు కీలకంగా నిలుస్తాయని తెలిపారు. అలాగే గ్రామీణ పేదలకు ఉపాధి కల్పిస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్‌ఆర్‌ఈజీఎస్)కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి హామీ పథకాన్ని బలోపేతం చేసి గ్రామీణ పేదలకు మరింత ఉపాధి కల్పించాలని కోరారు. ఖమ్మంలో జరిగే జాతీయ 4వ మహాసభలకు దేశంలోని 16 రాష్ట్రాల నుంచి రైతు--కూలీ ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. ఏఐకేఎంఎస్ జాతీయ అధ్యక్షుడు వేములపల్లి వెంకట్రామయ్య, జాతీయ కార్యదర్శి ఆసిస్ మిట్టల్ తదితర జాతీయ నాయకులు మహాసభల్లో పాల్గొని ప్రసంగించనున్నారని పేర్కొన్నారు. పెద్దపల్లి జిల్లా నలుమూలల నుంచి రైతులు, వ్యవసాయ కూలీలు, సంఘం నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి గుండేటి మల్లేశం, కోశాధికారి ఐ. రాజేశం, నాయకులు కాదాసి లింగమూర్తి, గుండు రాజయ్య, సీహెచ్ శంకర్, బాలకృష్ణ, బాబన్న, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారమే చిన్నారులకు ఆరోగ్యానికి శ్రీరామ రక్ష

- మద్దూరు ఐ సి డి ఎస్ సూపర్వైజర్ రేణుక ద
- వల్లంపట్లలో ఘనంగా పోషణ మాస ఉత్సవాలు



**మద్దూరు సెప్టెంబర్ 25, ప్రజా వాణి,** మండలంలోని వల్లంపట్లలో పోషణ మాస ఉత్సవాలుఅంగన్వాడి టీచర్లు రజిత,గాలమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈకార్యక్రమానికి సూపర్వైజర్ రేణుక తల్లులకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. ఒక పూట చిరుధాన్యాలు ఆహారంలో తీసుకోవాలన్నారు. పిల్లలకు చిప్స్ ప్యాకెట్స్ కొనివ్వకూడదని ప్రతిరోజు పాలు,గుడ్డు,పండ్లు, భోజనంలో తప్పనిసరి ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. గర్భిణీ బాలింతలు అంగన్వాడిలో అందించే భోజనాన్ని ప్రతి ఒక్కరూ తినాలి అలాగే పిల్లలకు బాలమృతాన్ని పెట్టాలని తెలిపారు. సరైన పోషకాహారం తీసుకున్నప్పుడే గర్భిణీలకు బిడ్డ యొక్క ఎదుగుదల బాగా జరుగుతుందన్నారు. ఆరోగ్యవంతమైన బిడ్డకు జన్మని ఇస్తారు అందుకోసం మనం తీసుకునే ఆహారంపై నిర్లక్ష్యం చేయకుండా సమతుల ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కర్నేసునీత మనోహర్,ఉప సర్పంచ్ మాచర్ల రఘు,సెక్రెటరీ కిరణ్ కుమార్, వార్డ్ మెంబర్లు, ఏఎన్ఎం ఆశాలు అంగన్వాడి టీచర్లు గాలమ్మ, రజిత,గ్రామ పెద్దలు యువకులు గర్భిణీలు,బాలింతలు,తల్లులు పాల్గొన్నారు.

# దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలు నేటి తరానికి ఆదర్శం

- బీజేపీ పట్టణ, మండల శాఖల ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు

**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి సెప్టెంబర్ 25**పెద్దపల్లి: భారతీయ జనసంఘ్ మాజీ అధ్యక్షుడు, ఏకాత్మ మానవతావాద సిద్ధాంత ప్రతిపాదకుడు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను భారతీయ జనతా పార్టీ పట్టణ, మండల శాఖల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు, కార్యకర్తలు పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.
ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు, కౌన్సిలర్ పెంజర్ల రాకేష్, మండల అధ్యక్షుడు వెల్పుల రమేష్ మాట్లాడుతూ.. సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలనే అంత్యోదయ భావనను పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ బలంగా



ప్రతిపాదించారని తెలిపారు. దేశం, సమాజం, వ్యక్తి సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకున్న ఆయన ఆలోచనలు నేటికీ ప్రాసంగికంగా ఉన్నాయని పేర్కొన్నారు.దేశ సేవ, ప్రజా సేవ, నిస్వార్థ రాజకీయాల పట్ల పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ చూపిన మార్గాన్ని ప్రతి బీజేపీ కార్యకర్త ఆదర్శంగా తీసుకుని ప్రజల కోసం పనిచేయాలని వారు పిలుపునిచ్చారు. "దేశమే ముందు.. ప్రజాసేవే లక్ష్యం" అనే స్ఫూర్తితో ఆయన ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రాకేష్ అన్నారు.పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జీవితం, సిద్ధాంతాలు, దేశం పట్ల ఆయనకున్న అంకితభావం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని నాయకులు పేర్కొన్నారు. సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం, దేశ అభివృద్ధి కోసం ఆయన ప్రతిపాదించిన ఆలోచనలను ప్రజలకు వివరించాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు పోల్సాని సంపత్ రావు, ఎర్రోళ్ల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శులు గుడ్ల సతీష్, బోలేవేన సురేందర్, ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి కుమార్, ముంజ రాజేంద్రప్రసాద్, కోశాధికారి గదాసి సతీష్, కార్యదర్శి పోగుల రాజు,బొడ్డుపల్లి సంపత్, షిండే శివసాయి, కుక్క అంజి, ప్రశాంత్, ఆకాష్, మనోజ్, అవినాష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# సాఫ్ట్‌బాల్‌లో సత్తా చాటుతున్న దూళిమిట్ట మాణిక్యం శిరబోయిన రిత్విక్'

- రాష్ట్ర స్థా యిలో అదరగొట్టి.. జాతీయ స్థాయి సబ్ జూనియర్ పోటీలకు ఎంపిక
- ఈ నెల 27 నుంచి 30 వరకు మహారాష్ట్రలో జాతీయ స్థాయి పోటీలు
- వరుసగా రెండో ఏడాది జాతీయ పోటీల్లో ప్రతిభ చూపేందుకు సిద్ధం
- గ్రామస్తులు, ప్రజాప్రతినిధుల ప్రోత్సాహం ఉంటే అంతర్జాతీయ స్థాయికి ఎదిగే అవకాశం

**మద్దూరు సెప్టెంబర్ 25, ప్రజా వాణి,**పట్టుదల,క్రమశిక్షణ ఉంటే గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా అద్భుతాలు సృష్టించగలరని నిరూపిస్తున్నాడు స్థానిక జడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థి శిరబోయిన రిత్విక్. దూళిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న రిత్విక్, సాఫ్ట్‌బాల్ క్రీడలో అసాధారణ ప్రతిభ కనబరుస్తూ వరుస విజయాలతో దూసుకుపోతున్నాడు.ఇటీవల మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో శిరబోయిన రిత్విక్ అద్భుతమైన ప్రతిభ కనబరిచి బెస్ట్ ఆల్ రౌండర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డును కైవసం చేసుకున్నాడు. ఈ పోటీల్లో చూపిన విశేష ప్రతిభ ఆధారంగా జాతీయ స్థాయి సబ్ జూనియర్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 27 నుంచి 30 వరకు మహారాష్ట్రలో జరగనున్న జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ సబ్ జూనియర్ పోటీలలో రిత్విక్ పాల్గొననున్నాడు. గత సంవత్సరం కూడా హర్యానాలో జరిగిన జాతీయ స్థాయి పోటీలలో పాల్గొని తన నైపుణ్యాన్ని చాటిన రిత్విక్, వరుసగా రెండో ఏడాది కూడా జాతీయ స్థాయికి ఎంపికవడం విశేషం.

మట్టిలో మాణిక్యం.. చదువులోనూ మేటి

శిరబోయిన రిత్విక్ సాధించిన ఈ ఘనత పట్ల పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనుముల కరుణాకర్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "రిత్విక్ ఎంతో



కష్టపడే మనస్తత్వం గల విద్యార్థి. కేవలం క్రీడల్లోనే కాకుండా చదువులోనూ ఎంతో చురుగ్గా ఉంటూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడు. గ్రామీణ ప్రాంతంలో పుట్టిన నిజమైన 'మట్టిలో మాణిక్యం' రిత్విక్" అని కొనియాడారు.
?పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులుగా వెగ్గలం సతీష్ కుమార్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి విద్యార్థులకు క్రీడల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తూ, వారిని జాతీయ స్థాయికి తీర్చిదిద్దుతున్నారని హెచ్ఎం అభినందించారు.
సిద్దిపేట సాఫ్ట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు నేతి కైలాసం మరియు సెక్రటరీ రేణుక మాట్లాడుతూ జాతీయస్థాయికి ఎంపికైన రిత్విక్ ను అభినందిస్తూ జాతీయ స్థాయి క్రీడాకారులకు సిద్దిపేట సాఫ్ట్ బాల్ అసోసియేషన్ ఎప్పుడూ
అండాగవుంటుందని తెలిపారు.



గ్రామ ప్రముఖులు, ప్రజాప్రతినిధుల ప్రశంసలు:
రిత్విక్ జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై స్థానిక సర్పంచ్ గునుకుల లీల జగన్మోహన్ రెడ్డి, గ్రామ పాలకవర్గం, పాఠశాల ఉపాధ్యాయ బృందం ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.
?ఈ సందర్భంగా గ్రామస్తులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. రిత్విక్ లాంటి ప్రతిభావంతుడైన క్రీడాకారుడికి ప్రభుత్వం, స్థానిక ప్రజాప్రతినిధులు, దాతలు, గ్రామ ప్రముఖులు అండగా నిలవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సరైన ప్రోత్సాహం, అవసరమైన క్రీడా సామాగ్రి, ఆర్థిక సహకారం అందిస్తే రిత్విక్ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి చేరుకుని, గ్రామానికి, రాష్ట్రానికి మాత్రమే కాకుండా భారతదేశానికి గర్వకారణంగా నిలుస్తాడు" అని ఆకాంక్షించారు.మహారాష్ట్రలో జరగబోయే జాతీయ స్థాయి పోటీల్లో రిత్విక్ ఉత్తమ ప్రతిభ కనబరిచి విజయకేతనం ఎగురవేయాలని పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు శుభాకాంక్షలు తెలిపారు.

# అర్హులైన పేదలందరికీ వృద్ధాప్య పెన్షన్లు ఇవ్వాలి

- ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి: సీపీఎం

**రాయిగూడెం, సెప్టెంబరు 25 (ప్రజావాణి):** అర్హులైన పేదలందరికీ వృద్ధాప్య పెన్షన్లు మంజూరు చేయడంతో పాటు, ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు.మండల పరిధిలోని రాయిగూడెం గ్రామంలో సీపీఎం పార్టీ ప్రాంతీయ జనరల్ బాడీ సమావేశం దోసపాటి సుధాకర్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి ఎస్.కె. యాకూబ్ మాట్లాడుతూ.. అర్హులైన వృద్ధులకు వృద్ధాప్య పెన్షన్లు మంజూరు చేయకుండా కేవలం వృత్తిదారుల పెన్షన్లు మాత్రమే ఇవ్వడం వల్ల అనేక మంది పేదలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి వెంటనే పెన్షన్ అందించాలని



కోరారు.అలాగే మండలంలోని ఇల్లు లేని నిరుపేదలను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పలు గ్రామాల్లో అర్హులైన పేదలకు ప్రభుత్వ పథకాలు అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, అధికారులు ఈ సమస్యలపై దృష్టి సారించాలని కోరారు.మరోవైపు నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరుగుతున్నాయని యాకూబ్ అన్నారు. ఎండుమిర్చి కిలో రూ.250 నుంచి రూ.300 వరకు, ఉల్లిగడ్డ ధరలు కూడా పెరిగాయని, చింతపండు, కందిపప్పు తదితర నిత్యావసర వస్తువుల ధరలు సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని, ధరల పట్టికలను దుకాణాల వద్ద ఏర్పాటు చేసి ప్రజలకు స్పష్టంగా కనిపించేలా చూడాలని డిమాండ్ చేశారు. ధరల నియంత్రణలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపట్టి ప్రజలను చైతన్యవంతం చేస్తామని హెచ్చరించారు.ఈ సమావేశంలో మండల కమిటీ సభ్యులు దోసపాటి భిక్షం, గంట వెంకటేశ్వర్లు, రాచమల్ల నరసయ్య, అంజయ్య, సుధాకర్, వార్డు నెంబర్ శ్రీకాంత్, గోపయ్య, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఖమ్మంలో ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవ వేడుకలు

**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి** తెలంగాణ టూరిజం డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఏ ఎస్ ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లాస్థాయి వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు ఘనంగా నిర్వహించారు.జిల్లా టూరిజం ఆఫీసర్ సుమన్ చక్రవర్తి ఆధ్వర్యంలో, డిఐఈఓ రవి బాబు ముఖ్య అతిథిగా, కళాశాల ప్రిన్సిపాల్ గోవింద రావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.
ఈ సందర్భంగా జిల్లా టూరిజం ఆఫీసర్ సుమన్ చక్రవర్తి మాట్లాడుతూ, స్మారక కట్టడాలు, చారిత్రాత్మక కట్టడాలు భారతదేశ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబాలని, వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత యువతపై ఉందని విద్యార్థులకు అవగాహన కల్పించారు.డిఐఈఓరవి బాబు మాట్లాడుతూ, ఖమ్మం ఖిల్లా, నేలకొండపల్లి బౌద్ధ స్తూపం ఎంతో గొప్ప చరిత్ర కలిగి ఉన్నాయని, పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేయడం వల్ల స్థానికంగా ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని తెలిపారు.
ఈ పోటీలలో జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల నుండి విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శాంతినగర్,



నయాబజార్, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఖమ్మం, జి జె సి ముదిగొండ, కూసుమంచి, టీజీ ఎస్ సోషల్ వెల్ఫేర్ కూసుమంచి, టి ఎమ్ ఆర్ జె సిఖమ్మం, అంబేద్కర్ కాలేజ్ ఆఫ్ ఫర్ గర్ల్స్, సర్వజ్ఞ జూనియర్ కళాశాల, రెజోనెన్స్ జూనియర్ కళాశాల ఖమ్మం తదితర కళాశాలల విద్యార్థులు తమ ప్రతిభ కనబరిచారు. ఏ ఎస్ ఆర్ కళాశాల సిబ్బంది కృషితో కార్యక్రమం



విజయవంతంగా ముగిసింది.అనంతరం విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ విజేతలకు ఈ నెల 27వ తేదీ ఆదివారం సాయంత్రం లకారం చెరువు ట్యాంక్ బండ్ వద్ద జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందని, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు.

# కొండాయిగూడెంలో వైద్య పరీక్షలు



**కొండాయిగూడెం, సెప్టెంబరు 25 (ప్రజావాణి):**కొండాయిగూడెం గ్రామ పంచాయతీ ఆవరణలో శుక్రవారం ప్రజల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వైద్య పరీక్షల కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గ్రామ ప్రజలకు షుగర్, బీపీ పరీక్షలతో పాటు ఊపిరితిత్తుల ఎక్స్‌రే పరీక్షలు నిర్వహించారు.ఈ కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ కందుల మంగమ్మ కోటిరెడ్డి ప్రారంభించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో మండల వైద్య సిబ్బంది డాక్టర్ శృతి, డాక్టర్ అఖిల్ కిషోర్, డాక్టర్ రవళి, ఏఎన్ఎంలు అనిత, శాంత, ఆశా వర్కర్ మాధవి పాల్గొని ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా పంచాయతీ సెక్రటరీ నరేష్, ఉప సర్పంచ్ శిరీష మోహన్ రెడ్డి, వార్డు సభ్యులు అంబటి మోహన్ రెడ్డి, చెన్నారెడ్డి, పుట్టపర్తి రాము, గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# కొత్త నందికొండ గ్రామపంచాయతీలో ఉన్న పాత డొంక రోడ్డును పునరుద్ధరించాలని కోరుతూ గ్రామ నాయకులు, రైతులు తహసిల్దార్ (ఎమ్ఆర్ఓ)కు వినతిపత్రం సమర్పించారు

**ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం సెప్టెంబర్ 25**అడవిదేవులపల్లి మండల పరిధిలోని కొత్త నందికొండ గ్రామ పంచాయతీలో ఉన్న పాత డొంక రోడ్డును పునరుద్ధరించాలని కోరుతూ గ్రామ నాయకులు, రైతులు తహసిల్దార్ (ఎమ్ఆర్ఓ)కు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. 1980 నుంచి గట్టుపై నుంచి ఇందిరానగర్ వెళ్లేందుకు కాలినడక బాట ఉండేదని, ఆ తర్వాత చాలా ఏళ్లపాటు ఈ డొంక రోడ్డు గుండా ద్విచక్ర వాహనాలు కూడా తిరిగేవని తెలిపారు.అయితే, ఇటీవల కాలంలో కొందరు వ్యక్తులు ఆక్రమణలకు పాల్పడి ఆ రోడ్డును తమ పొలాల్లో కలుపుకున్నారని ఆరోపించారు. దీనివల్ల ఇందిరానగర్ వైపు వెళ్లే రైతులకు, బాటసారులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.వెంటనే అధికారులు స్పందించి, ఆక్రమణకు గురైన డొంక రోడ్డును పరిశీలించి, రైతులకు మరియు గ్రామస్తులకు రాకపోకల మార్గాన్ని పునరుద్ధరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో కొత్త నందికొండ గ్రామ సర్పంచ్ మౌలా నాయక్, యూత్ లీడర్ మధు రాథోడ్, రామావత్ తులుస్య, కొర్ర సుమన్,కాటం మల్లికార్జున, మని, శ్రీకాంత్, చిట్టిబాబుతో పాటు గ్రామ రైతులు పాల్గొన్నారు.



# సొంత గ్రామం కేతావత్ తండాలో మొక్కలు నాటిన ఎమ్మెల్సీ శంకర్ నాయక్



**ప్రజావాణి మిర్యాలగూడ నియోజకవర్గం సెప్టెంబర్ 25**దామరచర్ల: దామరచర్ల మండలం తన స్వంత గ్రామమైన కేతావత్ తండాలో ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా గ్రామంలో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరూ తీసుకోవాలని సూచించారు. పచ్చదనం పెంపొందించడంతో పాటు భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు మొక్కల పెంపకం ఎంతో అవసరమని ఎమ్మెల్సీ పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బాలు, చలపతిరావు, హనుమంతుతో పాటు కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

- అర్హత ఉన్న ప్రతి కుటుంబానికీ స్మార్ట్ కార్డు సర్పంచ్ బొడ్డుపల్లి లక్ష్మిభిక్షం

**చిలుకూరు సెప్టెంబర్ 25(ప్రజావాణి):** ఆచార్యులగూడెం గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. గ్రామంలోని అర్హులైన లబ్ధిదారులకు సర్పంచ్ బొడ్డుపల్లి లక్ష్మి--భిక్షం, వార్డు సభ్యులు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు.ఈ సందర్భంగా గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ కార్డులను స్వీకరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలను అర్హులైన ప్రతి కుటుంబానికి అందించడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమం సజావుగా కొనసాగింది.



# బోడుప్పల్‌లో భక్తిశ్రద్ధలతో గణేష్ ఉత్సవాలు

- పలు మండపాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్





**మేడిపల్లి సెప్టెంబర్ 25( మన ప్రజావాణి)** బోడుప్పల్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బోడుప్పల్ లోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ సందర్శించారు.ఈ సందర్భంగా వివిధ గణేష్ మండపాల్లో కొలువుదీరిన విఘ్నేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణనాథుడికి పుష్పాలు సమర్పించి,భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు చేశారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో,ఆయురారోగ్యాలతో ఉండాలని,బోడుప్పల్ ప్రాంతం మరింత అభివృద్ధి చెందాలని స్వామివారిని ప్రార్థించారు.ఈ కార్యక్రమాల్లో బోడుప్పల్ మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగుల నర్సింహ్మారెడ్డి,బోడుప్పల్ డివిజన్ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్ కుమార్,చెంగిచెర్ల డివిజన్ అధ్యక్షుడు పోగుల దిలీప్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు చీరాల నర్సింహ్మా,కొత్త చందర్ గౌడ్,బింగి జంగయ్య యాదవ్, నాయకులు విశ్వం గుప్త,దానగళ్ళ యాదగిరి, కొత్త గోపాల్ గౌడ్,కర్రి శివకుమార్,నాయకులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,యువత, స్థానిక ప్రజలు,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మన సమగ్ర ప్రజావాణి తెలుగు డైలీ
శనివారం, సెప్టెంబర్ 26, 2026


# జూపాక మైసమ్మ చెరువులో మొసలి కలకలం.....



"హుజూరాబాద్ రూరల్ ప్రజావాణి... మండల పరిధిలోని జూపాక గ్రామంలో మైసమ్మ చెరువులో మొసలి ప్రత్యక్షం కావడంతో స్థానికంగా కలకలం రేగింది. చెరువులో మొసలి సంచరిస్తోందన్న సమాచారం తెలియడంతో గ్రామస్తులు, రైతులు, పశువుల కాపరులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. పశువుల కాపరులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం పశువులను మేపేందుకు చెరువు సమీపానికి వెళ్లగా, నీటిలోని తామర తుప్పల మధ్య భారీ మొసలి కనిపించింది. దీంతో వారు భయంతో అక్కడి నుంచి వెనుదిరిగారు. అనంతరం ఈ విషయం గ్రామంలో తెలియడంతో స్థానికులు అప్రమత్తమయ్యారు. గత రెండు రోజులుగా చెరువులో మొసలి సంచరిస్తోందన్న ప్రచారం గ్రామంలో జోరుగా సాగుతోంది. దీంతో స్థానిక జాలర్లు చెరువు పరిసరాల్లో గాలించినప్పటికీ మొసలి ఆచూకీ లభించలేదు. తాజాగా పశువుల కాపరుల కంటపడటంతో చెరువులో మొసలి ఉన్న విషయం నిజమేనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.చెరువులో మొసలి సంచరిస్తుండటంతో రైతులు, పశువుల కాపరులు అటువైపు వెళ్లేందుకు జంకుతున్నారు. పశువులను మేపేందుకు వెళ్లే సమయంలో ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చెరువులోకి వెళ్లే వారు, నీటి సమీపంలో ఉండే పశువులకు ప్రమాదం పొంచి ఉందని పేర్కొంటున్నారు. ఏదైనా ప్రమాదం జరగకముందే అటవీశాఖ అధికారులు స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. చెరువులో మొసలి సంచారాన్ని గుర్తించి, దానిని సురక్షితంగా బంధించి జనావాసాలకు దూరంగా ఉన్న ప్రాంతానికి తరలించాలని విజ్ఞప్తి

# పని భారం తగ్గించాలి.. బోధనకే పరిమితం చేయాలి

- ఎస్జీటీ ఉపాధ్యాయుల నల్ల బ్యాడ్జీల నిరసన




చిలుకూరు, సెప్టెంబర్ 25 (ప్రజావాణి): ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులపై పెరుగుతున్న పనిభారాన్ని తగ్గించి, బోధనకు అనుకూలమైన వాతావరణం కల్పించాలని డిమాండ్ చేస్తూ చిలుకూరు మండలంలోని ఎస్జీటీ ఉపాధ్యాయులు శుక్రవారం నిరసన తెలిపారు. చిలుకూరు కాంప్లెక్స్ సమావేశం సందర్భంగా భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి, ప్లకార్డులు ప్రదర్శిస్తూ తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.జీ వో నం.25ను సవరించి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా తరగతికి ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని, బోధనేతర పనుల భారాన్ని తగ్గించాలని వారు కోరారు. ప్రాథమిక పాఠశాలల్లో తగినంత సిబ్బందిని నియమించడంతో పాటు ప్రతి పాఠశాలకు ప్రధానోపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు. రోజువారీ విజిటింగ్‌ల పేరుతో ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలని, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఎమ్మెల్సీ ఓటు హక్కు కల్పించాలని కోరారు.బోధనకు ప్రాధాన్యం ఇవ్వాలి ఉపాధ్యాయులపై అదనపు బాధ్యతలు తగ్గించి, విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో చిలుకూరు మండలంలోని పలువురు ఎస్జీటీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు..

# సత్యనారాయగౌడ్ ఆరోగ్యంపై మంత్రి శ్రీదర్ బాబు ఆరా...





రామగిరి,మన సమగ్ర ప్రజావాణి సెప్టెంబర్ 25హైదరాబాద్‌లోని ఏషియన్ రిహాబిలిటేషన్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న రామగిరి మండలం సుందిల్ల శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థాన కమిటీ చైర్మన్ కోరుకొప్పుల సత్యనారాయణగౌడ్‌ను రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పరామర్శించారు.శుక్రవారం ఆసుపత్రికి వెళ్లిన మంత్రి.. సత్యనారాయణగౌడ్ కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు.అనంతరం వైద్యులను అడిగి ఆయన ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకున్నారు.ఈ సందర్భంగా సత్యనారాయణగౌడ్ త్వరగా కోలుకోవాలని మంత్రి ఆకాంక్షించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.మంత్రి వెంట సుందిల్ల గ్రామ సర్పంచ్ ముస్కుల నరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ తాజా మాజీ ఎంపీటీసీ జనగామ హేమలత బుచ్చి బాబు, మండల కాంగ్రెస్ కన్వీనర్ పేరాల మహేశ్వరరావు, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు గర్రేపల్లి ప్రవీణ్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

# మృతుడి కుటుంబానికి ఎమ్మెల్సీ దండే విఠల్ భరోసా

- రోడ్డు ప్రమాదంలో కాంగ్రెస్ కార్యకర్త మృతి
- కుటుంబ సభ్యులను పరామర్శించిన ఎమ్మెల్సీ దండే విఠల్
- కుటుంబానికి అండగా ఉంటామని భరోసా





కొమురంభీమ్/పెంచికల్ పెట్, సెప్టెంబర్ 25, (ప్రజావాణి ప్రతినిధి) పెంచికల్‌పేట్: మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త నలగొండ శ్రవణ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఎమ్మెల్సీ దండే విఠల్ ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. శ్రవణ్ మృతికి సంతాపం తెలిపి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వారి పరిస్థితిని తెలుసుకుని అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దాసరి చంద్రమౌళి, కాంగ్రెస్ నాయకులు రామగోని శంకర్‌గౌడ్, రాచకొండ కృష్ణ, రమేష్, తెలిగే రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బొల్లంకృష్ణ మరణానికి కారణమైన రాంకి యాజమాన్యంపై హత్యానేరం కేసులు పెట్టాలి

- డంపింగ్ యార్డు ప్రబావిత ప్రాంతాలలో అనారోగ్యాలతో అకాల మరణాలకు గురైన బాదిత కుటుంబాలకు తగిన ఎక్స్ గ్రేషియా ప్రకటించాలని డిమాండ్.
- తక్షణం బొల్లం కృష్ణ కుటుంబానికి ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ జవవహర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో జరిగిన నిరసన కార్యక్రమం.








జవహర్ నగర్ సెప్టెంబర్ 25( ప్రజావాణి ప్రతినిధి)కీసరసర్కిల్, జవహర్ నగర్ జీహెచ్ఎంసీ పరిధిలోగల గబ్బిలాలపేట, వైయస్సార్ నగర్ కు చెందిన 37 సంవత్సరాల బొల్లం కృష్ణ 2026, సెప్టెంబర్-24, గురువారం రోజు సాయంత్రం, హైదరాబాద్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అనారోగ్యంతో మృతి చెందడానికి కారణమైన రాంకీ చెత్త డంపింగ్ యార్డు యాజమాన్యంపై హత్యానేరం కేసులు నమోదు చేసి, ప్రజల ఆరోగ్యాలు, వారి జీవితాలతో చెలగాట మాడుతున్న డంపింగ్ యార్డును శాశ్వతంగా ఎత్తివేయాలని జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాటకమిటి లోని వివిధ భాగస్వామ్య సంస్థలకు చెందిన సభ్యులు డిమాండ్ చేశారు. శుక్రవారం రోజు జేఏసి చైర్మన్ షేక్ షావలి, కోశాధికారి, ఐ.ఎఫ్.టి.యు. పి.శివబాబు, గౌరవ సలహాదారులు, కాంగ్రెస్ పార్టీనేత కళ్ళెపల్లి సదానందం, కో కన్వీనర్స్ సిపిఐ(ఎం.ఎల్) మాస్ లైన్ గడ్డం సదానందం, ఏ.ఐ.ఎఫ్.టి.యు. వై.మల్లేష్, మాజీ కార్పొరేటర్ సుబ్రమణ్యం, టియుసిఐ వి.ప్రవీణ్, పికెఎం డి.జాన్, చైతన్య మహిళాసంఘం జయ, పిఓడబ్ల్యు(విముక్తి) గడిపే సునిత, బహుజన రక్షణ సమితి మహ్మద్ జావేద్ మరియు అసంఘటిత కార్మిక సంఘం జాంబవ్, సిఎంఎస్ శ్రీదేవి, అల్లూరి సావిత్రి, పిఓడబ్ల్యు(విముక్తి) తుమ్మరాణి, చికెన్ యాదగిరి, జర్నలిస్ట్ కొన్నెవేణు తదితరులు ఈస్ట్ నందమూరి నగర్ లోగల అంబేద్కర్ విగ్రహం దగ్గర నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం బొల్లం కృష్ణ పార్థివ దేహంకు పూలమాల సమర్పించి, జోహార్లు అర్పించారు. అకారణంగా, అన్యాయంగా ప్రజల అనారోగ్యాలు, మరణాలకు పరోక్షంగా కారణ మవుతున్న రాంకీ యాజమాన్యంపై చట్టబద్ధమైన చర్యలు యుద్ద ప్రాతిపదికన చేపట్టాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఎంపి ఈటెల రాజేందర్, అధికారపార్టీ మేడ్చల్ డిసిసి చైర్మన్ వజ్రేష్ యాదవ్ వెంటనే స్పందించాలని విజ్ఞప్తి చేశారు. డంపింగ్ యార్డు ప్రభావిత ప్రాంతాల్లో జరుగుతున్న అకాల, అర్ధాశ్యు వరుస మరణాలతో లక్షలాది మంది ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురౌతున్నారని అన్నారని. చెత్త డంపింగ్ యార్డు నుండి వెలువడే విష వాయులు వలన బరించలేని దుర్వాసనలు, మురికి నీటి నురుగు బుడగలు, చీకట్లను తలపించే పొగలు వలన ఇలాంటి అసహజ మరణాలు సంభవిస్తున్నాయని ఆరోపించారు. పర్యావరణ, విద్యావంతులు, మేదావులు, బుద్దిజీవులు, పరిశోధన విధ్యార్థులు, సామాజిక భాద్యత కలిగిన ప్రతి ఒక్కరూ కూడ జవహర్ నగర్ ప్రాంతానికి విచ్చేసి, ప్రజలు ఎదుర్కొంటున్న దుర్భర, అనారోగ్య సమస్యలను భయటి ప్రపంచానికి తెలియజేయాలని పిలుపునిచ్చారు. గుట్టుచప్పుడు కాకుండా సకల జీవరాశుల ప్రాణాలను హరిస్తున్న డంపింగ్ యార్డు ఎత్తివేతలో పాలకుల అవినీతి, నిర్లక్ష్యం వలన సుమారు 400 ఎకరాల విస్తీర్ణానికి ఎగబాకిందని అన్నారు. లక్షలాది టన్నుల చెత్త గుట్టలు గుట్టలుగా పేర్కొనిపోయి, భూమి, నీరు, గాలి పూర్తిగా కలుషితం అయ్యాయని అన్నారు. చట్టాలను, చుట్టాలుగా చేసుకొని, న్యాయస్థాన తీర్పులను సహితం కాలరాస్తున్న డంపింగ్ యార్డు యాజమాన్యం తన పద్దతులు మార్చుకొవాలని, లేనియెడల అటు ప్రభుత్వ పెద్దలు, అధికారులు, రాంకీ యాజమాన్యం ప్రజా ఆగ్రహానికి గురికావల్సి ఉంటుందని హెచ్చరించారు. గత 15 సంవత్సరాలుగా శ్వాసకోశ, క్యానర్స్, చర్మ, గర్భస్రావ తదితర వ్యాదులతో మధ్యంతరంగా జీవితాలను చాలించిన వారి మరణాలకు రాంకీ యజమాన్యమే భాధ్యత వహించేలా చేయాలని కోరారు. వారు అనుసరించిన అప్రజాస్వామిక, స్వార్థ పూరిత లాభపేక్షతో కూడిన వ్యాపార ప్రయోజనాలు సామాన్య పేద, మధ్యతరగతి ప్రజల మనుగడ ప్రశ్నార్ధకం చేసిన రాంకీ యజమాని అయ్యోద్య రామిరెడ్డిని వెంటనే అరెస్టుచేసి, బొల్లం కృష్ణ లాంటి చావులు, మరోసారి ఎవరికి జరుగకుండా చూడాల్సిన భాధ్యత రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వానిదే నని అన్నారు.

# పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి





బిజెపి హుజురాబాద్ పట్టణ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రోజున పండిత్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గారి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి మొక్కలు నాటారు.ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు గారు మాట్లాడుతూ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గారు దేశం కోసం, సమాజం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడని అన్నారు. భారతీయ జనసంఘ్‌కు ఆయన అందించిన సేవలు, పార్టీ సిద్ధాంతాల నిర్మాణంలో ఆయన చేసిన కృషి చిరస్మరణీయమని పేర్కొన్నారు.దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గారు ప్రతిపాదించిన "ఏకాత్మ మానవవాదం" భారతీయ జీవన విధానం, సంస్కృతి, విలువలకు అనుగుణంగా సమాజంలోని ప్రతి వ్యక్తి సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకున్న గొప్ప ఆలోచనా విధానమని తూర్పాటి రాజు తెలిపారు.సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలనే "అంత్యోదయ" సిద్ధాంతాన్ని దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గారు దేశానికి అందించారని అన్నారు. పేదలు, బలహీన వర్గాలు, అణగారిన ప్రజల సంక్షేమమే నిజమైన ప్రజాసేవకు ప్రామాణికమని ఆయన చూపించిన మార్గంలో ప్రతి బీజేపీ కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని శ్రీ నరేంద్ర మోడీ గారు దీన్ దయాళ్ ఉపాధ్యాయ గారి అంత్యోదయ స్ఫూర్తిదాయకంగ పేదలకు ఇళ్లు, ఉచిత వైద్యం,ఉచిత రేషన్,బ్యాంకు ఖాతాలు, గ్యాస్ కనెక్షన్లు, మరుగుదొడ్లు, తాగునీరు, రైతులకు సంక్షేమ పథకాలు వంటి అనేక కార్యక్రమాల లక్ష్యం సమాజంలోని చివరి వ్యక్తిని అభివృద్ధిలో భాగస్వామ్యం చేయడమే లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం పనిచేస్తుందని తెలియజేశారు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గారి ఆశయాలు నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని, ఆయన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు సమాజంలోని పేదలు, సామాన్య ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందని తూర్పాటి రాజు అన్నారు

ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షులు తూర్పాటి రాజు,జిల్లా కార్యవర్గ సభ్యులు గంగిశెట్టి ప్రభాకర్ పట్టణ ప్రధాన కార్యదర్శులు తిప్పబత్తిని రాజు గంట సంపత్ 23వ వార్డు కౌన్సిలర్ లక్ష్మీ దుర్గ పట్టణ ఉపాధ్యక్షులు ఇల్లందుల ప్రణీత్ పట్టణ కార్యదర్శిలు కుసుమ సమ్మయ్య బోడిగే రాధా బోరగాల సారయ్య నీలం రవీందర్ గంధం అనిల్ పురాణం శ్రీనివాస్ తూర్పాటి రామచంద్రం పర్థం విజయ్ తూర్పాటి రాజ్ కుమార్ తూర్పాటి రమేష్ భూతం సాయిరాం తూర్పాటి ఐలయ్య తూర్పాటి సురేష్ తూర్పాటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# పౌష్టికాహారంతోనే ఆరోగ్యకరమైన భవిష్యత్‌కు బాటలు

- కృష్ణా కాలనీ అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం కార్యక్రమం.









ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25(ప్రజావాణి):- గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల్లో పోషకాహారంపై అవగాహన పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించేందుకు ములుగు పట్టణంలోని కృష్ణా కాలనీ అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం పోషణ మాసం కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా పోషణ మాసం ప్రాధాన్యతను వివరిస్తూ సూపర్వైజర్ కావ్య మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడం ఎంతో ముఖ్యమని తెలిపారు. సమతుల్య ఆహారం తీసుకోవడం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పాటించడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడంతో పాటు మెరుగైన పోషక స్థితిని సాధించవచ్చని వివరించారు.గర్భధారణ నుంచి చిన్నారుల ఎదుగుదల వరకు పోషకాహారం కీలక పాత్ర పోషిస్తుందని, తల్లులు మరియు చిన్నారుల ఆహారంపై కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని అవగాహన కల్పించారు. పోషకాహార లోపాలను నివారించేందుకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందిస్తున్న పోషకాహార సేవలను అర్హులైన లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూపర్వైజర్ కావ్య సూచించారు. అంగన్వాడీ కేంద్రాలను కేవలం పోషకాహారం అందించే కేంద్రాలుగానే కాకుండా తల్లి, శిశు ఆరోగ్యం మరియు పోషణపై అవగాహన కల్పించే వేదికలుగా వినియోగించుకోవాలని తెలిపారు.ఈ సందర్భంగా పోషకాహారం, సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, తల్లులు మరియు చిన్నారుల పోషక అవసరాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించారు.వివిధ శాఖల సిబ్బంది, లబ్ధిదారుల హాజరు ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం (డీసీపీయు) సిబ్బంది, సిహెచ్ఎల్, సిబ్బంది, డిహెచ్ఎడబ్ల్యూ, సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, గర్భిణీలు, బాలింతలు, అంగన్వాడీ కేంద్ర పరిధిలోని లబ్ధిదారులు పాల్గొన్నారు.

# పారఖ్ పరీక్షకు పకడ్బందీగా సిద్ధం కావాలి

**● ప్రతి సబ్జెక్టు, సామర్థ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి**

**మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 25, ప్రజావాణి:** పారఖ్ పరీక్షను దృష్టిలో పెట్టుకుని విద్యార్థులను ఇప్పటి నుంచే పకడ్బందీగా సిద్ధం చేయాలని జిల్లా అకాడమిక్ మానిటరింగ్ కోఆర్డినేటర్ ఎండీ షేక్ అంజద్ ఉపాధ్యాయులకు సూచించారు. మంథని మండలంలో శుక్రవారం ప్రాథమిక పాఠశాలల సముదాయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆయన హాజరై పాఠశాలల్లో కొనసాగుతున్న విద్యా కార్యక్రమాలు, విద్యార్థుల అభ్యసన స్థాయి, రెమిడీయేషన్ కార్యక్రమం, 2027లో నిర్వహించనున్న పారఖ్ పరీక్షకు సంబంధించిన అంశాలపై ఉపాధ్యాయులతో చర్చించారు. విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను మరింతగా పెంపొందించేందుకు బోధనలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ప్రతి సబ్జెక్టులోని ప్రతి సామర్థ్యాన్ని గుర్తించి, విద్యార్థుల స్థాయికి అనుగుణంగా బోధన కొనసాగించాలని తెలిపారు. వెనుకబడిన



విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ రెమిడీయేషన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. విద్యార్థులు నేర్చుకున్న అంశాలను ఎంతవరకు అర్థం చేసుకున్నారో ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, అవసరమైన చోట అదనపు బోధన అందించాలని సూచించారు. దేశవ్యాప్తంగా నిర్వహించే విద్యా సర్వేలో పెద్దపల్లి జిల్లా టాప్--50లో నిలిచేలా విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను మెరుగుపర్చేందుకు ఉపాధ్యాయులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. విద్యార్థులకు బోధించే విషయంలో ఉపాధ్యాయులకు పూర్తి స్వేచ్ఛ ఉందని, తమ జ్ఞానం, అనుభవాన్ని ఉపయోగించి బోధనా పద్ధతులను మరింత మెరుగుపర్చుకోవాలని సూచించారు. పాఠ్యాంశాలను కేవలం పుస్తకాలకే పరిమితం చేయకుండా విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా ఉదాహరణలు, కార్యకలాపాల ద్వారా బోధించాలని తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయులు అందించే సేవ ఎంతో కీలకమని ఎండీ షేక్ అంజద్ పేర్కొన్నారు. బోధనలో ఉపాధ్యాయులు ఎలాంటి ఒత్తిడికి గురికావాల్సిన అవసరం లేదని, విద్యార్థుల అభ్యసనలో నాణ్యత పెంచడంపైనే ప్రధానంగా దృష్టి సారించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఉపాధ్యాయులకు అవసరమైన సహాయ సహకారాలు, ప్రోత్సాహం అందిస్తూ జిల్లాలో విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బంది పాల్గొని పారఖ్ పరీక్షకు విద్యార్థులను సన్నద్ధం చేయడం, రెమిడీయేషన్ కార్యక్రమం అమలు, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాల పెంపుపై చర్చించారు.

# విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీ

**● క్రీడలతో శారీరక దృఢత్వం, క్రమశిక్షణ పెంపొందుతుంది: మాజీ సర్పంచ్ లింగారెడ్డి**

**మంథని నియోజకవర్గ ప్రతినిధి, 25 సెప్టెంబర్, ప్రజావాణి :** విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు వారిని క్రీడల వైపు ప్రోత్సహించేందుకు శుక్రవారం మంథని మండలం ఆరెంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గ్రామ మాజీ సర్పంచ్ లింగారెడ్డి క్రీడా దుస్తులను పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈదులపల్లి నరసింహారావు చేసిన విజ్ఞప్తికి స్పందించిన లింగారెడ్డి విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లను అందించారు. ఈ సందర్భంగా లింగారెడ్డి మాట్లాడుతూ... విద్యార్థులు విద్యతో పాటు క్రీడలకు కూడా సమయం కేటాయించాలని సూచించారు. క్రీడలు, వ్యాయామం విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి దోహదపడతాయని తెలిపారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, క్రీడల్లో పాల్గొనడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చున్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, సమయపాలన, పట్టుదల, జట్టుగా పనిచేసే లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో క్రీడలపై ఆసక్తిని పెంచితే భవిష్యత్తులో వారు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబరిచే అవకాశం ఉంటుందని అన్నారు. విద్యార్థులు తమకు నచ్చిన క్రీడను ఎంచుకుని



నిరంతరం సాధన చేయాలని సూచించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించి తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఆరెంద జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ బృందం విద్యార్థుల అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కొంతకాలంగా పలు వినూత్న కార్యక్రమాలను నిర్వహిస్తుండటం అభినందనీయమని లింగారెడ్డి అన్నారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి పాఠశాల అభివృద్ధికి అవసరమైన కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం భవిష్యత్తులోనూ కొనసాగిస్తానని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఈదులపల్లి నరసింహారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో



సర్పంచ్ జె. రామస్వామి, ఉప సర్పంచ్ శ్రీనివాస్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ టి. స్రవంతి, క్లస్టర్ రిసోర్స్ పర్సన్ మల్లయ్య పాల్గొన్నారు. ఉపాధ్యాయులు గియాజుద్దీన్, సువార్త, మమత, పద్మజ, శ్రీలత, శ్రీవాణి, సహేందర్‌తో పాటు విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థుల క్రీడా ప్రతిభను ప్రోత్సహించే ఉద్దేశంతో క్రీడా దుస్తులను అందించిన మాజీ సర్పంచ్ లింగారెడ్డికి ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. పాఠశాల విద్యార్థుల కోసం ముందుకు వచ్చి క్రీడా దుస్తులు అందించడం పట్ల గ్రామస్తులు కూడా లింగారెడ్డిని అభినందించారు.

# విద్యారంగాన్ని భ్రష్టుపట్టిస్తున్న పాలకులు..

- పాలకులు అవలంబిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై ఉద్యమిస్తాం
- ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ఏఐఎస్ఎఫ్ ధ్యేయం...
- ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి. పుట్ట లక్ష్మణ్

**మేడిపల్లి సెప్టెంబర్ 25( మన ప్రజావాణి)** ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ఏఐఎస్ఎఫ్ ధ్యేయమని ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి.పుట్ట లక్ష్మణ్ అన్నారు.ఈ మేరకు ఉప్పల డిపో వద్ద ఘనంగా ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా 4వ మహాసభలు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా 4వ మహాసభలు బోడుప్పల్ సర్కిల్,ఉప్పల్ డిపో పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మహాసభల సందర్భంగా విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని విద్యారంగ సమస్యల పరిష్కారం,విద్యార్థుల హక్కుల పరిరక్షణకు సంబంధించిన నినాదాలు చేసారు.అనంతరం ఉప్పల్ డిపో వద్ద ఉన్న ది వ్యూ ఫంక్షన్ హాల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శ్వేతా అరుణ పతాకాన్ని (ఏఐఎస్ఎఫ్ జెండా)ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు ఉమా మహేష్ ఆవిష్కరించి మహా సభలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ నాయకులు, కార్యకర్తలు,విద్యార్థులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి




ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ పాల్గొని మాట్లాడుతూ ఏఐఎస్ఎఫ్ దేశవ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై,విద్యా రంగ పరిరక్షణ కోసం నిర్వహించిన పోరాటాల చరిత్రను వివరించారు. స్వాతంత్ర్యానికి ముందు నుంచి విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ నిర్వహించిన ఉద్యమాలు, విద్యార్థుల హక్కుల సాధనలో సంఘం పోషించిన పాత్రను ఆయన ప్రస్తావించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల విద్యా విధానాలు, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు,ఫీజులు, స్కాలర్‌షిప్‌లు,హాస్టల్ సౌకర్యాలు,నిరుద్యోగం వంటి అంశాలపై విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. విద్య అందరికీ అందుబాటులో ఉండేలా ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.విద్యార్థి సమస్యలే కాకుండా సామాజిక సమస్యలపై,సమాజంలో జరుగుతున్న అక్రమాలపై పోరాడుతుందని తెలిపారు. సామజిక,సేవా కార్యక్రమాలు చేయడంలో కూడా ఏఐఎస్ఎఫ్ ఎల్లప్పుడూ అగ్రభాగాన ఉంటుంది



అని తెలియజేసారు.ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా నిర్మాణ బాధ్యులు, మాజీ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లాలో విద్యార్థుల సమస్యలపై ఏఐఎస్ఎఫ్ నిరంతరం కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరిం చేందుకు,ప్రభుత్వ విద్యాసంస్థల ఏర్పాటు కోసం,పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేవరకు ఏఐఎస్ఎఫ్ గా పోరాటాలు కొనసాగి స్తుందని,ఇందులో పని చేసిన వారు నేడు ఉన్నతమైన స్థానంలో ఉన్నారని,విద్యార్థి సంఘానికి ఎంతో ఘనమైన చరిత్ర ఉన్నదని, భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఐ మేడిపల్లి మండల కార్యదర్శి రచ్చ కిషన్, ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా అధ్యక్ష,కార్యదర్శి చిన్నబాబు,ఎండీ అన్వర్, ఉపాధ్యక్షుడు హరీష్, నాయకులు శ్రీకాంత్,బద్రి, సద్గురు చారి,శివమణి, ప్రణవ్,రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# బోడుప్పల్ కేశవ నగర్ లో చెన్నై షాపింగ్ మాల్ ఫెస్టివల్ సేల్

**● ప్రముఖ సినీ నటి ఎబ్బా పటేల్ చేతుల మీదుగా ఎగ్జిబిషన్ ప్రారంభం**

**మేడిపల్లి సెప్టెంబర్ 25 (మన ప్రజావాణి)** బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని కేశవనగర్ అక్షయ కన్వెన్షన్‌లో ఏర్పాటు చేసిన చెన్నై షాపింగ్ మాల్ ఫెస్టివల్ సేల్ ఎగ్జిబిషన్‌ను ప్రముఖ సినీ నటి ఎబ్బా పటేల్ శుక్రవారం ప్రారంభించారు.ఆమె చేతుల మీదుగా ఎగ్జిబిషన్ ప్రారంభం కావడంతో అభిమానులు,సందర్శకుల్లో సందడి నెలకొంది.అనంతరం ఎబ్బా పటేల్ ఎగ్జిబిషన్‌లో ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను సందర్శించి అక్కడ అందుబాటులో ఉన్న దుస్తులను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒకే చోట కుటుంబ సభ్యులందరికీ అవసరమైన వివిధ రకాల దుస్తులు అందుబాటులో ఉండటం వినియోగ దారులకు ఎంతో సౌకర్యంగా ఉంటుందని అన్నారు.ఫెస్టివల్ సేల్‌లో ఆకర్షణీయమైన దుస్తులను అందుబాటు ధరల్లో అందిస్తున్నారని తెలిపారు.బోడుప్పల్‌తో



పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఎగ్జిబిషన్‌ను సందర్శించి తమకు నచ్చిన దుస్తులను కొనుగోలు చేయాలని ఎబ్బా పటేల్ సూచించారు.అన్ని వర్గాల వారికి దుస్తులు నిర్వాహ కులు మాట్లాడుతూ వినియోగ దారుల అవసరాలకు అనుగు ణంగా మహిళలు, పురుషులు,చిన్నారులకు సంబంధించిన వివిధ రకాల దుస్తులను ఒకే చోట అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పండుగల సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక కలెక్షన్లతో పాటు




ఆకర్షణీయమైన ధరల్లో విక్రయాలు చేపడు తున్నట్లు పేర్కొన్నారు.ఈ ఫెస్టివల్ సేల్ సెప్టెంబర్ 25 నుంచి అక్టోబర్ 19 వరకు కొనసాగుతుందని,ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.బోడుప్పల్, కేశవనగర్‌తో పాటు పరిసర ప్రాంతాల ప్రజలు ఎగ్జిబిషన్‌ను సందర్శించి సేల్‌ను వినియోగించు కోవాలని కోరారు.

# వి బి జి రామ్ జి అభివృద్ధి పనులను పరిశీలించిన ఎంపిడిఓ శ్రీనివాస్



**మద్దూరు సెప్టెంబర్ 25, ప్రజా వాణి,** మండలంలోని నర్సాయపల్లి గ్రామ పంచాయతీలో మద్దూరు మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు,సర్పంచ్ శనిగరం.సత్యనారాయణ ఆధ్వర్యంలో మద్దూరు మండల నూతన ఎంపీడీఓ సిహెచ్.శ్రీనివాస్ గ్రామ పంచాయతీలో విబి జి రామ్ జిలో భాగంగా నిర్మిస్తున్న గ్రామ పంచాయతీ భవనం,ఐకేపీ మహిళ భవనాలను పరిశీలించారు.ఆనంతరం భాగంగా ఫామ్ పాండ్ లు,ఇంకుడు గుంతలు,కమ్యూనిటీ ఇంకుడు గుంతలు,బోర్ వెల్ రీఛార్జీ పాయింట్ లు మరియు రైన్ వాటర్ హార్వేస్టింగ్ పిట్లు,ఇందిరమ్మ ఇండ్లకు ఇంకుడు గుంతలు నిర్మించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏ పి ఓ మంజుల, పంచాయతీ కార్యదర్శి పి.భాస్కర్,గ్రామ ప్రజలు,తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి రైతుకు ఆధార్ తరహాలో “విశిష్ట” గుర్తింపు కార్డులు.

**● ఏవో డాకేశ్వర్ గౌడ్**

**చిన్నంబావి ప్రజావాణి సెప్టెంబర్ 25** చిన్నంబావి :కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు పొందాలంటే రైతులకు ఇకనుంచి కచ్చితంగా విశిష్ట గుర్తింపు కార్డు ఉండాలి. “ 11 నెంబర్లతో ఐడి కార్డ్ ఉన్న రైతులకు కేంద్ర పథకాలు సక్రమంగా అందుతాయి అకాల వర్షాలు ,పకృతి విపత్తులు సమయంలో నమోదు చేస్తే రైతు పంట సాగు చేసిన పూర్తి వివరాలు తెలుస్తాయి మరియు పీఎం కిసాన్, పంటల బీమా ఇతర కేంద్ర పథకాలు రైతులకు సకాలంలో అందుతాయి.ప్రతి రైతు ఆధార్ మరియు ఆధార్ తో అనుసంధానమైన మొబైల్ నెంబరు సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారి సంప్రదించగలరు అని ఏవో డాకేశ్వర్ గౌడ్ అన్నారు. చిన్నంబావి మండలం సంబంధించి మొత్తము రైతులు10869ఇందులో8051రైతులు నమోదు చేసుకున్నారు. ఇంకా2818 రైతులు నమోదు చేసుకోలేదు. ఈ విషయం గమనించి నమోదు చేసుకోగలరని ఆయన అన్నారు. అందులో భాగంగా అయ్యవారిపల్లి గ్రామంలో అవగాహన కార్యక్రమం కల్పించడం జరిగింది. కార్య క్రమంలో సర్పంచ్ పద్మావతమ్మ , ఉప సర్పంచ్ లింగస్వామి , వార్డ్ నెంబర్ కృష్ణ , ఏవో డాకేశ్వర్ గౌడ్ , ఏ ఈ ఓ మేఘన, పంచాయతీ సెక్రటరీ, మరియు రైతులు పాల్గొన్నారు.





# బాధిత కుటుంబానికి అండగా నిలిచిన కాంటారెడ్డి తిరుపతిరెడ్డి



**చిన్నశంకరంపేట,సెప్టెంబర్ 25, మన ప్రజావాణి:** చిన్నశంకరంపేట మండల పరిధిలోని కోర్విపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముద్రాతి బాలయ్య గారి తల్లి ముంద్రాతి దుర్గమ్మ ఈరోజు ఉదయం మరణించడం జరిగింది. ఇట్టి విషయాన్ని స్థానిక బిఆర్ఎస్ నాయకుల ద్వారా మరణించిన విషయాన్ని తెలుసుకున్న బిఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్చార్జ్ మరియు రాష్ట్ర నాయకులు కాంటారెడ్డి తిరుపతిరెడ్డి గారు 5000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు.వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు ముక్కిరి బాలమల్లు మరియు మండల ఎస్టీసెల్ అధ్యక్షులు నునావత్ లాలు నాయక్,బాల మల్లేష్, సాయిలు, నర్సింలు, మొక్కిరి మల్లేష్, ఈరు, రాజేందర్, బాబు, కుమార్,పాపయ్య, శీను, తదితరులు పాల్గొన్నారు.

# శివశక్తి యూత్ లడ్డూను వేలంపాటలో కైవసం చేసుకున్న రామాయపల్లి సర్పంచ్ బాగానొల్ల రేణుక తిరుపతి

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్25, మన ప్రజావాణి:** వినాయక నవరాత్రులలో భాగంగా చిన్నశంకరంపేట మండల పరిధిలోని రామాయపల్లి గ్రామ శివశక్తి యూత్ అసోసియేషన్ సభ్యుల ఆధ్వర్యంలో నవరాత్రులు , భక్తిశ్రద్ధలతో పూజలు అందుకున్న ఆది దేవుని వినాయకుని లడ్డూను బాగాన్నోల్ల రేణుక తిరుపతి వేలంలో కైవసం చేసుకున్నారు. అనంతరం రామయపల్లి సర్పంచ్ బాగాన్నోల రేణుక తిరుపతి మాట్లాడుతూ వేలంలో సొంతం చేసుకున్న లడ్డును బిఆర్ఎస్ మెదక్ నియోజకవర్గ ఇన్చార్జ్ కాంటారెడ్డి తిరుపతి రెడ్డి గారు మెదక్ ఎమ్మెల్యే కావాలని ఆకాంక్షిస్తూ గ్రామ ప్రజలకు పంపిణీ చేశామని తెలిపారు. నిత్యం ప్రజాసేవలో ప్రజల మధ్యనే ఉంటూ కష్ట సుఖాలలో పాలుపంచుకుంటున్న కంటారెడ్డి తిరుపతి రెడ్డి గారు గణనాథుడు ఆశీస్సులతో మెదక్ ఎమ్మెల్యేగా ప్రజలకు మరిన్ని సేవలు చేయాలని ఆ భగవంతున్ని ప్రార్థించామని సర్పంచ్ తెలిపారు.



# చలో యాదగిరిగుట్టను విజయవంతం చేయండి



**● .రెడ్డి సంధ్యా రెడ్డి**

**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25 ప్రజావాణి):** ఈ నెల 27వ తేదీన జరిగే చలో యాదగిరిగుట్ట 9వ ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర మహిళా కో-కన్వీనర్, ములుగు జిల్లా మహిళా అధ్యక్షురాలు రెడ్డి సంధ్యా రెడ్డి పిలుపునిచ్చారు.గోవిందరావుపేట మండలం పసరా గ్రామంలో శుక్రవారం ఉద్యమకారుల ఫోరం 9వ ఆవిర్భావ దినోత్సవ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత తొమ్మిది సంవత్సరాలుగా డాక్టర్ సీమ శ్రీనివాస్, నందగిరి రజనీకాంత్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని ఉద్యమకారులను ఏకం చేసి 33 జిల్లాలు తిరుగుతూ కాంగ్రెస్ మేనిఫెస్టోలోని హామీల అమలు కోసం కృషి చేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం కమిటీ ఏర్పాటుకు కీలకంగా పనిచేసిన వ్యక్తి సీమ శ్రీనన్న అని అన్నారు.ముఖ్యమంత్రి వెంటనే ఉద్యమకారులకు ఇచ్చిన హామీలపై స్పష్టమైన ప్రకటన చేసి, వెబ్ సైట్ ప్రారంభించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మళ్లీ పోరాటానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

# మానవత్వం చాటుకున్న సీపీఐ నేత అందె అశోక్

● అభినందించిన చేర్యాల ఎస్ఐ అపూర్వరెడ్డి



**చేర్యాల సెప్టెంబర్ 25 ప్రజావాణి :** రోడ్డుపై దొరికిన మొబైల్ ఫోన్‌ను యజమానికి అప్పగించి సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ మానవత్వాన్ని చాటుకున్నారు. చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన అందె అశోక్ శుక్రవారం తన పని మీద చేర్యాలకు వస్తుండగా ఆకునూరు-చేర్యాల మార్గమధ్యలో రహదారిపై ఒక మొబైల్ ఫోన్ పడి ఉండటం గమనించారు. వెంటనే ఆ ఫోన్‌ను తీసుకొని చేర్యాల పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. పోలీసులు ఫోన్ నెంబర్ ఆధారంగా యజమానిని గుర్తించగా ధూల్మిట్ట మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన గద్దల స్నేహ గా తేలింది. పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ గూడ అపూర్వరెడ్డి చేతుల మీదుగా 50వేల విలువ చేసే మొబైల్ ఫోన్‌ను యజమాని స్నేహకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ అపూర్వరెడ్డి అందె అశోక్ నిజాయితీని,మానవత్వాన్నిఅభినందించారు. నిజాయితీగా వ్యవహరించిన అశోక్ పై స్థానికులు ప్రశంసలు కురిపించారు.

# కూకట్‌పల్లిలో నేడు వినాయక శోభాయాత్ర

● అంగరంగ వైభవంగా గణనాథుడి సాగనంపు.. ఉదయం 9 గంటలకు ప్రారంభం






**కూకట్‌పల్లి, సెప్టెంబర్ 25 (ప్రజావాణి):** వినాయక నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా కూకట్‌పల్లిలో శుక్రవారం శ్రీ వినాయక భక్త బృందం ఆధ్వర్యంలో ఘనంగా వినాయక శోభాయాత్ర నిర్వహించనున్నారు. కూకట్‌పల్లి బీజేపీ కార్యాలయం ఆధ్వర్యంలో జరిగే ఈ వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు శ్రీ సీతారామచంద్ర దేవస్థానం, బజరంగ్ హనుమాన్ ఆలయం, కూకట్‌పల్లి గ్రామం మీదుగా శోభాయాత్ర ప్రారంభం కానుంది. అనంతరం సాయంత్రం 6 గంటలకు రంగనాయక చెరువు వద్ద గణనాథుడి విగ్రహ నిమజ్జనం నిర్వహించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తిశ్రద్ధలతో గణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలకాలని నిర్వాహకులు కోరారు.

# శ్రీలక్ష్మీనరసింహస్వామి దర్శించుకున్న సింగరేణి ఉన్నతాధికారులు





**రామగిరి,మన సమగ్ర ప్రజావాణి సెప్టెంబర్ 25** రామగిరి మండలం సుందిల్ల శ్రీలక్ష్మీనరసింహస్వామి స్వామివారిని సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌కు చెందిన డైరెక్టర్లు టిఆర్ కన్నన్,డా.నగేష్ కుమార్, డా.సత్యనారాయణ,అశోక్ కుమార్,ఆర్జీ వన్ జీఎం లలిత్‌కుమార్,ఆర్జీ టూ జీఎం లక్ష్మీపతిగౌడ్,ఆర్జీ త్రి జీఎం సుంకరి మధుసూదన్,సింగరేణి ఆఫీసర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కోలా శ్రీనివాస్ లు లక్ష్మీ నరసింహ స్వామి నీ దర్శించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింగరేణి ఉన్నతాధికారులకు ఆలయ అర్చకులు రుద్రబట్ల జయంత్ శర్మ,కమిటీ సభ్యులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువాలతో సత్కరించి స్వామివారి చిత్ర పటాలతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ డైరెక్టర్లు రేకుంట్ల రవి,నరెట్ల శ్రీనివాసరావు, మాటూరి సమ్మయ్య,గ్రామ ఐదో వార్డు సభ్యురాలు గర్రెపల్లి చంద్రకళ నరేష్‌గౌడ్,గ్రామానికి చెందిన ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

● వల్లంపట్ల గ్రామ సర్పంచ్ కర్నె సునీత మనోహర్





**మద్దూరు సెప్టెంబర్ 25, ప్రజా వాణి,** సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం వల్లంపట్ల గ్రామంలో సర్పంచ్ కర్నే సునీత మనోహర్ ఆధ్వర్యంలో ఫ్రైడే డ్రైడే నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సునీత మనోహర్ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి సోకకుండా మన చుట్టు నిల్వ నీటిని లేకుండ చూసుకోవాలన్నారు.వర్ష కాలంలో సంక్రమించే వ్యాధులను తరిమి కొట్టాలంటే మన చుట్టు ఉన్న పరిసరాలను ప్రతి కుటుంబం పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్ ఉపసర్పంచ్ మాచర్ల రఘు,వార్డు సభ్యులు వేల్పుల రజిత,నల్లగొప్పుల రాజు, గుండెగోని స్వాతి రాకేష్,మల్లిగారి రంజిత్, ఏ ఎన్ఎం,ఆశ వర్కర్లు గ్రామపంచాయతీ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఫైజాబాద్ లో ఘనంగా పోషణ మాసం కార్యక్రమం



**చిలిపిచెడ్. సెప్టెంబర్ 25 ప్రజావాణి** మెదక్ జిల్లా చిలిపిచెడ్ మండలం ఫైజాబాద్ గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసం – 2026 కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్, శశికళ ఆశా వర్కర్లు, గ్రామ మహిళలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు పోషకాహారం తీసుకోవడం ద్వారానే ఆరోగ్యంగా ఉంటారని, ఆకుకూరలు, పండ్లు, పాలు, గుడ్లు, పప్పు ధాన్యాలు రోజూ ఆహారంలో తీసుకోవాలని అవగాహన కల్పించారు.చిన్నారుల్లో రక్తహీనత, తక్కువ బరువు సమస్యలు రాకుండా అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నరు

# సహకార సంఘ సభ్యుల ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యత

● మాజీ సెక్రటరీ మామిడాల అశోక్ కుమార్ మృతికి సంతాపం
● సర్వ సభ్య సమావేశంలో మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్





**మంథని నియోజకవర్గం, సెప్టెంబర్ 25, ప్రజావాణి:** ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సభ్యుల ప్రయోజనాలకే ప్రథమ ప్రాధాన్యతనిస్తూ సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నామని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లి.,మంథని కార్యాలయంలో 89 సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ మాట్లాడుతూ సంఘ సభ్యులు, రైతులకు అవసరమైన సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు తమవంతు కృషి చేస్తున్నామని తెలిపారు. సహకార సంఘం ద్వారా రైతులకు పంట రుణాలు, దీర్ఘకాలిక రుణాలు, ఎరువులు, ధాన్యం కొనుగోలు వంటి వివిధ సేవలు అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతులకు సకాలంలో అవసరమైన సహకారం అందిస్తూ, సంఘాన్ని మరింత బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సహకార సంఘం అభివృద్ధి చెందితే సభ్యులు, రైతులకు మరిన్ని ప్రయోజనాలు అందే అవకాశం ఉంటుందని, అందుకు పాలకవర్గం, సిబ్బంది, సభ్యులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సంఘం ద్వారా గత రబీ సీజన్ లో ఎక్కడ లేని విధంగా అత్యధికంగా 36 కేంద్రాలు నిర్వహించి 5,05,585 క్వింటాల్ల ధాన్యం కొనుగోలు చేసి జిల్లాలో, రాష్ట్రంలో ప్రథమ స్థానం లో నిలిచామని అన్నారు. అంతే కాకుండా ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో జిల్లా కలెక్టర్, సహకార అధికారి సహకారం తో గుంజపడుగు శివారు లో రూ.3.40 కోట్లతో పిఎం కుసుమ్ ద్వారా సౌర విద్యుత్ ను ప్రోత్సహించేందుకు సోలార్ ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తి చేసుకోవడం జరిగిందని అన్నారు. తద్వారా సంఘానికి రూ.51 లక్షల ఆదాయం సమకూరనుందని అన్నారు. ఈ సీజన్ లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో లారీలు, గోనె సంచుల సమస్య రాకుండా తగు చర్యలు చేపడుతున్నామని, ఎలాంటి కోతలు లేకుండా ధాన్యం కొనుగోలు చేసి రైస్ మిల్లల కు తరించేలా తగు పకడ్బంది ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో పూర్తి జవాబుదారి తనంగా వ్యవహరిస్తామని, రైతుల ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగు చర్యలు చేపడుతామని అన్నారు. గత సీజన్ లో జరిగిన ఇబ్బందులు మళ్ళి పునరావృతం కాకుండా చూసుకుంటామని అన్నారు. ఏఎంసి చైర్మన్ కుడుదుల వెంకన్న మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం లో రైతుల కు ధాన్యం లో ఎలాంటి కోతలు లేకుండా కొనుగోళ్ళు చేపడుతున్నామని అన్నారు. టీజీఈఆర్సి సలహాదారు శశి భూషణ్ కాచే మాట్లాడుతూ స్వాతంత్ర్య, సహకార ఉద్యమ కాలంలో కొంత మంది వ్యక్తులు తమ ఆస్తులు, డబ్బులు దారాదత్తం చేసి సంస్థలను కాపాడుకున్నారని అన్నారు. కరీంనగర్ జిల్లాలో మెట్ పల్లి, వావిలాల చేనేత సహకార సంఘాలు కాల గమనం లో నిర్వహణ లోపాల మూలంగా నిర్వీర్యం అయ్యాయని అన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, డాక్టర్ వై ఎస్ రాజశేఖర్ రెడ్డి లాంటి వారు చేపట్టిన రుణ మాఫి లాంటి సంస్కరణల వల్ల రైతుల రుణాలు మాఫీ అయ్యాయని, సకాలం లో రుణాలు చెల్లించిన వారికి రూ.5 వేల ఇన్సెంటివ్ అందిచారని గుర్తు చేశారు. తద్వారా రైతులకు ఆర్థిక భరోసా అందటం తో పాటు సంఘాలు ఆర్థికంగా నిలదొక్కు గలిగాయని అన్నారు. ఈ సందర్భంగా సంఘ కార్యదర్శి బొద్దుల సమ్మయ్య సంఘ జమ ఖర్చులు పట్టిక చదివి వినిపించారు. అలాగే సభ్యులు లేవనెత్తిన పలు అంశాలకు సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ సమాధానాలు ఇచ్చారు. ముందుగా సంఘ మాజీ కార్యదర్శి మామిడాల అశోక్ కుమార్ అకాల మృతి కి సంతాప సూచకంగా రెండు నిమిషాల పాటు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. ఈ సమావేశంలో సంఘ డైరెక్టర్లు ఆకుల రాజబాపు, పెద్దిరాజు ప్రభాకర్, రావికంటి సతీష్ కుమార్, సిరిముర్తి ఓదెలు, లెక్కల కిషన్ రెడ్డి, కొత్త శ్రీనివాస్, దాసరి లక్ష్మి–మొండయ్య, ఉడుత మాధవి -- పర్వతాల్ యాదవ్, దేవల్ల విజయ్ కుమార్, మున్సిపల్ కౌన్సిలర్ మాచిడి రాజు గౌడ్, సర్పంచులు తోటపల్లి పోచయ్య, సంగెం సరోజన– గట్టయ్య, న్యాతరి లతా–శ్రీనివాస్, గుమ్మడి సమ్మయ్య, సంధ్య–భానేష్, జాడి రామస్వామి, మాజీ ఎంపిపి కొండ శంకర్, సంఘ మాజీ డైరెక్టర్ ఇనుముల సతీష్, నాయకులు బెజ్జంకి డిగంబర్, వేల్పుల గట్టయ్య, తిరుపతి, సబ్బని సంతోష్, పెద్ద సంఖ్యలో సభ్యులు, రైతులు,సంఘ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# భగత్‌సింగ్ స్ఫూర్తితో యువతరం ముందుకు సాగాలి

● సెప్టెంబర్ 27 నుండి 30 వరకు భగత్ సింగ్ జయంతి ఉత్సవాలు
● సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి





**ప్రజావాణి, సెప్టెంబర్ 25, హనుమకొండ :** భారతదేశ స్వాతంత్ర్య సమరయోధులు షహీద్ భగత్‌సింగ్ స్ఫూర్తితో యువతరం ముందుకు సాగాలని, సెప్టెంబర్ 27 నుండి 30 వరకు జరిగే భగత్‌సింగ్ 119వ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ బాలసముద్రంలోని ఏఐవైఎఫ్ జిల్లా కార్యాలయంలో ఆ సంఘం జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం జిల్లా అధ్యక్షుడు నోముల కిశోర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, అతిథులుగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి, ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్ హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి మాట్లాడుతూ భగత్‌సింగ్ 1907 సెప్టెంబర్ 28న జన్మించారన్నారు. పన్నెండేళ్ళకే భారత జాతి విముక్తి కోసం ఉద్యమ ప్రయాణాన్ని అవపోసన పట్టి 14 ఏళ్లకే భారత స్వతంత్ర సంగ్రామంలోకి అడుగులేసి 23 ఏళ్లకే ఉరితాళ్లు ముద్దాడిన వేగుచుక్క అని అన్నారు. ధైర్యానికి దేశ భక్తికి ప్రతీకగా వీరత్వానికి మారుపేరుగా నవతరానికి భగత్ సింగ్ ఒక స్ఫూర్తిగా నిలిచాడని ఆయన పేర్కొన్నారు. భారత బానిస సంకెళ్ళు తెంచడం కోసం ఉరికంబాన్ని ముద్దాడిన విప్లవ ధృవతార షహిద్ భగత్ సింగ్ అని కొనియాడారు. భగత్‌సింగ్ తన జీవితకాలంలో రచనలు, జైలు లేఖలు, రాజకీయ ఆలోచనల ద్వారా యువతను సామాజిక మార్పు గురించి ఆలోచించేలా చేసిన వ్యక్తిగా చారిత్రక ఆధారాల్లో కనిపిస్తారన్నారు. భగత్‌సింగ్ పేరును కేవలం నినాదాల్లో కాకుండా ఆయన జీవితాన్ని, రచనలను, ఆలోచనలను చదవడం ద్వారా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నేటి యువత ఆయన స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్ పోరాటాలకు సిద్ధం కావాలని అన్నారు. ఆనాటి వారి త్యాగాలను కేంద్రంలో బిజెపి ప్రభుత్వం చరిత్రను వక్రీకరించుతున్నదని, విద్యను సైతం కాషాయీకరణ చేస్తూ అమరుల త్యాగాలను కించపరిచే విధంగా వ్యవహరిస్తున్నదని ధ్వజమెత్తారు. మత చాందస వాద విధానాలు సామ్రాజ్య వాద దోపిడి పాలసీపై తిరుగుబాటు చేసేందుకు త్యాగాన్ని స్ఫూర్తిగా తీసుకొని యువత అంతరాల వ్యవస్థను ధ్వంసం చేస్తూ సమాజ మార్పు కోసం ఉద్యమించాలని వారు పిలుపునిచ్చారు. అదే విధంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట బిక్షపతి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భగత్ సింగ్ జీవిత చరిత్రను పాఠ్యపుస్తకాల్లో చేర్చడంతో పాటు జయంతి, వర్ధంతిలను అధికారికంగా నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ మాజీ జిల్లా కార్యదర్శి ఎన్ ఎ స్టాలిన్, ఏఐవైఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ తాటికంటి మమత, గుగులోత్ సురేష్, పల్లకొండ శ్రీకాంత్, పెనుకుల మధు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలకు హ్యాండ్ మేడ్ జ్యువెలరీపై శిక్షణ

● నైపుణ్యాన్ని ఉపాధిగా మలుచుకుని స్వయం సమృద్ధి సాధించాలి





**నంగునూరు, సెప్టెంబర్ 25:** మహిళా ఆర్థిక సాధికారతలో భాగంగా మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలను కల్పించాలనే లక్ష్యంతో ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా, స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నంగునూరులో హ్యాండ్ మేడ్ జ్యువెలరీ తయారీపై నైపుణ్య శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది.ఈ సందర్భంగా అదనపు డీఆర్డీవో సుధీర్ మాట్లాడుతూ మహిళలు నూతన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుని ఆర్థికంగా ఎదగడంతో పాటు కుటుంబానికి అదనపు ఆదాయ వనరుగా నిలవాలని ఆకాంక్షించారు. శిక్షణలో చురుకుగా పాల్గొని, నేర్చుకున్న నైపుణ్యాలను భవిష్యత్తులో ఉపాధి, స్వయం ఉపాధి కోసం వినియోగించుకోవాలని సూచించారు. ఆర్ఎస్ఈటీఐ డైరెక్టర్ గేమూ నాయక్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో నైపుణ్యాభివృద్ధి మహిళల ఆర్థిక స్వావలంబనకు ఎంతో కీలకమని అన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసి, తాము అభివృద్ధి చెందడంతో పాటు తమతోటి మహిళలకు కూడా మార్గదర్శకులుగా నిలవాలని కోరారు.ఈడీఐఐ సంస్థ అధికారి ఎడ్మండ్ భూపతి మాట్లాడుతూ మొత్తం 22 రోజుల పాటు ఈ శిక్షణ కొనసాగుతుందని తెలిపారు. థియరీతో పాటు ప్రాక్టికల్ శిక్షణను అందించి, హ్యాండ్‌మేడ్ జ్యువెలరీ తయారీకి సంబంధించిన వివిధ అంశాల్లో మహిళలకు పూర్తి స్థాయి నైపుణ్యాన్ని అందించనున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తయిన అనంతరం సర్టిఫికెట్లు అందజేయడంతో పాటు, నేర్చుకున్న నైపుణ్యాలను స్వయం ఉపాధిగా లేదా చిన్న వ్యాపారంగా అభివృద్ధి చేసుకునేందుకు ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. నంగునూరు సర్పంచి బాల పోచయ్య మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా ఎదగడానికి ఇటువంటి నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని అన్నారు. హ్యాండ్‌మేడ్ జ్యువెలరీకి మార్కెట్‌లో మంచి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. శిక్షణలో నేర్చుకున్న నైపుణ్యాలను ఉపయోగించుకుని మహిళలు స్వయం ఉపాధి పొందాలని సూచించారు. తమకు లభిస్తున్న అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

25 మంది మహిళల ఎంపిక

శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యే మహిళా అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను నిర్వహించి 25 మంది మహిళలను ఎంపిక చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. 22 రోజుల శిక్షణలో జ్యువెలరీ తయారీ నైపుణ్యాలతో పాటు, స్వయం ఉపాధి, చిన్న వ్యాపార నిర్వహణకు సంబంధించిన అంశాలపై కూడా అవగాహన కల్పించనున్నారు. హ్యాండ్‌మేడ్ జ్యువెలరీ తయారీ ద్వారా మహిళలు తమ ఇంటి నుంచే చిన్న స్థాయి వ్యాపారాన్ని ప్రారంభించి, తమ నైపుణ్యానికి అనుగుణంగా ఆదాయాన్ని పెంపొందించుకునే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శ్రీధర్, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి నితీష్ కుమార్, వీవో, వీవోఏ ప్రతినిధులు, శిక్షణకు ఎంపికైన మహిళా అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు."నైపుణ్యం – స్వయం ఉపాధికి బాట, మహిళా సాధికారతకు పునాది" అనే లక్ష్యంతో ఈ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేసిన సర్పంచ్ వీరాస్వామి నాగమణి



**మోతె, సెప్టెంబర్ 25(ప్రజావాణి )** మండల పరిధిలోని మామిళ్ళగూడెం గ్రామానికి మంజూరైన770 స్మార్ట్ రేషన్ కార్డులను గ్రామ సర్పంచ్ కోరివి వీరాస్వామి నాగమణి శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ వీరాస్వామి నాగమణి , మాట్లాడుతూ, ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు సులభంగా, పారదర్శకంగా అందించేందుకు రేషన్ కార్డు పేద, మధ్యతరగతి కుటుంబాలకు తక్కువ ధరలకు నిత్యావసర సరుకులు అందడంతో పాటు, ప్రభుత్వం అమలు చేసే అనేక సంక్షేమ పథకాలకు అర్హత నిర్ధారణలో ఇది కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు.స్మార్ట్ రేషన్ కార్డుల విధానం ప్రజలకు మరింత సౌకర్యవంతమైన, ఆధునిక సేవలను అందించే దిశగా ఒక ముఖ్యమైన అడుగుగా చెప్పవచ్చు.అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకట్ రెడ్డి , గ్రామ శాఖ అధ్యక్షుడు నవీలే శ్రీను , డీలర్ రామకోటయ్య , పార్టీ సీనియర్ నాయకులు కలింగారెడ్డి , కోరివి సైదులు ,అమృత రెడ్డి,గ్రామ కార్యదర్శి కవిత , జిపిఓ ప్రవీణ్ , బ్రహ్మాచారి,వీరారెడ్డి,మంచికంటి వీరస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పెన్షన్ దరఖాస్తుదారుల వెరిఫికేషన్ కొనసాగింపు

- అవసరమైన వివరాలు, పత్రాలు అందజేసి సహకరించాలి
- సాయి వర్మ, ఏఈఓ



**నంగునూరు, సెప్టెంబర్ 25:**నంగునూరు మండలం ఆంక్షపూర్ లో వివిధ రకాల సామాజిక భద్రతా పెన్షన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వెరిఫికేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. దరఖాస్తుదారులు సమర్పించిన వివరాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం వారి అర్హతలను నిర్ధారించే ప్రక్రియను చేపడుతున్నారు. వెరిఫికేషన్‌లో భాగంగా దరఖాస్తుదారుల వ్యక్తిగత వివరాలు, సమర్పించిన పత్రాలు, కుటుంబ పరిస్థితులు, పెన్షన్‌కు సంబంధించిన అర్హత అంశాలను అధికారులు పరిశీలిస్తున్నారు. క్షేత్ర స్థాయిలో వాస్తవ పరిస్థితులను తెలుసుకుని అర్హులైన వారిని గుర్తించేందుకు వివరాల సేకరణ, ధ్రువీకరణ చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా వెరిఫికేషన్ అధికారి ఏఈఓ సాయి వర్మ మాట్లాడుతూ.. పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరూ వెరిఫికేషన్ సమయంలో అధికారులకు పూర్తిస్థాయిలో సహకరించాలని కోరారు. అధికారులు అడిగే వివరాలను స్పష్టంగా అందజేయడంతో పాటు, అవసరమైన పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. వెరిఫికేషన్ సమయంలో దరఖాస్తుదారులు అందుబాటులో ఉండి సరైన సమాచారం అందిస్తే ప్రక్రియ సజావుగా పూర్తవుతుందని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన వారికి తదుపరి చర్యలు చేపడతామని పేర్కొన్నారు. పెన్షన్ దరఖాస్తుదారులు వెరిఫికేషన్‌కు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత అధికారులను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని ఏఈఓ సాయి వర్మ సూచించారు. అర్హత నిర్ధారణ ప్రక్రియ పారదర్శకంగా జరిగేలా అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# నంగునూరు మండలంలోని వార్డు సభ్యులకు అక్టోబర్ 5 నుంచి 16 వరకు ప్రత్యేక శిక్షణ



**నంగునూరు, సెప్టెంబర్ 25:**నంగునూరు మండలంలోని 25 గ్రామ పంచాయతీలకు చెందిన వార్డు సభ్యులకు అక్టోబర్ 5 నుంచి 16వ తేదీ వరకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల అధికారులు తెలిపారు. గ్రామ పంచాయతీల పరిపాలన, అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందించాల్సిన సేవలపై వార్డు సభ్యులకు పూర్తి అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణను ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.శిక్షణ కార్యక్రమాన్ని రెండు బ్యాచ్‌లుగా నిర్వహించనున్నారు. ఒక్కో బ్యాచ్‌లో 110 మంది చొప్పున మొత్తం 220 మంది వార్డు సభ్యులకు శిక్షణ ఇవ్వనున్నారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ కొనసాగనుంది. శిక్షణకు హాజరయ్యే వార్డు సభ్యులకు పంచాయతీ పరిపాలనకు సంబంధించిన వివిధ అంశాలపై నిపుణులు, అధికారులు అవగాహన కల్పించనున్నారు.గ్రామ పంచాయతీల నిర్వహణ విధానం, వార్డు సభ్యుల విధులు--బాధ్యతలు, గ్రామ సభల నిర్వహణ, పంచాయతీ సమావేశాల్లో వార్డు సభ్యుల పాత్ర, ప్రజల సమస్యలను గుర్తించి పరిష్కారానికి కృషి చేయడం వంటి అంశాలపై శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధి దీపాలు, పారిశుధ్య నిర్వహణ, మౌలిక వసతుల అభివృద్ధి తదితర ప్రజా సేవలపై కూడా అవగాహన కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు.

గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాల్లో వార్డు సభ్యుల భాగస్వామ్యం, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వారి పాత్ర, ప్రజలతో సమన్వయం చేసుకుంటూ గ్రామ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లే విధానం తదితర అంశాలను కూడా శిక్షణలో వివరించనున్నారు.మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల వార్డు సభ్యులు నిర్ణయించిన తేదీల ప్రకారం శిక్షణకు హాజరై, కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. ఈ శిక్షణ ద్వారా వార్డు సభ్యులకు తమ విధులు, బాధ్యతలపై మరింత స్పష్టత ఏర్పడి గ్రామ పంచాయతీల పరిపాలనలో ప్రజాప్రతినిధుల భాగస్వామ్యం మరింత బలోపేతం కానుందని అధికారులు తెలిపారు.

# అభివృద్ధి పనులకు స్పీడ్ పెంచాలి!

- కేంద్ర పథకాల అమలులో జాప్యం వద్దు.. అధికారుల సమన్వయంతో పనులు పూర్తి చేయాలి
- : డీఐషా సమావేశంలో
- మెదక్ ఎంపీ రఘునందన్ రావు

**మన ప్రజావాణి మెదక్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 25**

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో అధికారుల సమన్వయం కీలకం

డీఐషా సమావేశంలో మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ రావు

మెదక్ జిల్లాలో కేంద్ర ప్రభుత్వ నిధులతో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేసి ప్రజలకు వాటి ఫలాలు అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు సూచించారు.

శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ (డీఐషా) సమావేశానికి ఎంపీ రఘునందన్ రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో అమలవుతున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాల పురోగతిని శాఖల వారీగా సమీక్షించారు.

మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి:

గ్రామీణాభివృద్ధి, రహదారులు, తాగునీరు, పారిశుధ్యం, విద్య, వైద్యం, వ్యవసాయం, ఉపాధి హామీ, గృహ నిర్మాణం, విద్యుత్, మహిళా--శిశు సంక్షేమం, సామాజిక సంక్షేమం, పంచాయతీరాజ్, మున్సిపల్ అభివృద్ధి తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.

కేంద్ర ప్రభుత్వ పథకాల కింద జిల్లాకు మంజూరైన నిధులు, చేపట్టిన పనులు, పూర్తయిన పనులు, పురోగతిలో ఉన్నవి, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను ఎంపీ అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు నేరుగా ప్రయోజనం చేకూర్చే పథకాల అమలులో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్యం, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని అన్నారు. అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.




విద్య, వైద్యంపై పర్యవేక్షణ:

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు, విద్యార్థుల హాజరు, తాగునీరు, మరుగుదొడ్ల వంటి సదుపాయాలను నిరంతరం పర్యవేక్షించాలని విద్యాశాఖ అధికారులకు సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు చేపట్టాలని, గ్రామీణ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు.

ప్రతి గ్రామానికి సురక్షిత తాగునీరు:

తాగునీటి పథకాల పురోగతిని సమీక్షించిన ఎంపీ.. ప్రతి గ్రామానికి సురక్షితమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నీటి సరఫరాలో సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పరిష్కరించే విధంగా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అన్నారు.



ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, వివిధ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసినప్పుడే అభివృద్ధి కార్యక్రమాలు లక్ష్యాలను చేరుకుంటాయని రఘునందన్ రావు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ద్వారా జిల్లాకు అందుతున్న నిధులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకుని అభివృద్ధి పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి: కలెక్టర్

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. అధికారుల సమన్వయంతో ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ప్రజలకు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎంపీ రఘునందన్ రావు సూచించిన అంశాలను అమలు చేయాలని, వచ్చే డీఐషా సమావేశం నాటికి పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో డీఆర్వో అంబదాస్ రాజేశ్వర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఎఫ్ఓ జోజి, జిల్లా స్థాయి అధికారులు, డీఐషా కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌తో దాసరి ఉషక్క భేటీ

- పెద్దపల్లి నియోజకవర్గ సమస్యలు, అభివృద్ధి అంశాలపై చర్చ

**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి సెప్టెంబర్ 25**పెద్దపల్లి: నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకురాలు, బీసీ జేఏసీ పెద్దపల్లి జిల్లా చైర్మన్ దాసరి ఉషక్క బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గానికి సంబంధించిన పలు ముఖ్యమైన అంశాలతో పాటు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆయనతో చర్చించారు.ప్రధానంగా యువతకు ఉపాధి అవకాశాలు, విద్యారంగ అభివృద్ధి, మహిళలు, బీసీ వర్గాలు, పేద ప్రజల సంక్షేమం తదితర అంశాలను కేటీఆర్ దృష్టికి దాసరి ఉషక్క తీసుకెళ్లినట్లు తెలిపారు. పెద్దపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అవసరమైన చర్యలు, ప్రజా సమస్యల పరిష్కారానికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై కూడా చర్చ జరిగినట్లు పేర్కొన్నారు.ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎప్పటికప్పుడు పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి, వారి పరిష్కారం కోసం కృషి చేస్తామని దాసరి ఉషక్క తెలిపారు. యువత, విద్యార్థులు, మహిళలు, బీసీ వర్గాలు, పేద ప్రజల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై మరింత చురుకుగా పనిచేస్తామని ఆమె పేర్కొన్నారు.




కేటీఆర్‌పై ప్రత్యేక అభిమానం

కేటీఆర్‌ను కలవడం తనకు ఎంతో సంతోషంగా ఉందని దాసరి ఉషక్క తెలిపారు. ఆయనపై తనకు ఎంతో గౌరవం, అభిమానం ఉందని, ఆయనలోని సహనం, వినయం, ఎంత బిజీగా ఉన్నప్పటికీ ప్రతి ఒక్కరికీ సమయం కేటాయించే తీరు తనను ఎంతగానో ఆకట్టుకుంటుందని ఆమె పేర్కొన్నారు. ఆయనను కలిసిన ప్రతిసారీ ఎన్నో విషయాలు నేర్చుకోవాలని అనిపిస్తుందని తెలిపారు.ఈ సందర్భంగా ఉషక్క సోదరుడు, వివిధ రంగాల్లో తమ ప్రయాణాన్ని కొనసాగిస్తున్న ఆమె స్నేహితులను కూడా కేటీఆర్ ఆత్మీయంగా కలుసుకుని వారితో కొంత సమయం గడిపినట్లు ఆమె తెలిపారు. ఆయనతో జరిగిన ఆత్మీయ సంభాషణ తమకు ఎంతో ప్రోత్సాహాన్ని, స్ఫూర్తిని అందించిందని, మరింత నమ్మకంతో ముందుకు సాగేందుకు మద్దతు, ఆశ కలిగించిందని దాసరి ఉషక్క పేర్కొన్నారు.పెద్దపల్లి నియోజకవర్గ అభివృద్ధి కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి మరింత చురుకుగా పనిచేస్తామని ఆమె స్పష్టం చేశారు.



# బాధిత కుటుంబాల పరామర్శించిన పాక్స్ చైర్మన్ ఒగ్గు దామోదర్



**బెజ్జంకి, సెప్టెంబర్ 25 (ప్రజావాణి)**సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండల కేంద్రంతో పాటు కళ్లేపల్లి,బేగంపేట గ్రామాల్లో ఇటీవల మృతి చెందిన లింగాల మల్లయ్య, బిగుల్ల ఎల్లయ్య, ఒగ్గు ఎల్లవ్వ, కొరివి రాజు కుమార్, మామిడాల చక్రపాణి, స్టీఫెన్ కుటుంబాలను పాక్స్ చైర్మన్ ఒగ్గు దామోదర్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు లింగాల శ్రీనివాస్ పరామర్శించారు.బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి అధైర్యపడవద్దని, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా కల్పించారు.కళ్లేపల్లి గ్రామంలో ఒగ్గు దామోదర్ యువసేన ఆధ్వర్యంలో బిగుల్ల ఎల్లయ్య కుటుంబానికి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో బేగంపేట సర్పంచ్ ఎల విజయ, ఉపసర్పంచ్ పోతిరెడ్డి మధుసూదన్ రెడ్డి, పర్ష సంతోష్, రావుల నర్సయ్య, డైరెక్టర్ నూనె రాజేందర్, మండల ఉపాధ్యక్షులు గుర్రం రాజిరెడ్డి, బుర్ర అంజయ్య, గ్రామ శాఖ అధ్యక్షులు కొరివి లక్ష్మయ్య, రవిశంకర్, ర్యాకం రాజు, వెంకటేశ్వరరెడ్డి, అమరేందర్ రెడ్డి, బోనగిరి శ్రీనివాస్, గుండని ఎల్లయ్య, బోనగిరి చంద్రం, గుబురే కిషన్, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పరపల్లిలో రూ.25 వేల నూట పదహారు రూపాయలకు గణేష్ లడ్డూ వేలం

**చెన్నారావుపేట సెప్టెంబర్ 25 ప్రజావాణి** మండలంలోని ఉప్పరపల్లి గ్రామంలో 'భీమ్ సేనా యూత్' ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి లడ్డూ వేలంపాటలో బొమ్మెర రాజు-కల్పన దంపతులు రూ. 25116/-లకు లడ్డూను కైవసం చేసుకున్నారు. వరుసగా మూడోసారి లడ్డూ రూ. 20 వేలకు పైగా పలకడంపై భీమ్ సేనా యూత్ వ్యవస్థాపకులు బొమ్మెర సతీష్ హర్షం వ్యక్తం చేస్తూ భక్తులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ అధ్యక్ష, కార్యదర్శులు నవీండ్ల సుమన్, నవీండ్ల పవన్, కోశాధికారి బొమ్మెర మహేందర్, ఉపాధ్యక్షులు అఖిల్, మణికంఠ, సభ్యులు మహేందర్, బాలకృష్ణ, రవికుమార్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.



# పార్కలగండి ఆశ్రమ పాఠశాల అభివృద్ధికి ఐటీడీఏ నిధులు రూ.30 లక్షలతో పనులకు శ్రీకారం

- డైనింగ్ హాల్, కిచెన్ మరమ్మతులు, టాయిలెట్ల నిర్మాణానికి చర్యలు..
- సర్పంచ్ కొమరం సుశీల





**దమ్మపేట, సెప్టెంబర్ 25(మన సమగ్ర ప్రజావాణి):**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం పార్కలగండి గ్రామపంచాయతీ పరిధిలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. సర్పంచ్ కొమరం సుశీల ఆధ్వర్యంలో ఐటీడీఏ ద్వారా మంజూరైన రూ.30 లక్షల నిధులతో పాఠశాలలో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఆశ్రమ పాఠశాలలో వందలాది మంది గిరిజన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్న నేపథ్యంలో వారి సౌకర్యాలను మెరుగుపరిచేందుకు డైనింగ్ హాల్ నిర్మాణం, కిచెన్ షెడ్ మరమ్మతులు, ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం టాయిలెట్ల నిర్మాణం తదితర పనులను చేపడుతున్నట్లు సర్పంచ్ తెలిపారు.

విద్యార్థుల సౌకర్యాలే ప్రధాన లక్ష్యం

ఆశ్రమ పాఠశాలలో మౌలిక వసతుల కొరత కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఐటీడీఏ ద్వారా నిధులు మంజూరు చేయించేందుకు కృషి చేసినట్లు సర్పంచ్ కొమరం సుశీల పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. "గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు మంచి వసతులు కల్పించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా భోజనం చేసేలా డైనింగ్ హాల్, వంటశాల సమస్యకు పరిష్కారం చూపేలా షెడ్ల మరమ్మతులు, ప్రాథమిక పాఠశాల విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా టాయిలెట్ల నిర్మాణం చేపడుతున్నాం. విద్యార్థుల సౌకర్యాల విషయంలో ఎక్కడా రాజీపడేది లేదు" అని తెలిపారు.

గ్రామాభివృద్ధిలో ముందడుగు

తన ఆధ్వర్యంలో గ్రామంలో, గిరిజన ఆశ్రమ పాఠశాలలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని సర్పంచ్ అన్నారు. పార్కలగండి గ్రామం తో పాటు ఆశ్రమ పాఠశాల అభివృద్ధికి ఎల్లప్పుడూ ముందుంటాను. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే మౌలిక వసతులు కల్పించడమే నా ప్రధాన లక్ష్యం. ప్రభుత్వం, ఐటీడీఏ సహకారంతో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తాను" అని కొమరం సుశీల తెలిపారు. ఐటీడీఏ ద్వారా మంజూరైన నిధులతో చేపడుతున్న పనులు పూర్తయితే ఆశ్రమ పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న గిరిజన విద్యార్థులకు మెరుగైన వసతులు అందుబాటులోకి రానున్నాయి. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు సర్పంచ్ సేవలను అభినందిస్తున్నారు.

# రెయిన్బో ఎలక్ట్రానిక్స్ ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్







**జమ్మికుంట సెప్టెంబర్ 25 (ప్రజావాణి )**జమ్మికుంట పట్టణ పరిధిలో శేఖర్ రెయిన్బో ఎలక్ట్రానిక్స్ ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ జమ్మికుంట పట్టణ పరిసర ప్రాంతా వాసులకు అధునాతన టెక్నాలజీతో మన పట్టణం లో రెయిన్బో ఎలక్ట్రానిక్స్ ప్రారంభించడం చాలా సంతోషకరం అని తెలిపారు ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముంతాజ్ అలీ జావేద్ కౌన్సిలర్స్ శ్రీలం శ్రీనివాస్,చందా రాజుచింతల శ్రీనివాస్,దిడ్డి రాము జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణసతీష్ రెడ్డి గడ్డం దీక్షిత్ పోనగంటి మల్లయ్య రాజు పలువురు రాజకీయ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by RAYINIPATLA KUMARASWAMY, Printed at RAMANI WEB OFFSET PRINTERS, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. RNI NO:TGTEL/25/A5443 Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com

# తుఫాను బాధితులకు అండగా ఉంటాం: ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

- జగ్గారంలో క్షేత్రస్థాయిలో పంట పొలాలు, రోడ్ల పరిశీలన
- రైతులు అధైర్యపడొద్దు.. పరిహారం వచ్చేలా కృషి చేస్తా: ఎమ్మెల్యే హామీ




**దమ్మపేట, సెప్టెంబరు 25 (మన సమగ్ర ప్రజావాణి):** తీవ్ర తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలులకు దెబ్బతిన్న ప్రతి ఒక్క బాధితుడికి ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని అశ్వారావుపేట శాసనసభ్యులు జారె ఆదినారాయణ స్పష్టం చేశారు. శుక్రవారం దమ్మపేట మండల పరిధిలోని జగ్గారం గ్రామపంచాయతీలో ఆయన విస్తృతంగా పర్యటించి, వర్షాల వల్ల దెబ్బతిన్న రోడ్లను, నీటమునిగిన పంట పొలాలను స్వయంగా పరిశీలించారు. ఈ పర్యటనలో భాగంగా సుడిగాలి తీవ్రతకు దారుణంగా నేలకొరిగిన ఆయిల్ పామ్, జీడిమామిడి తోటలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఎమ్మెల్యే, నష్టపోయిన రైతుల వద్దకు వెళ్లి వారి సమస్యలను విన్నారు. పంట చేతికొచ్చే సమయంలో ఇటువంటి విపత్తు జరిగి తీరని లోటు వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేయగా, ఎమ్మెల్యే వారికి ధైర్యం చెప్పారు.

అధికారులకు కీలక ఆదేశాలు:

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ... "ప్రకృతి వైపరీత్యం వల్ల రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లడం అత్యంత విచారకరం. రైతులు ఎవరూ ధైర్యం కోల్పోవద్దు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రతి ఎకరా నష్టాన్ని పక్కాగా అంచనా వేయాలి. పూర్తి స్థాయి పంట నష్ట నివేదికలను సత్వరమే ప్రభుత్వానికి సమర్పించి, బాధితులందరికీ తగిన నష్టపరిహారం మరియు ఇన్‌పుట్ సబ్సిడీ అందేలా నా వంతుగా పూర్తి బాధ్యత తీసుకుంటాను" అని హామీ ఇచ్చారు. అలాగే వర్షాల ధాటికి దెబ్బతిన్న పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బి రహదారులకు ప్రజా రవాణాకు ఇబ్బంది కలగకుండా తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వంకా జానకి రామ్, మండల స్థాయి అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక రైతులు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ వేద హైస్కూల్‌లో ఘనంగా గణేష్ నిమజ్జన శోభాయాత్ర

- భక్తిశ్రద్ధలతో పాఠశాల గణనాథుడికి ఘన వీడ్కోలు.
- విద్యార్థుల సందడితో ఆకట్టుకున్న గణేష్ శోభాయాత్ర.
- 1 రోజుల పూజల అనంతరం పాఠశాల గణేష్ నిమజ్జనం ఘనం.




**కోటగిరి/ప్రజావాణి:–** నిజామాబాద్ జిల్లా బాన్సువాడ నియోజకవర్గం కోటగిరి మండల కేంద్రంలోని శ్రీ వేద హైస్కూల్ ఆధ్వర్యంలో గణేష్ నిమజ్జన శోభాయాత్ర శుక్రవారం అంగరంగ వైభవంగా కొనసాగించారు. పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ శోభాయాత్ర ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గత 11 రోజులుగా శ్రీ వేద హైస్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం కలిసి భక్తి వాతావరణంలో గణనాథుడికి నిత్య పూజలు, ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం శుక్రవారం గణనాథుడి నిమజ్జన శోభాయాత్రను ఘనంగా నిర్వహించారు. ఈ శోభాయాత్రలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాల ఆవరణలో సందడి నెలకొంది. విద్యార్థుల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, క్రమశిక్షణ, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందించేందుకు ఈ భక్తి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం పేర్కొన్నారు. ఈ గణేష్ నిమజ్జన శోభాయాత్రలో శ్రీ వేద హైస్కూల్ కరస్పాండెంట్ తేల్ల అక్షర, డైరెక్టర్ తేల్ల రవికుమార్, ఉపాధ్యాయులు రేష్మ, షామిలి, నఫీజ్, నిర్మల, సాయి, పవన్, సాయినాథ్, భీమ్రావు, చంద్రకళ, హారతి, నందిని, మాధవి, రమ, సంధ్య, సంగీత, అనురాధ, సునీత, శిరీష, ప్రవళిక, తదితరులు పాల్గొన్నారు.

# చారిత్రాత్మక గడికోటను పరిశీలించిన తహసిల్దార్ మాలతి



**చిన్నశంకరంపేట, సెప్టెంబర్25, మన ప్రజావాణి:** చారిత్రాత్మక గడి కోటను పరిశీలించిన తహసిల్దార్, మండల పరిధిలోని చందంపేట గ్రామంలో సర్పంచ్ నాయిని ప్రవీణ్ కుమార్ తో కలిసి గడికోట మరమతుల పనులు పరిశీలించారు. అనంతరం తహసిల్దార్ మాలతి మాట్లాడుతూ. పురాతన కట్టడాలను పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో రెవిన్ ఇన్స్పెక్టర్ రాజు, పాలకవర్గం సభ్యులు తదితరులు పాల్గొన్నారు

# ఇసుక అక్రమ రవాణాకు బ్రేక్.. లారీ పట్టివేత

- పెద్దబండ ఎక్స్‌రోడ్ వద్ద పోలీసుల తనిఖీ
- అనుమతులు లేకుండా ఇసుక తరలింపు
- నలుగురిపై కేసు నమోదు




**కొమురంభీమ్/సిర్పూర్ (టీ), సెప్టెంబర్ 25,(ప్రజావాణి ప్రతినిధి)** సిర్పూర్(టి): అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని సిర్పూర్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. పెద్దబండ ఎక్స్‌రోడ్ వద్ద హీరాపూర్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న MH 40 BG 0948 నంబర్ లారీని ఆపి తనిఖీ నిర్వహించగా, ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించి లారీని స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్, యజమాని అబ్దుల్ మజీద్‌ఖాన్‌తో పాటు అసద్, సతీష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ డి. సాగర్ తెలిపారు.

# డిగ్రీ కళాశాల తరలింపు చారిత్రక తప్పిదం

- 46 ఏ ళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన కళాశాల తరలింపు విద్యాభివృద్ధిలో తిరోగమన చర్య
- అవసరమైతే ప్రాణత్యాగానికైనా సిద్ధం..
- ఉధృత పోరాటం చేస్తాం: కొండేల మారుతి

**మన ప్రజావాణి. మంథని ప్రతినిధి.**

ఎన్నో పోరాటాలు, ఆందోళనల ఫలితంగా సాధించుకున్న మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తరలించడం చారిత్రక తప్పిదమని, ఇది విద్యాభివృద్ధిలో తిరోగమన చర్య అని మంథని విద్యార్థి యువత వ్యవస్థాపకులు కొండేల మారుతి అన్నారు. శుక్రవారం మంథని డివిజన్ డబ్ల్యుజే ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కళాశాల ఆవిర్భావం, అభివృద్ధి ప్రస్థానం, తరలింపు వల్ల కలిగే నష్టాలను వివరించారు.




పోరాటాల ఫలితంగా కళాశాల ఆవిర్భావం

1979లో అప్పటి విద్యార్థులు, యువత రెండేళ్లపాటు చేసిన పోరాటాల ఫలితంగా మంథనిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటైందని మారుతి గుర్తుచేశారు. వంద రోజుల నిరాహార దీక్షలు, నిరసన ప్రదర్శనలు, విద్యా తరగతుల బహిష్కరణ వంటి ఉద్యమాల ద్వారా కళాశాల సాధించుకున్నారని తెలిపారు. ప్రజల చిరకాల వాంఛగా ఏర్పాటైన ఈ కళాశాల 1981 నవంబర్ 16న ప్రారంభమైందన్నారు.

వసతుల కోసం ఎన్నో అవస్థలు

కళాశాల తొలినాళ్లలో జూనియర్ కళాశాలలో తరగతులు నిర్వహించడంతో గదుల కొరత, ఇతర సమస్యలు ఎదురయ్యాయని తెలిపారు. పరీక్షల నిర్వహణ సమయంలోనూ ఇబ్బందులు తలెత్తి వివాదాలకు దారితీశాయని పేర్కొన్నారు. 1983లో వచ్చిన భారీ వరదల నేపథ్యంలో కళాశాల వసతుల దుస్థితిని అప్పటి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, వరద బాధితుల పునరావాస కేంద్రం కోసం నిర్మించిన గదులను కళాశాల వినియోగించుకునే అవకాశం కల్పించారని వివరించారు. ఆ భవనాల్లో సుమారు 33 ఏళ్లపాటు కళాశాల కొనసాగిందన్నారు.

సొంత భవనంలో కొనసాగుతున్న కళాశాల

2012లో మంథని నుంచి మల్లెపల్లి శివారులోని సొంత భూమిలో నిర్మించిన భవనాల్లో కళాశాల కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని మారుతి తెలిపారు. నాక్ (ఏూాజ) బృందం కళాశాలకు బి గ్రేడ్ గుర్తింపు ఇచ్చిందని, అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేయాలని సిఫార్సు చేసిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. రెండు విడతలుగా గ్రీన్ క్లియరెన్స్‌కు సంబంధించిన అంశాలను కూడా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు.

పీజీ కళాశాల ఏర్పాటు హామీ ఏమైంది?

మంథని ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రస్తుత మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కళాశాలను సందర్శించిన సందర్భంగా తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే డిగ్రీ కళాశాలతోపాటు పీజీ కళాశాలను కూడా ఏర్పాటు చేస్తామని బహిరంగంగా హామీ ఇచ్చిన విషయాన్ని మారుతి గుర్తుచేశారు. కళాశాలను మరింత అభివృద్ధి చేయాల్సిన సమయంలో తరలింపు నిర్ణయం తీసుకోవడం విద్యాభిమానులను కలవరపెడుతోందన్నారు.

కళాశాల జల్సా రాయుళ్లకు అడ్డాగా మారే ప్రమాదం

డిగ్రీ కళాశాలను తరలిస్తే ప్రస్తుతం ఉన్న క్యాంపస్‌లో అసాంఘిక కార్యకలాపాలు పెరిగి, జల్సారాయుళ్లకు అడ్డాగా మారే ప్రమాదం ఉందని మారుతి ఆందోళన వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల పోరాటాల ఫలితంగా ఏర్పడిన విద్యాసంస్థను తరలించడం సమంజసం కాదని పేర్కొన్నారు.

సంరక్షణ మండలి ఏర్పాటు

కళాశాల తరలింపును అడ్డుకునేందుకు గతంలో చేసిన పోరాటాలకంటే పదింతల తీవ్రతతో ఉద్యమిస్తామని మారుతి హెచ్చరించారు. అవసరమైతే ప్రాణత్యాగానికైనా వెనుకాడకుండా అవిశ్రాంతంగా పోరాడతామని ప్రకటించారు. కళాశాల పరిరక్షణ కోసం విద్యాభిమానులతో కలిసి సత్వరమే డిగ్రీ కళాశాల సంరక్షణ మండలిని ఏర్పాటు చేస్తామని తెలిపారు. రాజకీయాలకు తావులేని విధివిధానాలతో అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని కళాశాల పరిరక్షణకు కృషి చేస్తామని స్పష్టం చేశారు.

# నిరుపేదలకు అండగా నిలుస్తున్న లీలా గ్రూప్ చైర్మెన్ మోహన్ నాయక్

- నిరుపేదల అండగా లీలా
- గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్....
- బాధిత కుటుంబాలకు పరామర్శ, ఆర్థిక సాయం...



**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 25, మన ప్రజావాణి:** ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబాలకు తన వంతు సహాయాన్ని అందిస్తూ లీల గ్రూప్ చైర్మన్, డాక్టర్ మోహన్ నాయక్ అండగా నిలిచారు. చిన్నశంకరంపేట మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల ప్రమాదాలు, అనారోగ్యంతో కుటుంబ సభ్యులను కోల్పోయిన బాధిత కుటుంబాలను శుక్రవారం పరామర్శించి వారికి ఆర్థిక సహాయం అందించారు. చిన్నశంకరంపేట మండల కేంద్రానికి చెందిన దిశ పత్రిక విలేకరి కమ్మరి దేవరాజు సుమారు మూడు నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న లీల గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. దేవరాజు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకోవడంతో పాటు కుటుంబ ఆర్థిక పరిస్థితిపై ఆరా తీశారు. అనంతరం తన వంతుగా రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెబుతూ ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దూదేకుల షబ్బీర్ కుటుంబాన్ని కూడా పరామర్శించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం వారికి ఆర్థిక సహాయాన్ని అందించారు. అనంతరం కామారం తండాలో పర్యటించిన డాక్టర్ మోహన్ నాయక్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మూడవత్ కుమార్, గుండెపోటుతో మృతి చెందిన హలావత్ యాదగిరి, హలావత్ మహేందర్ కుటుంబాలను పరామర్శించారు. ఆయా కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి పరిస్థితులను తెలుసుకున్నారు. చిన్నారులను, కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యం కల్పించారు. బాధిత కుటుంబాలకు తన వంతుగా ఆర్థిక సహాయం అందించారు. మొత్తం ఐదు బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం అందించి, కష్టకాలంలో వారికి అండగా నిలిచారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ఆర్థికంగా తోడ్పాటు అందించడమే కాకుండా, వారి వెంట తాము ఉన్నామనే భరోసాను కల్పించారు. కామారం తండా సర్పంచ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ హలావత్ మోహన్ నాయక్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న కుటుంబాలను పరామర్శించి, వారికి తన వంతు ఆర్థిక సహాయం అందించిన లీల గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్‌ను ప్రత్యేకంగా అభినందించారు. పేద కుటుంబాల కష్టాలను గుర్తించి వారికి అండగా నిలవడం అభినందనీయమన్నారు. బాధిత కుటుంబాలకు ఇలాంటి సహకారం ఎంతో ధైర్యాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విలేకరులు నవీన్ కుమార్, ప్రభాకర్, అరుణ్ యాదవ్, సందీప్, లక్ష్మణ్, నరేష్ గౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై పోరాటమే 'బీఆర్ఎస్' ధ్యేయం

- పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగ జ్యోతి
- కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శల జడివాన




**ములుగు జిల్లా, సెప్టెంబరు 25 ప్రజావాణి:** పార్టీ కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తను బీఆర్ఎస్ నాయకత్వం కంటికి రెప్పలా కాపాడుకుంటుందని ఆ పార్టీ ములుగు నియోజకవర్గ ఇంచార్జ్ బడే నాగజ్యోతి అన్నారు. శుక్రవారం ములుగు జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల తాజా మాజీ అధ్యక్షుడు సనికొమ్ము రమేష్ రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నాగజ్యోతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాజకీయ పరిస్థితులు ఎలా ఉన్నా కార్యకర్తలు అధైర్యపడకుండా గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ములుగు నియోజకవర్గంలో జరిగిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించిందని, కనీసం విద్యుత్ సరఫరా కూడా సరిగ్గా చేయలేకపోతోందని ఆమె మండిపడ్డారు. స్థానిక శాసనసభ్యురాలు, మంత్రిగా సీతక్క గెలిచి మూడేళ్లు పూర్తవుతున్నా నియోజకవర్గంలో సాధించిన అభివృద్ధి ఏంటో ఇక్కడి ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా 22ఏ పేరుతో నిరుపేదల, రైతుల భూములను లాక్కోవడానికి ప్రభుత్వం కుట్రలు చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో పునర్వ్యవస్థీకరించే పార్టీ కమిటీలలో ఉత్సాహవంతులైన యువతకు పెద్దపీట వేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు కోగిల లక్ష్మి, బైకని సాగర్, మాజీ ఎంపీపీ మురళి, సర్పంచులు వీరబోయిన రాజేందర్, తప్పెట్ల రాజేందర్, దాసరి సరిత రమేష్, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోరం సంతోష్, నాయకులు కుడుముల లక్ష్మీనారాయణ, వేములపల్లి భిక్షపతి, పోరికా విజయరాంనాయక్, కాకి పురుషోత్తం, అకుతోట చంద్రమౌళి, ఉయ్యాల భద్రయ్య, ఎండీ యూనిస్, అనుముల సురేష్ తదితరులు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులకు నోటీసులు.. ఆందోళనలో వ్యాపారులు

- దుకాణాలు తొలగిస్తే మా కుటుంబాలు రోడ్డున పడతాయి చిరు వ్యాపారులు




**సింగూర్, సెప్టెంబర్ 25 మన సమగ్ర ప్రజావాణి సంగారెడ్డి జిల్లా ప్రతినిధి**

పుల్కల్ మండలంలోని సింగూర్ గ్రామంలో చిరు వ్యాపారులు నిర్వహిస్తున్న దుకాణాలను తొలగించాలని ఇరిగేషన్ శాఖ అధికారులు నోటీసులు జారీ చేయడంతో వ్యాపారుల్లో ఆందోళన నెలకొంది. తహసీల్దార్, గ్రామపంచాయతీ కార్యదర్శి ద్వారా తమకు నోటీసులు అందజేశారని వ్యాపారులు తెలిపారు. నిర్ణీత గడువులోగా దుకాణాలను తొలగించకపోతే జేసీబీలతో తొలగిస్తామని నోటీసుల్లో పేర్కొన్నట్లు వారు చెప్పారు. సింగూర్ ప్రాజెక్టును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయనున్నట్లు అధికారులు చెబుతున్న నేపథ్యంలో, పర్యాటకుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని చిరు వ్యాపారులకు ప్రత్యామ్నాయ స్థలం కల్పించాలని వ్యాపారులు కోరుతున్నారు. సింగూర్ ప్రాజెక్టును సందర్శించేందుకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు వస్తుంటారని, వారికి తాగునీరు, అల్పాహారం తదితర సౌకర్యాలు అందించడంలో చిరు వ్యాపారుల దుకాణాలు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. దుకాణాలు తొలగిస్తే జీవనోపాధి కోల్పోతాం తమలో కొందరు వికలాంగులు కూడా చిన్న దుకాణాలు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారని వ్యాపారులు తెలిపారు. తమ కుటుంబాల జీవనోపాధి పూర్తిగా ఈ దుకాణాలపైనే ఆధారపడి ఉందని, దుకాణాలు తొలగిస్తే తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదురవుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రత్యామ్నాయ స్థలం చూపించి తమ జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా చూడాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ జోక్యం చేసుకుని ఇరిగేషన్ శాఖ అధికారులతో మాట్లాడి దుకాణాల తొలగింపును నిలిపివేయాలని చిరు వ్యాపారులు కోరారు. పేదల జీవనోపాధికి ఇబ్బంది కలగకుండా మానవతా దృక్పథంతో సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గ్రామపంచాయతీకి వినతిపత్రం దుకాణాల తొలగింపును నిలిపివేయాలని కోరుతూ సింగూర్ చిరు వ్యాపారులు గ్రామపంచాయతీ పాలనాధికారి, సర్పంచ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఇరిగేషన్ శాఖ అధికారులతో పాటు సంబంధిత ప్రభుత్వ అధికారులతో మాట్లాడి తమ దుకాణాలను తొలగించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సింగూర్ రోడ్డు విస్తరణ చేపట్టాల్సి వస్తే, అవసరమైన మేరకు తమ దుకాణాలను స్వచ్ఛందంగా వెనక్కి జరుపుకునేందుకు సిద్ధంగా ఉన్నామని వ్యాపారులు తెలిపారు. సమస్య పరిష్కారం కాకపోతే పుల్కల్ తహసీల్దార్‌ను, సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తామని చెప్పారు. అవసరమైతే కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని వారు తెలిపారు.

# శిథిలావస్థకు చేరుకున్న రాయపోల్ నల్లచెరువు మత్తడి

- పొంచి ఉన్న ప్రమాదంతో ఆయకట్టుదారుల ఆందోళన
- వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్





**రాయపోల్: సెప్టెంబర్ 25.(ప్రజావాణి)** సిద్దిపేట జిల్లా రాయపోల్ మండల కేంద్రంలోని నల్లచెరువు మత్తడి శిథిలావస్థకు చేరుకోవడంతో ఆయకట్టుదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. చెరువుకు ప్రధాన ఆధారంగా ఉన్న మత్తడి ప్రస్తుతం బలహీనంగా మారిందని, ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని స్థానికులు. రైతులు భయాందోళనకు గురవుతున్నారు. వర్షాకాలంలో చెరువులోకి భారీగా నీరు చేరితే మత్తడిపై మరింత ఒత్తిడి పడే అవకాశం ఉందని ఆయకట్టుదారులు చెబుతున్నారు.

ఏళ్లుగా సరైన నిర్వహణ, మరమ్మతులు లేకపోవడంతో మత్తడి పలు చోట్ల దెబ్బతిన్న పరిస్థితిలో ఉందని వారు పేర్కొంటున్నారు. చిన్నపాటి లోపాలను సకాలంలోనే గుర్తించి మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నప్పటికీ, సమస్యను పట్టించుకోకపోవడంతో పరిస్థితి క్రమంగా విషమించిందని ఆయకట్టుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నల్లచెరువు మత్తడి దెబ్బతినడం వల్ల చెరువు నీటిపై ఆధారపడే రైతులకు సాగునీటి విషయంలో ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. మత్తడికి ఏదైనా నష్టం జరిగితే చెరువు నీటి నిల్వ, నీటి విడుదలపై ప్రభావం పడటంతో పాటు ఆయకట్టులోని పంటలకు కూడా ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉందని చెబుతున్నారు.

అధికారులు స్పందించాలి మత్తడి పరిస్థితిని సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, సాంకేతిక నిపుణులతో తనిఖీ చేయించాలని ఆయకట్టుదారులు కోరుతున్నారు. ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా ముందస్తు చర్యలు చేపట్టి మత్తడికి అవసరమైన మరమ్మతులు, పటిష్టీకరణ పనులు వెంటనే చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని నల్లచెరువు మత్తడికి శాశ్వత పరిష్కారం చూపాలని, అవసరమైన నిధులు కేటాయించి పనులు చేపట్టాలని ఆయకట్టుదారులు కోరుతున్నారు.

# మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు



**సెప్టెంబర్ 25.ప్రభంజనం న్యూస్/ నర్సంపేట** నర్సంపేటలోని స్థానిక మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యార్థులకు "మానసిక ఆరోగ్యం – అవగాహన" అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు .ఈ కార్యక్రమానికి తెలంగాణ సైకాలజిస్ట్ అసోసియేషన్ (TPA) జనరల్ సెక్రటరీ, డాక్టర్ శ్రీలత ముఖ్య వక్తగా హాజరై విద్యార్థులకు సమగ్ర అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ శ్రీలత మాట్లాడుతూ, విద్యార్థి దశలో శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం కూడా ఎంతో కీలకమైనదని తెలిపారు. నేటి వేగవంతమైన సమాజంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న మానసిక సమస్యలు,పరీక్షల భయం మరియు ఒత్తిడిని అధిగమించడానికి పలు సూచనలు చేశారు.సదస్సులోని ముఖ్య విషయాలు.చదువులో ఒత్తిడిని తగ్గించుకోవడానికి ప్రతిరోజూ క్రమశిక్షణతో కూడిన ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.విద్యార్థులు ప్రతికూల ఆలోచనలకు దూరంగా ఉంటూ, ఆత్మవిశ్వాసాన్ని మరియు సానుకూల దృక్పథాన్ని పెంపొందించుకోవాలని కోరారు .మానసికంగా ఏవైనా సమస్యలు లేదా ఆందోళన అనిపిస్తే భయపడకుండా ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు లేదా కౌన్సెలర్ల దృష్టికి తీసుకెళ్లాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# పదో తరగతి జనగామ నియోజకవర్గ టాపర్ రమ్యకు రూ.1 లక్ష నగదు పురస్కారం

- శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో రూ.1 లక్ష నగదు బహుమతి.
- నగదు పురస్కారాన్ని అందించి సన్మానించిన గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా



సన్మాన కార్యక్రమంలో గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా విద్యార్థిని రమ్యని అభినందించారు.

**మద్దూరు సెప్టెంబర్ 25, ప్రజా వాణి,** ప్రతిభకు పేదరికం అడ్డురాదని నిరూపించింది ధూళిమిట్ట పాఠశాలలో చదివిన విద్యార్థిని రమ్య. మండలంలోని తోర్నాల గ్రామానికి చెందిన తుశాలపురం కనకయ్య పరమేశ్వరి ముగ్గురు ఆడపిల్లల్లో పెద్ద కూతురు రమ్య పదో తరగతి పరీక్షల్లో 571 మార్కులు సాధించి జనగామ నియోజకవర్గం స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించిన సందర్భంగా విద్యార్థిని రమ్యను శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా విద్యార్థిని రమ్య కి రూ.1,00,000 ( లక్ష రూపాయల) నగదు బహుమతి అందజేశారు. విద్యారంగంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ బహుమతిని అందించడం విశేషంగా నిలిచింది. రమ్య పదో తరగతి పరీక్షల్లో 571 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోవడం పట్ల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. గ్రామీణ ప్రాంతానికి చెందిన విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలో చదువుతూ నియోజకవర్గ స్థాయిలో అగ్రస్థానాన్ని సాధించడం ధూళిమిట్ట పాఠశాలకే కాకుండా సిద్దిపేట జిల్లాకు గర్వకారణంగా నిలిచింది.

రమ్య ప్రతిభకు గవర్నర్ అభినందనలు

సన్మాన కార్యక్రమంలో గవర్నర్ శ్రీ శివ ప్రతాప్ శుక్లా విద్యార్థిని రమ్యని అభినందించారు. ఆమె సాధించిన ఫలితం ఇతర విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని క్రమశిక్షణతో, పట్టుదలతో చదివితే ఉన్నత విజయాలను సాధించవచ్చని సూచించారు.

రమ్య సాధించిన ఈ విజయానికి ఆమె తల్లిదండ్రుల ప్రోత్సాహం, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఎంతో కీలకమని పేర్కొన్నారు. రమ్య తల్లిదండ్రులు, ఉపాధ్యాయులను గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అభినందించారు.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అభినందనలు

ఉపాధ్యాయుల పాత్ర విద్యార్థి విజయంలో పాఠశాల ఎంతో కీలకమని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా గుర్తుచేశారు. రమ్య సాధించిన 571 మార్కులు ఆమె వ్యక్తిగత ప్రతిభతో పాటు, తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల నిరంతర బోధన, పాఠశాల యాజమాన్య సహకారానికి ప్రతిబింబంగా నిలిచాయని పలువురు పేర్కొన్నారు.ధూళిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి జనగామ నియోజకవర్గ స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించడం పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయుల్లో నూతన ఉత్సాహాన్ని నింపింది. ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్య, సమర్థవంతమైన బోధన, విద్యార్థుల కృషితో అద్భుతమైన ఫలితాలు సాధించవచ్చని ఈ విజయం చాటిచెప్పింది.

ప్రతిభకు ప్రోత్సాహం అవసరం

విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వారిని ప్రోత్సహించేందుకు సంస్థలు ముందుకు రావడం అభినందనీయమని గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా పేర్కొన్నారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు బహుమతులు, సన్మానాలు అందించడం ద్వారా వారి ఆత్మవిశ్వాసం పెరగడంతో పాటు భవిష్యత్‌లో మరింత ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రేరణ లభిస్తుందని స్పష్టం చేశారు. రమ్య కి అందించిన రూ. లక్ష నగదు బహుమతి ఆమె భవిష్యత్ విద్యాభ్యాసానికి ఉపయోగపడటంతో పాటు, ఇతర విద్యార్థులకు కూడా ఒక ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు.

విద్యార్థులకు స్ఫూర్తిదాయక విజయం

పదో తరగతి వంటి కీలక దశలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి నియోజకవర్గ స్థాయిలో ప్రథమ ర్యాంక్ సాధించిన రమ్య భవిష్యత్‌లో ఉన్నత విద్యను అభ్యసించి మరిన్ని విజయాలు సాధించాలని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాభిమానులు ఆకాంక్షించారు.ఈ సందర్భంగా రమ్య తల్లిదండ్రులను, జడ్పీహెచ్ఎస్ ధూళిమిట్ట ప్రధానోపాధ్యాయుడిని, ఉపాధ్యాయ బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థిని సాధించిన ఘనత పట్ల ధూళిమిట్ట, తోర్నాల గ్రామస్తులు, పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆనందం వ్యక్తం చేశారు.

ప్రతిభకు ప్రోత్సాహం తోడైతే విజయానికి హద్దులు ఉండవనే సందేశాన్ని రమ్య విజయం మరోసారి చాటి చెప్పింది.

# సిటిజన్ న్యూస్ ఛానల్ సీఈవో రవి కుమార్ కి ఘన సన్మానం

- కార్యాలయాన్ని సందర్శించి అభినందనలు తెలిపిన జర్నలిస్టు మిత్రులు





**మన సమగ్ర ప్రజావాణి వనపర్తి జిల్లా :** వనపర్తి జిల్లా కేంద్రం పట్టణ పరిధి గాంధీ చౌక్ లో సిటిజన్ న్యూస్ ఛానల్ నూతన కార్యాలయాన్ని ప్రారంభించిన సందర్భంగా జర్నలిస్ట్ మిత్రులు కనమోని ఆంజనేయులు దుప్పల్లి సురేష్ కుమ్మరి రాము సందర్శించారు సీనియర్ జర్నలిస్ట్ సిటిజన్ న్యూస్ ఛానల్ సీఈఓ రవికుమార్ ను అభినందిస్తూ శాలువాతో సత్కరించి పూల బొకేతో శుభాకాంక్షలు తెలియజేశారు అనంతరం మాట్లాడుతూ ప్రజల సమస్యలపై ప్రతినిత్యం అధికారులను నాయకులను ప్రభవితం చేస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నిజాని నిర్భయంగా ప్రపంచానికి చూపించి ప్రజల మన్ననలు పొంది సిటిజన్ న్యూస్ ఛానల్ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు

# విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ

- ఆర్ బి ఎస్ కే వైద్య బృందం హుజురాబాద్ డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ప్రభుదాస్





**జమ్మికుంట సెప్టెంబర్ 25 (ప్రజావాణి)** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ మైనారిటీ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు గత రెండు మాసాల క్రితం రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్ బి ఎస్ కె) వైద్య బృందం కంటి పరీక్షలు నిర్వహించిదృష్టి లోపాలున్న 38 మంది విద్యార్థులను గుర్తించగా వారికి కళ్లద్దాలు ఈరోజు ఆర్ బి ఎస్ కే వైద్య బృందం హుజురాబాద్ డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ ప్రభుదాస్ చేతుల మీదుగా విద్యార్థులకు కళ్లద్దాలు పంపిణీ చేయడం జరిగిందిఈ సందర్భంగా డిప్యూటీ డి ఎం హెచ్ ఓ మాట్లాడుతూ కంటి సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు క్లుప్తంగా వివరించడం జరిగిందిమంచి పోషకాలతో నిండిన సమతుల్య ఆహారం తీసుకోవాలనితగినంత నిద్ర పోవాలనివ్యక్తిగత పరిశుభ్రత తో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని మొబైల్ ఫోన్ కు దూరంగా ఉండాలని ఎవరికైనా కంటిలో డబుల్ దృష్టి మబ్బుగా ఉన్న దృశ్యంఎరుపు కళ్ళుకాంతి వెలుగులు కళ్ళు లేదా కనురెప్పల వాపు వంటి లక్షణాలు ఉంటే అశ్రద్ధ చేయకుండా తప్పనిసరిగా కంటి పరీక్షలు చేయించుకోవాలని కంటిని సంరక్షించుకోవాలని విద్యార్థులకు సూచించారుఈ కార్యక్రమంలో ఆర్ బి ఎస్ కె వైద్యాధికారి డాక్టర్ మొగిలికమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సదానందండిస్ట్రిక్ట్ హెల్త్ ఎడ్యుకేటర్ పంజాల ప్రతాప్ గౌడ్,గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అశ్విని ఫార్మసిస్ట్ పుష్పాంజలి తదితరులు పాల్గొన్నారు

# జర్నలిస్టులపై పరిగి ఎమ్మెల్యే దురుసు ప్రవర్తన: భగ్గుమన్న విలేకరుల సంఘాలు

- డూప్లికేట్ యూనియన్.. కేసీఆర్ సంఘం' అంటూ రామ్మోహన్ రెడ్డి ఆగ్రహం
- మహాసభల ఆహ్వానం ఇవ్వడానికి వెళ్లిన బహుజన జర్నలిస్టులకు అవమానం
- బేషరతుగా క్షమాపణ చెప్పాలని TUWJ (H-143) డిమాండ్; జిల్లావ్యాప్త ఆందోళనలకు పిలుపు



ఆహ్వాన పత్రికను అందజేసేందుకు బహుజన జర్నలిస్టుల బృందం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి వద్దకు వెళ్లింది. అయితే ఆహ్వానాన్ని స్వీకరించేందుకు నిరాకరించిన ఎమ్మెల్యే.. వారిపై

**పరిగి, సెప్టెంబర్ 25:ప్రజా వాణి:**మహాసభల ఆహ్వాన పత్రికను అందజేసేందుకు వెళ్లిన బహుజన జర్నలిస్టులను ఉద్దేశించి పరిగి కాంగ్రెస్ ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి తీవ్ర పదజాలంతో విరుచుకుపడటం వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతోంది. ప్రజా సమస్యలపై నిత్యం గళమెత్తే జర్నలిస్టుల పట్ల ప్రజాప్రతినిధి వ్యవహరించిన తీరుపై జర్నలిస్టు సమాజం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

ఆహ్వానం ఇవ్వబోతే ఆగ్రహం:

ఈ నెల 27న (ఆదివారం) వికారాబాద్ జిల్లా కేంద్రంలో 'తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్' (టీయూడబ్ల్యూజే హెచ్-143) జిల్లా మహాసభలు జరగనున్నాయి. ఈ సభలకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ నిమిత్తం మర్యాదపూర్వకంగా ఆహ్వాన పత్రికను అందజేసేందుకు బహుజన జర్నలిస్టుల బృందం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి వద్దకు వెళ్లింది. అయితే ఆహ్వానాన్ని స్వీకరించేందుకు నిరాకరించిన ఎమ్మెల్యే.. వారిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇది డూప్లికేట్ యూనియన్.. కేసీఆర్ యూనియన్" అంటూ విలేకరులను తూలనాడి, తీవ్ర అవమానానికి గురిచేశారని యూనియన్ ప్రతినిధులు తెలిపారు.

జర్నలిస్టులపై రాజకీయ ముద్ర వేయడం దారుణం:

ప్రజాస్వామ్యానికి రక్షణ కవచంగా నిలుస్తూ, అణగారిన వర్గాల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే జర్నలిస్టులపై రాజకీయ పార్టీల రంగు పులమడం ప్రజాప్రతినిధి అహంకారానికి పరాకాష్ట అని యూనియన్ నేతలు మండిపడ్డారు. జర్నలిస్టుల హక్కుల సాధన, సంక్షేమం కోసం పనిచేసే యూనియన్లను రాజకీయ ప్రయోజనాలతో ముడిపెట్టడం గర్హనీయమని పేర్కొన్నారు.

క్షమాపణ చెప్పకుంటే ఉద్యమం తప్పదు: TUWJ (H-143)

జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా వ్యవహరించిన ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి తక్షణమే విలేకరులకు, జర్నలిస్ట్ లోకానికి బహిరంగంగా బేషరతు క్షమాపణ చెప్పాలని TUWJ (H-143)నేతలు డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే తన వైఖరిపై స్పందించి క్షమాపణ కోరని పక్షంలో జిల్లావ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు, ధర్నాలు, కలెక్టరేట్ ముట్టడి వంటి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ ఘటనతో పరిగి నియోజకవర్గంతో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

# మండల వికాసానికి దిశానిర్దేశం..సర్వసభ్య సమావేశంలో రూపుదిద్దుకున్న వ్యూహాత్మక ప్రణాళిక





**చెన్నారావుపేట సెప్టెంబర్ 25 ప్రజావాణి** చెన్నారావుపేట మండల పురోగతికి సరికొత్త బాటలు వేస్తూ స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశం ఫలప్రదమైన నిర్దిష్ట నిర్ణయాలతో సాగింది. మండల ప్రత్యేక అధికారి, ఎంపీడీఓ, అమీనాబాద్ – చెన్నారావుపేట పిఎసిఎస్ చైర్మన్ల పర్యవేక్షణలో జరిగిన ఈ భేటీలో 17 మంది వివిధ శాఖల అధికారులు,15 మంది సర్పంచ్‌లు చురుగ్గా పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు.?గత 45 రోజుల్లో పంచాయతీల వారీగా సాధించిన పారిశుధ్య నిర్వహణ, ఉపాధి హామీ పథకం పనులు, మౌలిక వసతుల పురోగతిపై అధికారులు సభకు సమగ్ర నివేదిక అందించారు. రాబోయే రోజుల్లో చేపట్టబోయే సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు, ప్రభుత్వ బడుల అభివృద్ధి,ప్రభుత్వ సంక్షేమ ఫలాల గుర్తింపు ప్రక్రియలపై సర్పంచ్‌లకు స్పష్టమైన అవగాహన కల్పించారు.?తాగునీటి సరఫరా, గ్రామీణ రహదారుల పునరుద్ధరణపై సర్పంచ్‌లు సభ దృష్టికి తెచ్చిన క్షేత్రస్థాయి సమస్యలకు ఎంపీడీఓ వెంకట శివానంద్ స్పందిస్తూ, తక్షణ పరిష్కార కార్యాచరణను ప్రకటించారు.అధికారులు–ప్రజాప్రతినిధులు పరస్పరం సమన్వయంతో ముందడుగు వేస్తేనే గ్రామ స్వరాజ్య లక్ష్యం సిద్ధిస్తుందని, చెన్నారావుపేటను జిల్లాలోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు అందరూ భాగస్వాములు కావాలని సభ పిలుపునిచ్చింది.

# రాజస్థాన్ స్వీట్ హౌస్ ప్రారంభించిన సంగెం సర్పంచ్



**సెప్టెంబర్ 25. ప్రభంజనం న్యూస్/సంగెం :**వరంగల్ జిల్లా పరకాల నియోజకవర్గం సంగెం మండలంలోనీ సంగెం మండల కేంద్రంలోన,రాజస్థాన్ స్వీట్ హౌస్ సంగెం మండల పరిసర ప్రాంతాలైన వంటి రూరల్ రుచులతో కూడిన స్వీట్ షాపులు ఎంతో ప్రసిద్ధి చెందాయి.మన దగ్గరి రాజస్థాన్ స్వీట్ స్టాల్స్‌లో లభించే ప్రత్యేకమైన తినుబండారాలు వాటి విశేషాలు ఇక్కడ చూద్దాం మైదా పిండి నెయ్యి, చక్కెర పాకంతో తయారు చేస్తారు.ప్రత్యేకతముఖ్యంగా శ్రావణ మాసం, సంక్రాంతి, రక్షాబంధన్ పండగల సమయంలో దీనికి విపరీతమైన డిమాండ్ ఉంటుంది. దీనిపై బాదం, పిస్తా ముక్కలు చల్లటి రబ్రీ మలైవేసి వడ్డిస్తే ఆరుచే వేరు.కాలాకాండ్ మల్పువా ప్యూర్ మిల్క్ పాల కోవాతో చేసేఇక్కడి స్వీట్ హౌస్‌లలో ఎంతో తాజాగా నోట్లో వేస్తే కరిగిపోయేలాదొరుకుతుంది,అలాగే పిండిని నెయ్యిలో కాల్చి చక్కెర పాకంలో ముంచే మల్పువా కూడా చాలా ఫేమస్.రాజస్థానీ కచోరీ,సమోసా కేవలం తీపి పదార్థాలే కాకుండా,ఉల్లిపాయ కచోరీ, దాల్ కచోరీ వేడివేడి సమోసాలు కూడా ఇక్కడ లభిస్తాయి. పుదీనా చట్నీ,తీపి చట్నీలతో కలిపి ఇచ్చే ఈ సమోసాలరుచి అద్భుతంగా ఉంటుంది తెలంగాణలోని రాజస్థాన్ స్వీట్ హౌస్‌ల ప్రత్యేకతలు:స్వచ్ఛమైన నెయ్యి వాడకం: చాలా వరకు రాజస్థానీ స్వీట్లను సాంప్రదాయ పద్ధతిలో ఆవు నెయ్యి లేదా విధానంలో తయారు చేస్తారు. సరసమైన ధరలు,గ్రామీపట్టణ ప్రాంతాల ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా తక్కువ ధరలకే నాణ్యమైన స్వీట్లు మిక్చర్ కారా అందిస్తారు.ఈ కార్యక్రమంలో వృక్షాల సంగెం గ్రామ పంచాయతీ వార్డ్ నెంబర్ సాగర్,సంగెం మాజీ సర్పంచ్ గుండేటి బాబు,సంగెం సొసైటీ డైరెక్టర్ కోడూరు సదయ్య, బిట్ల లక్ష్మణ్,రావుల ప్రభాకర్, పీర్ల లక్ష్మీనరసయ్య, ఎండిఖాజా పాషా, రొట్టె కొమ్మలు, కోడూరు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ110 వ జయంతి.



**మన ప్రజావాణి. మంథని ప్రతినిధి.** ఈరోజు మంథనిలో హిందూ రాష్ట్ర భావనకు బలమైన పునాది వేసిన పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ గారి 110వ జయంతిని మంథని పట్టణ భారతీయ జనతా పార్టీ కార్యకర్తల బృందం ఘనంగా నిర్వహించడం జరిగింది సాధారణ కుటుంబంలో జన్మించి దేశం కోసం తన జీవితాన్ని అంకితం చేసి ఏకాత్మత మానవతావాదం ద్వారా భారతీయ ఆలోచన విధానానికి ప్రత్యేకమైన దిశను చూపించిన దీన్ దయాల్ ఉపాధ్యాయ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ఈనాటి మంథని యువత ముందుకు సాగాలని భారతీయ జనతా పార్టీ పిలుపు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో మంథని పట్టణ అధ్యక్షుడు సబ్బాని సంతోష్ జిల్లా కౌన్సిల్ సభ్యులు బోగోజు శ్రీనివాస్ అసెంబ్లీ సోషల్ మీడియా ఇన్చార్జ్ వొజ్జలమురళీకృష్ణ సీనియర్ నాయకులు నార మల్ల కృష్ణ పట్టణ ప్రధాన కార్యదర్శి సామల అశోక్ నాయకులు చంద్రయ్య , కోరబోయిన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# లైసెన్సులు రెన్యూవల్ తో సంబంధం లేకుండా పెన్షన్లు మంజూరు చేయాలి



**చిలుకూరు సెప్టెంబర్ 25(ప్రజావాణి):** ప్రభుత్వం వచ్చే నెలలో నూతంగా పంపిణీ చేసే గీత కార్మికుల పెన్షన్లును లైసెన్సులు రెన్యూవల్తో సంబందం లేకుండా పెన్షన్లు మంజూరు చేయాలని గీత పనివారాల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొండా కోటయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన చిలుకూరులో విలేకరులతో మాట్లాడారు. టీసీఎస్, టీఎఫ్త లైసెన్సులు రెన్యూవల్ తో సంబందం లేకుండా, అలాగే ఏలాంటి లైసెన్సు లేకున్నా 51ఏళ్లు నిండిన వారందరికి గీత కార్మిక పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం చేసిన అనాలోచిత నిర్ణయాల వల్లన గీత కార్మికులు –లైసెన్సులను రెన్యూవల్ చేయించలేదని అన్నారు. దీనిని– సాకుగా పెట్టి పెన్షెన్లు మంజూరు చేయకపోతే గీత పనివారాల సంఘం నుండి ఐక్యంగా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంపై కలెక్టర్కు విన్నవించేందుకు గీత కార్మికులు వచ్చే సోమవారం కలెక్టర్ కార్యాలయంకు భారీగా తరలిరావాలని పిలుపునిచ్చారు.

# ఎస్టీపీపీ జీఎం(సివిల్ ) డి.వెంకటేశ్వర్లుకు ఘన వీడ్కోలు



**జైపూర్ (సింగరేణి), సెప్టెంబర్ 25, ప్రజావాణి:** సింగరేణి థర్మల్ విద్యుత్ కేంద్రం (ఎస్టీపీపీ) సివిల్ విభాగం జనరల్ మేనేజర్ డి. వెంకటేశ్వర్లుకు శుక్రవారం సంస్థ ఉద్యోగులు, అధికారులు ఘనంగా వీడ్కోలు సత్కారం నిర్వహించారు. ఈ నెలాఖరున (సెప్టెంబరు 30న) ఆయన ఉద్యోగ విరమణ పొందనున్న నేపథ్యంలో ఎస్టీపీపీ ప్రాంగణంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్టీపీపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఈడీ) చెన్నకేశవుల చిరంజీవి మాట్లాడుతూ.. 1989 మార్చి 9న సింగరేణిలో చేరిన వెంకటేశ్వర్లు సివిల్ విభాగంలో అందించిన సేవలు అభినందనీయమన్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ సంస్థ పురోగతికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. అనంతరం వెంకటేశ్వర్లును ఈడీ చిరంజీవితో పాటు జీఎంలు కె.సూర్యనారాయణ రాజు (ఈఅండ్ఎం), ఈ.భీభత్స (ఫైనాన్స్)లు శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. శేష జీవితం ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో గడవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీఎం (ఈఅండ్ఎం–పీసీఎస్) వి.వి.సుధాకర్ రెడ్డి, చీఫ్ ఆఫ్ ఓఅండ్ఎమ్ కె.శివప్రసాద్, సివిల్ డీజీఎం బి.రాము, పర్సనల్ విభాగాధిపతి ఎస్.వి.రాజేశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

# అక్కల్‌చేడ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్





**చెన్నారావుపేట సెప్టెంబర్ 25 ప్రజావాణి** చెన్నారావు పేట మండలం అక్కల్‌చేడ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలను సర్పంచ్ భూక్య బుజ్జి సురేష్ ఆకస్మికంగా సందర్శించి మౌలిక వసతులు, విద్యార్థుల విద్యార్హత ప్రమాణాలను పరిశీలించారు. తరగతి గదుల్లోకి వెళ్లిన ఆయన విద్యార్థులతో పుస్తకాలు చదివించి, పాఠ్యాంశాలపై వారికున్న అవగాహనను పరీక్షించారు. అనంతరం విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించి తగు సూచనలు చేశారు.?బడిలో విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచుతూ, బోధనపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్న ప్రధానోపాధ్యాయులు రాజేందర్, ఉపాధ్యాయులు సురేందర్, సత్య, పూర్ణిమల పనితీరును సర్పంచ్ అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాలకు అదనపు గదుల భవన నిర్మాణం అవసరమని ఉపాధ్యాయులు కోరగా, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే భవన నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ అధ్యక్షుడు పులిశేరు రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

# గణనాథుడి నిమజ్జన పూజలో ఎమ్మెల్సీ దండే

- హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కార్యక్రమం
- ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ దండే విఠల్
- హాజరైన ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్, ప్రజాప్రతినిధులు





**కొమురంభీమ్/కాగజ్ నగర్, సెప్టెంబర్ 25, (ప్రజావాణి ప్రతినిధి)** కాగజ్‌నగర్: పట్టణంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం గణనాథుడి నిమజ్జన ప్రారంభ పూజా కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్సీ దండే విఠల్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణనాథుడి ఆశీస్సులతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు, సబ్‌కలెక్టర్ హర్ష్ చౌదరి, ప్రజాప్రతినిధులు, అధికారులు, హిందూ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

# గణేష్ మండపాల్లో భక్తుల సందడి

- మండపాల్లో భక్తులతోప్రత్యేక పూజలు.
- వినాయక నిమజ్జనానికి పకడ్బందీ ఏర్పాట్లు
- మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు
- కోమటూర్ చెరువు వద్ద ఏర్పాట్ల పర్యవేక్షణ
- భక్తుల భద్రతే తొలి ప్రాధాన్యం
- నిమజ్జన ఏర్పాట్లపై అధికారులతో ఎమ్మెల్యే రోహిత్ రావు సమీక్ష
- గణేష్ ఉత్సవాల్లో రోహిత్ రావు ప్రత్యేక పర్యటన
- మండపాల్లో పూజలు.. కోమటూర్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన
- గణేష్ మండపాల్లో రోహిత్ రావు సందడి!
- మండపాల్లో ప్రత్యేక పూజలు..
- కోమటూర్ చెరువు వద్ద నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన.. భద్రతకు పెద్దపీట



**మన ప్రజావాణి మెదక్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 25** మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు శుక్రవారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన గణేష్ మండపాలను సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. నిర్వాహకులు, భక్తులతో మాట్లాడి ఉత్సవాల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్న నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. ప్రజలకు శాంతి, సుఖసంతోషాలు, సిరిసంపదలు కలగాలని గణనాథుడిని ప్రార్థించారు.
అనంతరం కోమటూర్ చెరువు వద్దకు చేరుకున్న ఎమ్మెల్యే రోహిత్ రావు వినాయక నిమజ్జనానికి చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు తీసుకుంటున్న చర్యలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిమజ్జన ప్రాంతంలో భక్తుల రాకపోకలు, జనసందోహం నియంత్రణ, విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్యం, భద్రతా చర్యలు, అవసరమైన సౌకర్యాలను పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా అధికారులు, నిర్వాహకులు, వాలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భక్తుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు నిమజ్జన ప్రాంతంలో పరిశుభ్రతను కాపాడాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రజలు, భక్తులు ఉత్సాహంగా పాల్గొంటూ శాంతియుత వాతావరణంలో వినాయక నిమజ్జనాన్ని నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మున్సిపల్ చైర్మన్ రాధిక కాంగ్రెస్ పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ పరుశురామ్ గౌడ్ ప్రజాప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, నాయకులు, అధికారులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# భక్తి పారవశ్యంలో గణనాథుడి శోభాయాత్ర

- గంగమ్మ ఒడిలోకి గణపయ్య
- భక్తులతో కలిసి సందడి ప్రత్యేక పూజలుచేసిన
- బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మెదక్ నియోజకవర్గం
- కంఠారెడ్డి తిరుపతిరెడ్డి..





**మన ప్రజావాణి మెదక్ జిల్లా బ్యూరో సెప్టెంబర్ 25** హవేలీఘనపూర్: గణపతి నామస్మరణలు.. భక్తుల జయజయధ్వానాలు.. మంగళవాయిద్యాల హోరుతో హవేలీఘనపూర్ మండల కేంద్రం భక్తి పారవశ్యంలో మునిగిపోయింది. గణనాథుడి శోభాయాత్ర వైభవంగా సాగగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి భగత్‌సింగ్ గణేష్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణేష్ మండలి సభ్యులు, మహిళలు, యువకులు, గ్రామస్తులతో కలిసి శోభాయాత్రలో పాల్గొన్నారు. భక్తులతో మమేకమై ఉత్సవాల్లో సందడి చేశారు. గణపతి నామస్మరణలు, భక్తుల కోలాహలంతో మండల కేంద్రం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. ఈ సందర్భంగా కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ, వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఐకమత్యంతో నిర్వహించిన గ్రామస్తులు, గణేష్ మండలి సభ్యులను అభినందించారు. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడి కృపతో ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శాంతి వెల్లివిరియాలని ఆకాంక్షించారు.
గణపతి నవరాత్రి ఉత్సవాలు భక్తికి ప్రతీకగా నిలవడంతో పాటు ప్రజలందరినీ ఒక్కతాటిపైకి తీసుకొచ్చే ఐక్యతా వేదికలుగా నిలుస్తున్నాయని అన్నారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి పండుగను జరుపుకోవడం మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనానికి నిదర్శనమని పేర్కొన్నారు. వినాయకుడి ఆశీస్సులతో హవేలీఘనపూర్ మండలంలోని ప్రతి ఇంటా ఆనందం, ప్రతి కుటుంబంలో అభివృద్ధి, ప్రతి గ్రామంలో సోదరభావం వెల్లివిరియాలని కోరుకున్నారు.
అనంతరం హవేలీఘనపూర్ సర్పంచ్ మేకల సాయిలు, ఉపసర్పంచ్ వడ్ల రాజు, గణేష్ మండలి సభ్యులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.
ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మాణిక్యరెడ్డి, నాయకులు రామచంద్రారెడ్డి, నరేందర్‌రెడ్డి, దొమ్మాట రవి, సత్యంగౌడ్, మన్నె శ్రీనివాస్, మన్నె శంకర్, కుర్మ పోచయ్య, పోచేందర్, నవీన్, మంద శ్రీహరి, నర్సింలు, స్వామినాయక్, గణేష్ మండలి సభ్యులు, భక్తులు, యువకులు, మహిళలు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# భారీ వర్షాలకు నేలవాలిన పత్తి వరి పంటలు

- ఎల్‌నినో ప్రభావంతో ఆలస్యమైన వర్షాలు తీవ్ర ఇబ్బందుల్లో రైతాంగం
- తెలంగాణ రైతు సంఘం కరీంనగర్ జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము







**జమ్మికుంట సెప్టెంబర్ 25 (ప్రజావాణి)** పంట నష్టాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులను ఆదుకోవాలిశుక్రవారం రోజున ఇల్లంతకుంట మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం కరీంనగర్ జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము మాట్లాడుతూఎల్‌నినో ప్రభావంతో సరైన సమయంలో వర్షాలు కురవక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న కరీంనగర్ జిల్లా రైతాంగం ఎట్టకేలకు వర్షాలు కురవడంతో పంటలు సాగు చేసింది. అయితే గత మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలు ఈదురుగాలులు రైతులను మరోసారి తీవ్ర ఆందోళనకు గురిచేశాయి జిల్లాలోని పలు ప్రాంతాల్లో పత్తి చేనులు వరి పొలాలు నేలవాలడంతో రైతులు నష్టాలను చవిచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందివర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటూ రైతులు అప్పులు చేసి పంటలు సాగు చేశారుపత్తి వరి పంటల కోసం విత్తనాలు ఎరువులు పురుగు మందులు కూలీలకు పెద్ద మొత్తంలో పెట్టుబడులు పెట్టారు. పంటలు చేతికందే దశకు చేరుకున్న సమయంలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురవడంతో పలు ప్రాంతాల్లో పంటలు నేలమట్టమయ్యాయిదీంతో రైతులు పెట్టిన పెట్టుబడులు దెబ్బతినడంతో పాటు దిగుబడులు తగ్గే ప్రమాదం ఏర్పడింది ఇప్పటికే వాతావరణ పరిస్థితుల కారణంగా సాగులో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులకు తాజా వర్షాలు మరింత నష్టాన్ని కలిగించాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు పంటలు నేలవాలడంతో నష్టం ఎంతమేర జరిగిందనే దానిపై ప్రభుత్వం తక్షణమే సమగ్రంగా అంచనా వేయాల్సిన అవసరం ఉందని రైతు సంఘం నాయకులుకోరుతున్నారుక్షేత్రస్థాయిలో పంట నష్టాలను పరిశీలించాలిభారీ వర్షాలు ఈదురుగాలులతో దెబ్బతిన్న పత్తి వరి పంటలను రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని తెలంగాణ రైతు సంఘం కరీంనగర్ జిల్లా సహాయ కార్యదర్శి చెల్పూరి రాము డిమాండ్ చేశారురైతుల పంట నష్టాలను అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి సమగ్ర నివేదిక రూపొందించాలని నష్టపోయిన రైతులకు ప్రభుత్వం తగిన పరిహారం అందించి ఆదుకోవాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయకుండా వెంటనే చర్యలు చేపట్టాలని ఆయన అన్నారుపంట నష్టాలపై తక్షణమే సర్వే నిర్వహించి అర్హులైన రైతులకు ప్రభుత్వ పరంగా అందాల్సిన సహాయం అందేలా చర్యలు తీసుకోవాలని చెల్పూరి రాము ప్రభుత్వాన్ని కోరారు

# చిన్నముప్పారం సర్ ప్రక్రియ కలెక్టర్ విజిట్..

- స్పందించని ఓటర్లను చైతన్య పరచండి..
- భూ సర్వే పారదర్శకంగా నిర్వహించాలి..
- కలెక్టర్ స్నేహ శబరీష్



**ప్రజావాణి,ఇనుగుర్తి:** మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్న ముప్పారం లో కొనసాగుతున్న ఎస్ ఐ ఆర్ ను జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ శుక్రవారం ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. సర్ లో సవరణ, హియరింగ్స్, రీ సర్వే గురించి తహసిల్దార్ సుంకరి శ్రీనివాసులను, సంబంధిత సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా ఓటరు జాబితా మ్యాపింగ్, మార్పులు, చేర్పులు, కొత్త ఓటరు నమోదు కార్యక్రమాలను ఎన్నికల కమిషన్ సూచించిన ప్రకారం జిల్లాలో షెడ్యూల్ ప్రకారం కొనసాగుతుందని, ఓటరూ జాబితాలో పేర్లు మ్యాపింగ్ కోసం ఇప్పటికే నోటీసులు అందుకున్న వారికి హియరింగ్ నిర్వహించడం జరుగుతుందన్నారు ఎన్నికల కమిషన్ 11 రకాల గుర్తింపు కార్డులను చూపించి మ్యాపింగ్ చేసుకోవాలని తెలిపారు, ఇంకా స్పందించని ఓటరు లను చైతన్యపరిచి మ్యాపింగ్ చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.
భూ సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి. జిల్లాలో భూ సర్వేకు 70 గ్రామాలు ఎంపికయ్యాయన, సంబంధిత గ్రామాల్లో రీ సర్వే కొనసాగుతుందని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ భూములు, ఆబాది, పట్టా భూములను సర్వే జరుగుతుందని ప్రభుత్వ నిబంధనలు ప్రకారం పారదర్శకంగా పక్కాగా సర్వేను కొనసాగించాలని సంబంధిత రెవిన్యూ సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో తహసిల్దార్ సుంకరి శ్రీనివాసులు, ఎంపీడీవో బండారి పార్థసారథి, ఎస్ ఐ ఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

మన సమగ్ర ప్రజావాణి తెలుగు డైలీ



# ఎంజీఎం సమస్యలపై ప్రశ్నిస్తే పోలీసుల దాడులా?

- ప్రజాగొంతుకను అణచివేయడం ఆపాలి: అర్షం మధుకర్

**ఆత్మకూరు: ప్రజావాణి సెప్టెంబర్ 25**
ఎంజీఎం ఆస్పత్రిలో పెచ్చులూడి రోగులు గాయపడిన ఘటనపై ప్రశ్నించేందుకు, బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యే వినయ్ భాస్కర్‌పై పోలీసులు దాడి చేయడం దారుణమని బిఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు అర్షం మధుకర్ తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు తన స్వగృహంలో శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ...
ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు వెళ్లిన మాజీ ఎమ్మెల్యేను అడ్డుకోవడమే కాకుండా కడుపులో తన్నడం, చేయి విరిగేలా దాడి చేయడం అత్యంత గర్హనీయమన్నారు. ఎంజీఎం ఆస్పత్రిలో రోగుల భద్రతపై ప్రశ్నించడం, బాధితులను పరామర్శించడం కూడా తప్పేనా అని ప్రశ్నించారు. ఆస్పత్రిలో రోగుల భద్రతకు బాధ్యత ఎవరిది? భవనాల నిర్వహణను పర్యవేక్షించాల్సిన అధికారులు ఏం చేస్తున్నారు? జిల్లా అధికార యంత్రాంగం, ఆస్పత్రి సూపరింటెండెంట్ బాధ్యత ఏమిటని నిలదీశారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి, ముఖ్యమంత్రి దీనిపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. పెచ్చులు ఊడి రోగులు గాయపడే పరిస్థితి వచ్చే వరకు అధికారులు ఎందుకు స్పందించలేదని



ప్రశ్నించారు. ప్రజల ప్రాణాలకు సంబంధించిన సమస్యను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, దానిపై ప్రశ్నించే వారిపై పోలీసు బలాన్ని ప్రయోగించడం సరికాదన్నారు. ఎంజీఎం భవనాలను పూర్తిస్థాయిలో తనిఖీ చేసి, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని ఎప్పుడు ప్రారంభిస్తారు?
గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టి 24 అంతస్తుల భవనాన్ని నిర్మించారని అర్షం మధుకర్ గుర్తు చేశారు. అంత భారీ ఆస్పత్రి నిర్మాణం పూర్తయినా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురాకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో వరంగల్‌లో పలు ప్రభుత్వ భవనాలు, కార్యాలయాలు, మౌలిక వసతుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చామని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు ఉపయోగపడే ఏ ప్రధాన ప్రాజెక్టును నిర్మించిందో చెప్పాలని ప్రశ్నించారు.
ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వసతులు కల్పించాలి
ఎంజీఎం సహా ప్రభుత్వ వైద్య ఆరోగ్య సంస్థల్లో రోగులకు మెరుగైన మౌలిక సదుపాయాలు, భద్రత కల్పించాలని అర్షం మధుకర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. వినయ్ భాస్కర్‌పై జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులుగా తేలిన పోలీసులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజల సమస్యలను ప్రశ్నించే వారిని అడ్డుకోవడం కాకుండా, సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపడంపై ప్రభుత్వం దృష్టి సారించాలని అర్షం మధుకర్ సూచించారు.

# ఘనంగాపండిట్ దీన్ దయాల్ జయంతి వేడుకలు

- చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి చెట్ల మొక్కలు నాటడం జరిగింది
- పట్టణ బిజెపి పార్టీ అధ్యక్షులు కొలకాని రాజు ఆధ్వర్యంలో





**జమ్మికుంట సెప్టెంబర్ 25 (ప్రజావాణి)**
జమ్మికుంట పట్టణ బిజెపి పార్టీ అధ్యక్షులు కొలకాని రాజు ఆధ్వర్యంలో భారతీయ జన సంఘ్ వ్యవస్థాపకుడు పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు ఈసందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి చెట్ల మొక్కలు నాటడం జరిగిందిఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ పండిట్ దీన్ దయాల్ ఉపాధ్యాయ సమాజంలోని చివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు చేరాలని ఆయన లక్ష్యాన్ని నరేంద్ర మోడీ నేడు అమలుచేసున్నారని కొనియాడారుఈకార్యక్రమంలో జిల్లా ఓబిసి అధ్యక్షులు ఆకుల రాజేందర్ కౌన్సిలర్ శీలం శ్రీనివాస్ బచ్చు శివన్న, కైలాసకొటి గణేష్ రాచపల్లి ప్రశాంత్అప్పం మధు ఆకుల తిరుపతి వొల్లాల సతీష్ ముకుందా సుధాకర్ అప్పాల రవిందర్, యాంసాని సమ్మయ్య, పనికారి రమేష్ తదితరులు పాల్గొన్నారు

# యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల స్థలంను పరిశీలించిన కలెక్టర్ అంకిత్

- సర్వే నంబర్ 549/1లో సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశం..

**ఇల్లందు/మన ప్రజావాణి (సెప్టెంబర్ 25):** ఇల్లందు నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల నిర్మాణం కోసం ప్రతిపాదించిన సర్వే నంబర్ 549/1లోని స్థలంలో చేపడుతున్న సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పాఠశాల నిర్మాణం కోసం ప్రతిపాదించిన స్థలానికి సంబంధించి కొంతమంది, రైతులు తమ భూములకు సంబంధించిన అభ్యంతరాలతో కోర్టును ఆశ్రయించిన నేపథ్యంలో, కోర్టు ఆదేశాల మేరకు చేపడుతున్న సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. సర్వే నంబర్ 549/1లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల కోసం 20 ఎకరాల స్థలాన్ని ప్రతిపాదించినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా సంబంధిత రెవెన్యూ రికార్డులు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ వివరాలు, పాత నక్షాలు, పాస్‌బుక్‌లు, భూభారతి రికార్డులను పరిశీలించారు. రికార్డుల్లో నమోదైన వివరాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో భూమి విస్తీర్ణం, సరిహద్దులు, వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని కలెక్టర్ సూచించారు. స్థలానికి సంబంధించిన పాత రికార్డులు, సర్వే వివరాలు, నక్షాలు, ఇతర పత్రాలను సమగ్రంగా పరిశీలించి క్షేత్రస్థాయి పరిస్థితులతో సరిపోల్చాలని అధికారులను ఆదేశించారు. సర్వే సందర్భంగా అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించాలని సూచించారు.



ఈ సందర్భంగా కొంతమంది రైతులు తమ వద్ద ఉన్న పాత పాస్‌బుక్‌లు, భూ సంబంధిత పత్రాలను కలెక్టర్‌కు చూపించారు. తాము గతంలో సదరు భూముల్లో వ్యవసాయం చేసుకుంటూ వచ్చామని, తమ భూముల సరిహద్దులను స్పష్టంగా నిర్ధారించాలని కోరారు. పాఠశాల నిర్మాణానికి భూమి అవసరమైతే నిబంధనల ప్రకారం తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతులు సమర్పించిన పత్రాలు, సంబంధిత అధికారుల వద్ద ఉన్న రికార్డులను పరిశీలించిన కలెక్టర్, సర్వే నంబర్ 549/1లో అన్ని శాఖల సమక్షంలో సర్వేను ఎలాంటి జాప్యం లేకుండా త్వరితగతిన పూర్తి చేసి, రికార్డుల ఆధారంగా వాస్తవ సరిహద్దులను నిర్ధారిస్తూ సమగ్ర నివేదికను సమర్పించాలని రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం





ఆర్డీవో మధు ఇల్లందు తాసిల్దార్ ఖాసిం, ఏడి సర్వే శ్రీనివాస్, ఇల్లందు మున్సిపల్ కమిషనర్, ఎంపీడీవో సంబంధిత శాఖల అధికారులు, సర్వేయర్లు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

# మధిరకు మరో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు...?



**ఖమ్మం బ్యూరో ప్రతినిధి మన ప్రజావాణి** ఖమ్మం జిల్లా మధిరకు ప్రభుత్వం మరో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును మంజూరు చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 200 సివిల్ అండ్ క్రిమినల్, అదనపు కోర్టులు మంజూరు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా ఖమ్మం జిల్లాలో ఖమ్మం కు ఆరు, మధిరకు ఒకటి, సత్తుపల్లి కి ఒకటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. మధిరకు అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు చేయడం పట్ల కోర్టు మధిర బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చావలి రామరాజు, న్యాయవాది గంధం శ్రీనివాసరావు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. మధిరలో ఐదుకు చేరిన కోర్టుల సంఖ్య ప్రభుత్వం మధిరకు మరో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్ మంజూరు చేయటంతో జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టుల సంఖ్య మూడుకు, మొత్తం కోర్టుల సంఖ్య ఐదుకు చేరింది. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్ట్, ఇప్పటికే ఉండగా కొత్తగా మరో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు అయింది. ఇవి కాకుండా సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్ట్, సీనియర్ సివిల్ జడ్జి కోర్ట్ (సబ్ కోర్ట్) ఇప్పటికే ఉన్నాయి. వీటితో కలిపి మదిరలో కోర్టుల సంఖ్య ఐదుకు చేరినట్లు అయిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

# నిబంధనలకు విరుద్ధంగా డీజే ఏర్పాటు.. వాహనం సీజ్

- వినాయక నిమజ్జనంలో డీజే వినియోగంపై కేసు నమోదు





**ప్రజావాణి శాయంపేట** వినాయక నిమజ్జనం సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా డీజే ఏర్పాటు చేయడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. శాయంపేట మండలం కొప్పుల గ్రామంలో గురువారం రాత్రి నిర్వహించిన వినాయక నిమజ్జన కార్యక్రమంలో రేగొండ మండలం నిజాంపల్లి గ్రామానికి చెందిన డీజే నిర్వాహకుడు చింతల సురేష్ డీజే ఏర్పాటు చేసినట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు డీజే వాహనం (టీఎస్ 27 టీ 1906)ను సీజ్ చేసి సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పరమేశ్వర్ తెలిపారు. వినాయక నిమజ్జనాల సందర్భంగా ఎక్కడా డీజేలకు అనుమతి లేదని ఎస్ఐ స్పష్టం చేశారు. నిబంధనలు ఉల్లంఘించి డీజే ఏర్పాటు చేసినందుకు చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క చిత్రపటాలకు పాలాభిషేకం

- కొత్తగూడ మండల అభివృద్ధికి రూపాయలు 14.65 కోట్లు మంజూరు చేసినందుకు కాంగ్రెస్ శ్రేణుల హర్షం
- మండలం లో రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు 600 మంజూరు

**కొత్తగూడ మండల ప్రతినిధి:- సెప్టెంబర్ 25. (మన సమగ్ర ప్రజావాణి):-**
మహబూబాబాద్ జిల్లా, కొత్తగూడ మండల కేంద్రంలో శుక్రవారం పండుగ వాతావరణం నెలకొంది. మండలంలోని వివిధ గ్రామాల సమగ్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కల ప్రత్యేక చొరవతో, ప్రభుత్వం రూపాయలు 14.65 కోట్ల ఎస్డీఎఫ్ (స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్) నిధులను మంజూరు చేసింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ రూపుసింగ్ ఆధ్వర్యంలో మండలంలోని



సర్పంచ్ లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున తరలివచ్చి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్కల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ?ఈ సందర్భం గా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బానోత్ రూపుసింగ్ మాట్లాడుతూ... వెనుకబడిన కొత్తగూడ మండల అభివృద్ధిపై మంత్రి సీతక్క ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పన, రహదారుల నిర్మాణం, సైడ్ డ్రైనేజీ పనులు ఇతర అభివృద్ధి పనుల కోసం భారీగా నిధులు విడుదల చేయడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చబోతోందని పేర్కొన్నారు. ?మండల ప్రజల తరఫున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రి సీతక్కకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిధులతో మండలం లోని ప్రతి గ్రామంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతాయని, ప్రజల సుదీర్ఘకాల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అలాగే మంత్రి సీతక్క ప్రత్యేక చొరవ తో, కొత్తగూడ మండలంలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్లు 600 మంజూరు చేసారని ఆయన హర్షం వ్యక్తం చేశారు. ?ఈ కార్యక్రమంలో కొత్తగూడ మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు వజ్జ సారయ్య, బ్లాక్ అధ్యక్షుడు సుంకరబోయిన మొగిలి, రూరల్ డెవలప్మెంట్ డైరెక్టర్ చల్ల నారాయణ రెడ్డి, సర్పంచ్ లు మల్లెల భాగ్యమ్మ, ఈసం పుష్ప, సిరివెన్నల, వసంత, గొంది సోని, ఆలూరి కిరణ్, మల్లెల సందీప్, నూనావత్ ఈర్య, ధనసరి ముత్తయ్య, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు అలాగే గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జనానికి పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు

- మెదక్ పట్టణంలో నిమజ్జన మార్గాలు, సున్నిత ప్రాంతాలను పరిశీలించిన
- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు





**మెదక్ జిల్లా బ్యూరో ప్రజావాణి సెప్టెంబర్ 25**విద్యుత్ తీగలు, అడ్డంకులు తొలగించాలి.. ట్రాఫిక్ సమస్యలు లేకుండా చర్యలు । సున్నిత ప్రాంతాల్లో అదనపు బందోబస్తు మెదక్: గణేష్ నిమజ్జనాల సందర్భంగా మెదక్ పట్టణంలో జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ఐపీఎస్ శుక్రవారం పర్యటించి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పట్టణంలోని సున్నిత ప్రాంతాలతో పాటు గణేష్ విగ్రహాల శోభాయాత్ర జరిగే మార్గాలను పరిశీలించారు. నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జరిగేలా పోలీసు అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. శోభాయాత్ర మార్గాల్లో విద్యుత్ శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ విద్యుత్ తీగలు, ఇతర అడ్డంకులను ముందుగానే తొలగించాలని ఎస్పీ ఆదేశించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని, సున్నితమైన ప్రాంతాల్లో అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. గణేష్ నిమజ్జన శోభాయాత్రలో పాల్గొనే నిర్వాహకులు పోలీసులకు పూర్తిగా సహకరించాలని, పోలీసుల సూచనలు పాటిస్తూ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్పీ కోరారు.

# భూసేకరణ పరిహారంలో దళారుల మాటలు నమ్మొద్దు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష



**ప్రజావాణి జిల్లా ప్రతినిధి పెద్దపల్లి సెప్టెంబర్ 25**ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నేరుగా బాధితులకు నష్టపరిహారం ఎక్కువ పరిహారం ఇప్పిస్తామంటూ డబ్బులు వసూలు చేసే మధ్యవర్తులపై అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్ కోయ శ్రీహర్ష జిల్లాలో వివిధ అభివృద్ధి, మౌలిక వసతుల ప్రాజెక్టుల కోసం జరుగుతున్న భూసేకరణ ప్రక్రియలో భూములు కోల్పోతున్న బాధితులు దళారులు, మధ్యవర్తుల మాటలు నమ్మి మోసపోవద్దని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సూచించారు. ప్రభుత్వ నిబంధనలు, మార్గదర్శకాల ప్రకారమే అర్హులైన భూ యజమానులకు నష్టపరిహారం నేరుగా అందజేస్తామని ఆయన స్పష్టం చేశారు. రామగుండం, ఎన్టీపీసీ, సింగరేణి, రాజాపూర్ ప్రాంతాల్లో జరుగుతున్న భూసేకరణతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో జాతీయ రహదారులు, రైల్వే మార్గాల నిర్మాణం, విస్తరణకు సంబంధించి భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని తెలిపారు. ఈ భూసేకరణను ఆసరాగా చేసుకుని కొంతమంది దళారులు, మధ్యవర్తులు ప్రజలను సంప్రదిస్తూ ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా "అధిక నష్టపరిహారం ఇప్పిస్తాం" అంటూ నమ్మబలికి డబ్బులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ పేర్కొన్నారు. ఇలాంటి వ్యక్తుల మాటలు నమ్మి ప్రజలు ఆర్థికంగా నష్టపోవద్దని ఆయన హెచ్చరించారు. భూములు కోల్పోతున్న బాధితులకు ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం అందాల్సిన నష్టపరిహారం, ఇతర ప్రయోజనాల వివరాలను సంబంధిత అధికారులు అధికారికంగా తెలియజేస్తారని కలెక్టర్ తెలిపారు. పరిశ్రమలు, సింగరేణి సంస్థలకు సంబంధించిన భూసేకరణతో పాటు జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల భూసేకరణలోనూ అనధికార వ్యక్తులకు ఎలాంటి డబ్బులు చెల్లించవద్దని సూచించారు. ఎవరైనా మధ్యవర్తులు లేదా దళారులు నష్టపరిహారం ఇప్పిస్తామని చెప్పి డబ్బులు డిమాండ్ చేసినా, మోసపూరితంగా వ్యవహరించినా వెంటనే సంబంధిత రెవెన్యూ అధికారులకు లేదా పోలీసులకు సమాచారం అందించాలని కలెక్టర్ కోరారు. భూసేకరణకు సంబంధించిన సందేహాలుంటే అధికారులను సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. అనధికార వ్యక్తులను నమ్మకుండా, ప్రభుత్వ అధికారిక ప్రక్రియ ద్వారానే నష్టపరిహారం పొందాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి...

- 18 నుంచి 35 సంవత్సరాల అభ్యర్థులు అర్హులు.
- నిరుద్యోగులు సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.
- జిల్లా ఉపాధి కల్పన అధికారిణి యన్. పద్మ.



**యాదాద్రి భువనగిరి జిల్లా మన ప్రజావాణి జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25** యాదాద్రి భువనగిరి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించ డానికి 26 శనివారం రోజు జాబ్ మేలా నిర్వహించ బడుతుందని జిల్లా ఉపాధి కల్పన అధికారిణి యన్. పద్మ తెలిపారు. కనీస విద్యా అర్హత 10 వ తరగతి డి-యమ్- ఫార్మసీ అర్హత కలిగిన ఆసక్తి గల 18 నుండి 35 సంవత్స రాల వయస్సుగల అభ్యర్థులు అర్హులని తెలిపారు. అభ్యర్థులు తమ ఆధార్ కార్డు , విద్యార్హత సర్టిఫికెట్లు , బయోడేటాతో జాబ్ మేళాకు హాజరు కావాలని జిల్లా అధికారిణి కోరారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెం 7095612963 , ను సంప్రదించలని సూచించారు. అర్హత కలిగిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్విని యోగం చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనా అధికారిణి ఎన్. పద్మ విజ్ఞప్తి చేశారు.

## బాల మేధావులకు ఇన్నోవేషన్ వేదిక.. అమీనాబాద్ మోడల్ స్కూల్‌లో ఎస్ఐసి ఆరంభం






**చెన్నారావుపేట సెప్టెంబర్ 25 ప్రజావాణి**విద్యార్థుల్లోని నూతన ఆలోచనలకు పదునుపెట్టి, వారిని భావి ఆవిష్కర్తలుగా మార్చేందుకు అమీనాబాద్ మోడల్ స్కూల్‌లో స్కూల్ ఇన్నోవేషన్ కౌన్సిల్ (ఎస్ఐసి) కొలువుదీరింది. ప్రిన్సిపాల్ చిట్ట జ్యోతి అధ్యక్షతన, డి. రాజు కన్వీనర్‌గా ఏర్పాటైన ఈ కౌన్సిల్ ద్వారా విద్యార్థులకు ఐడియా జనరేషన్, ఇన్నోవేషన్ ఛాలెంజ్, ప్రాజెక్ట్ మేకింగ్‌లో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. బాలాజీ ఇంజినీరింగ్ కాలేజ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ జి. శ్రీధర్ ముఖ్య విద్యావేత్తగా వ్యవహరిస్తూ విద్యార్థులకు స్టార్టప్‌లు, సాంకేతిక పరిష్కారాలపై మార్గదర్శకత్వం అందించనున్నారు. కౌన్సిల్‌లో ఉపాధ్యాయులు పి. సదాకర్ రెడ్డి, ఎ. రవికుమార్, సిహెచ్. రాజేంద్ర ప్రసాద్ ఇన్నోవేషన్ అంబాసిడర్లుగా బాధ్యతలు స్వీకరించారు. పాఠశాల కెప్టెన్ సిరి, హెడ్ బాయ్ సాత్విక్, హెడ్ గర్ల్ శ్రీవర్షలు విద్యార్థి ప్రతినిధులుగా ఎంపికై సృజనాత్మక ప్రయాణానికి శ్రీకారం చుట్టారు.

## ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలి: చేగుంట మండల సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షుడు బికొండాపూర్ సర్పంచ్ రంగయ్యగారి రామకృష్ణారెడ్డి రాజిరెడ్డి



**ప్రజావాణి దుబ్బాక నియోజకవర్గం** చేగుంట మండల కేంద్రంలో బ్రదర్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినాయకుని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వినాయకుని దర్శించుకొని, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న చేగుంట మండల సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షుడు, బికొండాపూర్ సర్పంచ్ రంగయ్యగారి రామకృష్ణారెడ్డి రాజిరెడ్డి. ఈ సందర్భంగా చేగుంట మండల సర్పంచ్ల ఫోరమ్ అధ్యక్షుడు, బికొండాపూర్ సర్పంచ్ రంగయ్యగారి రామకృష్ణారెడ్డి రాజిరెడ్డి మాట్లాడుతూ ప్రజలు అందరూ సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని వినాయకుని కోరుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎర్ర యాదగిరి,డిష్ రాజు, చేగుంట మహంకాళి ఆలయం ఉపాధ్యక్షుడు గుండ్ల సంపత్ కుమార్,అన్నం రవి,గణేష్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## దండేపల్లి మండలంలో అభివృద్ధి పనులపై సమీక్ష




**దండేపల్లి:** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో జేడీ ప్రసాద్ గారి అధ్యక్షతన శుక్రవారం అన్ని పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సహాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనులు, వి.బి.జి.ఆర్.ఎం.జీ. పనులు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పురోగతిని సమీక్షించారు. ప్రతి గ్రామపంచాయతీలో గ్రామసభలు నిర్వహించి, వి.బి.జి.రామ్ .జీ. కింద చేపట్టాల్సిన పనులను గుర్తించి, అభివృద్ధి చెందిన గ్రామపంచాయతీ ప్రణాళికను సిద్ధం చేయాలని పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక సహాయకులకు వి బి జి రామ్ జి ఫీల్డ్ అసిస్టెంట్ గ్రామ సభలు విజయవంతం చేయాలని సూచించారు.

## క్షేత్రస్థాయిలో పెన్షన్ దరఖాస్తులు పరిశీలన



**రాయికల్, సెప్టెంబర్ 25 (ప్రజావాణి):** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న చేయూత పెన్షన్లలో అనర్హులకు చోటు లేకుండా, అర్హులైన పేదలకే అందాలనే లక్ష్యంతో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ ముమ్మరం చేశారు.శుక్రవారం రాయికల్ మండలంలోని ఇటిక్యాల గ్రామంలో మండల పంచాయతీ అధికారి (ఎంపీవో) కండ్లే సుష్మ ఒంటరి మహిళ, వితంతు, చేనేత, గీత కార్మికులు, దివ్యాంగుల నుంచి వచ్చిన పెన్షన్ దరఖాస్తులను నేరుగా పరిశీలించారు. ఇంటింటికీ తిరిగి లబ్ధిదారుల వివరాలు, ఆదాయ పరిస్థితి, కుటుంబ నేపథ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. దరఖాస్తులతో జత చేసిన ఆధార్ కార్డు, కుల, ఆదాయ ధృవపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనర్హులు ఎవరైనా చేరితే తొలగించి, నిజమైన అర్హులకు న్యాయం చేస్తామని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నీరటి శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి తోట రాజేష్, నాయకులు మరిపెల్లి శ్రీనివాస్ గౌడ్, జవ్వాజి నర్సాగౌడ్, కారోబార్ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# స్ప్రేయింగ్ ఆపారు... దొంగ బిల్లులకు రూట్ వేశారు!

- బ్రీడింగ్ చెక్కర్లను పక్కనబెట్టిన అధికారులు.. గ్రామాల్లో విజృంభిస్తున్న దోమలు
- కలెక్టర్ ఆదేశాలు సైతం వేస్ట్ పేపర్ బుట్టలోకే!
- డిప్యూటేషన్ 'చక్రం' వెనుక దొంగ బిల్లుల కుట్ర?




**చెన్నారావుపేట సెప్టెంబర్ 24 ప్రజావాణి**
ఒకవైపు డెంగ్యూ, మలేరియా వంటి విషజ్వరాలు పల్లెలను భయపెడుతుంటే.. మరోవైపు ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రతి ఏటా గ్రామాల్లో ఇంటింటి సర్వే చేసి, నివారణ మందులు చల్లే 'బ్రీడింగ్ చెక్కర్స్' నియామకంలో అధికారులు చూపుతున్న నిర్లక్ష్యం వెనుక రూ.లక్షల నిధుల మళ్లింపు కుట్ర ఉందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**కలెక్టర్ మాటకే విలువ లేకపోతే ఎలా?**

రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టులోనే బ్రీడింగ్ చెక్కర్లను విధుల్లోకి తీసుకోవాలని ఆదేశాలు ఇచ్చింది. సరిపోకపోతే, ఆగస్టు 17న నిర్వహించిన ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ సత్య శారదను కార్మికులు కలవగా.. వెంటనే 15 మందిని (పాతవారితో పాటు అదనంగా మరో ఐదుగురిని) విధుల్లోకి తీసుకోవాలని డీఎంహెచ్‌ఓకు స్పష్టమైన ఆర్డర్ వేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు కార్మికులు సెప్టెంబర్ 17న తమ బయోడేటాలను ఆఫీసులో సమర్పించారు. కానీ, వారం గడుస్తున్నా అధికారుల నుంచి ఎలాంటి స్పందనా లేదు.?గత ఏడు సంవత్సరాలుగా ప్రతి ఆగస్టు నుంచి డిసెంబర్ వరకు ఐదు నెలల పాటు వీరు పల్లెల్లో స్ప్రేయింగ్ పనులు చేస్తూ, ప్రజల ప్రాణాలను కాపాడుతున్నారు. అయితే, ఈ ఏడాది వారిని విధుల్లోకి తీసుకోకపోవడం వెనుక పెద్ద కథే నడుస్తోందనే ఆరోపణలు వస్తున్నాయి.గత ఏడాది కూడా బ్రీడింగ్ చెక్కర్లను విధుల్లోకి తీసుకోకుండానే, వారు పనిచేసినట్లు నకిలీ పేపర్లు సృష్టించి తమ బంధువుల అకౌంట్లలోకి నిధులను మళ్లించారనే ప్రచారం బాహాటంగానే జరుగుతోంది. సంగెం్రాఎజ నుంచి డీఎంహెచ్ఓ ఆఫీస్‌కు డిప్యూటేషన్‌పై వచ్చిన ఒక హెల్త్ అసిస్టెంట్ ఈ వ్యవహారంలో చక్రం తిప్పుతూ, ఈ సారి కూడా అదే రీతిలో నిధులు కాజేయడానికి స్కెచ్ వేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.?అధికారులు కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేస్తూ తమ జీవితాలతో ఆడుకుంటున్నారని బ్రీడింగ్ చెక్కర్స్ వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, వెంటనే తమను విధుల్లోకి తీసుకుని గ్రామాల్లో స్ప్రేయింగ్ పనులు పునరుద్ధరించాలని, తమ కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.?ఈ కార్యక్రమంలో బ్రీడింగ్ చెక్కర్స్ యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు భూక్య శ్రీనివాస్ నాయక్, నాయకులు బాదావత్ రామ్ చందర్, జన్ను సరిత, చిన్నపెల్లి దేవేందర్, మంత్రి చాణిక్య, బాదావత్ బద్రు, రాజేశ్వర్ రావు, రామ్ కుమార్, చిర్ర రాజు, మోహన్ రావులు పాల్గొన్నారు.

# మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖలు.. ఇద్దరి అరెస్ట్

- వివరాలు వెల్లడించిన మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు






**మెదక్, జిల్లా బ్యూరో ప్రజావాణి సెప్టెంబర్ 25**
సామాజిక మాధ్యమాల్లో ప్రచారం, వీక్షకుల సంఖ్య పెంచుకునేందుకే కుట్ర
తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్‌లో ఎర్ర వస్త్రాలు, బెదిరింపు లేఖలు
మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖలు ఏర్పాటు చేసి ప్రజలను, అధికారులను భయభ్రాంతులకు గురిచేసిన ఘటనలో ఇద్దరిని మెదక్ జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. నాగులపల్లి గ్రామానికి చెందిన బండ మధు (23), చింతకింది శ్రీధర్ (23)లను అరెస్టు చేసిన పోలీసులు వారి నుంచి ఒక ద్విచక్రవాహనం, రెండు సెల్‌ఫోన్లు, నల్లరంగు వర్షపు కోటు, శాలువా, పెన్నులను స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు.

**అర్ధరాత్రి పోలీస్‌స్టేషన్‌లో లేఖ**

ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబర్ 21, 22 తేదీల మధ్య అర్ధరాత్రి సుమారు 1.30 గంటల సమయంలో ముసుగు ధరించిన వ్యక్తి తూప్రాన్ పోలీస్‌స్టేషన్‌లోకి ప్రవేశించాడు. లేఖతో కూడిన ఎర్ర వస్త్రాన్ని స్వీకరణ బల్లపై ఉంచి అక్కడి నుంచి వెళ్లిపోయాడు. బయట మరో వ్యక్తి ద్విచక్రవాహనంపై వేచి ఉన్నాడు. ఇదే సమయంలో తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం వద్ద కూడా ఇలాంటి లేఖతో కూడిన ఎర్ర వస్త్రాన్ని ఏర్పాటు చేశారు.ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. గతంలో సెప్టెంబర్ 16న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడారం పర్యటన సందర్భంగా కూడా మావోయిస్టుల పేరుతో బెదిరింపు లేఖ వెలుగులోకి రావడంతో పోలీసులు ఈ ఘటనపై ప్రత్యేక దృష్టి సారించారు.

**ప్రత్యేక బృందంతో దర్యాప్తు**

తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. పోలీస్‌స్టేషన్, మున్సిపల్ కార్యాలయం పరిసరాల్లోని నిఘా కెమెరాల దృశ్యాలను పరిశీలించడంతో పాటు సాంకేతిక ఆధారాలను విశ్లేషించారు. నిందితుల కదలికలను గుర్తించి వారి ఆచూకీని తెలుసుకున్నారు. దర్యాప్తులో ప్రధాన నిందితుడు బండ మధు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం పొందడంతో పాటు తన అనుచరులు, వీక్షణల సంఖ్యను పెంచుకోవాలనే ఉద్దేశంతో ఈ చర్యకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. మేడారం ఘటనకు ఆశించిన స్థాయిలో ప్రచారం రాకపోవడంతో తూప్రాన్‌లో మరోసారి ఇలాంటి చర్యకు పాల్పడినట్లు వెల్లడైంది.

**కృత్రిమ మేధతో లేఖల తయారీ**

పోలీసుల వివరాల ప్రకారం.. కృత్రిమ మేధ సాయంతో బెదిరింపు లేఖను రూపొందించి, అందులో మార్పులు చేసి మొత్తం మూడు లేఖలను సిద్ధం చేశారు. వాటిపై 'అలెగ్జాండర్ ఆఫ్', 'గణపతి అన్న' అనే పేర్లతో పాటు కొడవలి, సుత్తి గుర్తులను ఉంచారు. సెప్టెంబర్ 21, 22 తేదీల మధ్య అర్ధరాత్రి మధు, శ్రీధర్ ద్విచక్రవాహనంపై తూప్రాన్‌కు చేరుకున్నారు. ముందుగా మున్సిపల్ కార్యాలయం వద్ద లేఖతో కూడిన ఎర్ర వస్త్రాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం మధు ముసుగు, వర్షపు కోటు ధరించి పోలీస్‌స్టేషన్‌లోకి వెళ్లి లేఖను స్వీకరణ బల్లపై ఉంచాడు. అక్కడి దృశ్యాలను తన సెల్‌ఫోన్‌లో చిత్రీకరించాడు. అనంతరం ఫొటోలు, దృశ్యాలను తన సన్నిహితులకు పంపినట్లు దర్యాప్తులో వెల్లడైంది.

**నాగులపల్లి వంతెన వద్ద అరెస్ట్**

నిందితుల ఆచూకీపై విశ్వసనీయ సమాచారం అందడంతో సెప్టెంబర్ 24న సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో నాగులపల్లి వంతెన వద్ద బండ మధు, చింతకింది శ్రీధర్‌ను పోలీసులు అరెస్టు చేశారు.

**పోలీసులకు ఎస్పీ అభినందనలు**

అదనపు ఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్ పర్యవేక్షణలో తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ నేతృత్వంలో ఎస్ఐ గంగరాజు, ప్రత్యేక దర్యాప్తు బృందం, సమాచార సాంకేతిక విభాగం సిబ్బంది దర్యాప్తు చేపట్టారు. తక్కువ సమయంలో కేసును ఛేదించి నిందితులను అరెస్టు చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు.

# అంగన్వాడీల్లో ఆటపాటలతో పాటు ప్రీస్కూల్ విద్య

- పోషకాహారంపై తల్లిదండ్రులకు అవగాహన
- అంగన్వాడీ సూపర్వైజర్ పి. వసంతలక్ష్మి



**గరిడేపల్లి, సెప్టెంబర్ 25 (ప్రజావాణి):** అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో పాటు ప్రీస్కూల్ విద్యను అందిస్తున్నామని అంగన్వాడీ సూపర్వైజర్ పి. వసంతలక్ష్మి తెలిపారు. అర్హులైన లబ్ధిదారులందరూ అంగన్వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. పోషణ మాసంలో భాగంగా శుక్రవారం గరిడేపల్లి మండలంలోని గానుగబండ, కొండాయిగూడెం అంగన్వాడీ కేంద్రాల్లో పోషణ మాస కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు ఆటలు, పాటలతో పాటు స్థానికంగా లభించే వస్తువులతో బొమ్మలను తయారు చేసే విధానాన్ని అంగన్వాడీ సిబ్బంది ప్రదర్శించారు.అనంతరం సూపర్వైజర్ పి. వసంతలక్ష్మి మాట్లాడుతూ పిల్లలకు సమతుల్యమైన, పోషక విలువలు కలిగిన ఆహారం అందించడం ఎంతో ముఖ్యమన్నారు. ఇంట్లోనే తక్కువ ఖర్చుతో తయారు చేసుకునే పౌష్టికాహార వంటకాల ద్వారా పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అవసరమైన పోషకాలు అందించవచ్చని సూచించారు.పల్లి పట్టి, నువ్వుల ఉండలు, మునగాకు పకోడీ, పాలకూర పకోడీ తదితర వంటకాలను స్థానికంగా లభించే పదార్థాలతో సులభంగా తయారు చేసుకుని అధిక పోషకాహారం పొందవచ్చని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల పోషణ విషయంలో తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పోకల వెంకమ్మ, అమరారపు సత్యవతి, జంగం అనిత, ఆయా గోవిందమ్మతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు, ప్రీస్కూల్ పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పథకం పనులపై సోషల్ ఆడిట్

- రూ.2.75 కోట్ల రూపాయల పనులపై సోషల్ ఆడిట్
- ఉపాధి హామీ పనుల్లో అవకతవకలకు చెక్
- రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యంపై అధికారుల ఆగ్రహం





**చిన్నంబావి, ప్రజావాణి సెప్టెంబర్ 25** గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 5వ సామాజిక తనిఖీ చిన్నంబావి మండలంలో చేపట్టిన రూ. 2.75 కోట్ల విలువైన పనులపై సామాజిక తనిఖీనిర్వహించారు. మండల పరిషత్ కార్యాలయఆవరణలో శుక్రవారం నిర్వహించిన సోషల్ ఆడిట్ ప్రజావేదికకు డీఆర్డీవో రాజేశ్వర్‌రెడ్డి, ఏపీడీ సయ్యద్ సుల్తాన్ హాజరై గ్రామాల వారీగా నిర్వహించిన సామాజిక తనిఖీ నివేదికలను సమీక్షించారు.వారం రోజులుగా క్షేత్రస్థాయి పరిశీలన గత వారం రోజులుగా రిసోర్స్ పర్సన్లు మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి ఉపాధి హామీ పనులు, కూలీల హాజరు, వేతనాల చెల్లింపులు, మస్టర్లు, రిజిస్టర్లు తదితర రికార్డులను పరిశీలించారు. పనులు నిబంధనల ప్రకారం జరిగాయా? కూలీలకు వేతనాలు సక్రమంగా అందాయా? అనే అంశాలపై క్షేత్రస్థాయిలో వివరాలు సేకరించారు.

**రూ. 2.42 కోట్లు కూలీల వేతనాలు**

గత ఆర్థిక సంవత్సరంలో మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు రూ. 2.75 కోట్లతో ఫీడర్ ఛానళ్లు, సీసీ రోడ్లు, ల్యాండ్ లెవెలింగ్ క్యాటిల్ షెడ్ తదితర పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఇందులో కూలీలకు రూ. 2.42 కోట్ల మేర వేతనాలు చెల్లించగా, రూ. 33.18 లక్షల వరకు సామగ్రి వ్యయం జరిగినట్లు వివరించారు.

**నిర్లక్ష్యంపై చర్యలు**

ఉపాధి హామీ పనుల్లో అవినీతికి, అవకతవకలకు తావులేకుండా పారదర్శకంగాపనులు నిర్వహించాలని అధికారులు సూచించారు. నిధుల వినియోగంపై ప్రజలకు స్పష్టత కల్పించడంతో పాటు అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలు గుర్తిస్తే బాధ్యులపై చర్యలు తీసుకోవడమే సోషల్ ఆడిట్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు.పలు గ్రామాల్లో రికార్డుల నిర్వహణలో నిర్లక్ష్యం, విధుల పట్ల అలసత్వం ఉన్నట్లు సోషల్ ఆడిట్ బృందాలు గుర్తించి నివేదికలు సమర్పించాయి. వీటిపై జిల్లా అధికారులు సమీక్ష నిర్వహించి, నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడంతో పాటు పెనాల్టీలు వసూలు చేయాలని ఆదేశించి నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుర్ణ ఆదర్శ్‌గౌడ్, విజిలెన్స్ అధికారి సిరాజ్, హరిత, ఎస్టీఎం అంజగౌడ్, ఎంపీవో రామస్వామి, ఏపీవో ధనుంజయరాజు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది, డీఆర్పీలు, పీఆర్పీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

# అంతర్జాతీయ సాఫ్ట్ బాల్ క్రీడాకారిణి బానోతు ఈశ్వరిని అభినందించిన డీఈవో



**నంగునూరు, సెప్టెంబర్ 25:** సాఫ్ట్ బాల్ క్రీడలో ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారిణి, గట్లమల్యాల ఉన్నత పాఠశాల విద్యార్థిని బానోతు ఈశ్వరిని సిద్ధిపేట జిల్లా పరిషత్ సీఈవో, ఇంఛార్జి జిల్లా విద్యాధికారి రమేశ్ అభినందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మాదాసి రమేశ్, వ్యాయామ ఉపాధ్యాయుడు దర్శనాల రాజ్ కుమార్, గట్లమల్యాల బాలికల వసతి గృహ సంక్షేమ అధికారి మాధవీలతతో పాటు గట్లమల్యాల పాఠశాల ఉపాధ్యాయ బృందంతో కలిసి ఈశ్వరి శుక్రవారం సాయంత్రం డీఈవోను కలిసింది. చైనాలో అక్టోబర్ 12వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్న ఏషియన్ సబ్ జూనియర్ గేమ్స్‌లో భారతదేశం తరపున పాల్గొననున్న ఈశ్వరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి రమేశ్ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతం నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగి, దేశానికి ప్రాతినిధ్యం వహించడం ఎంతో గర్వకారణమన్నారు. క్రీడల్లో విద్యార్థులు రాణించేందుకు పాఠశాల స్థాయి నుంచే ప్రోత్సాహం, సరైన శిక్షణ అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈశ్వరి కృషి, పట్టుదల, ప్రతిభ ఇతర విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం మాదాసి రమేశ్, వ్యాయామ ఉపాధ్యాయుడు దర్శనాల రాజ్ కుమార్, హెచ్‌డబ్ల్యూఓ మాధవీలతతో పాటు పాఠశాల ఉపాధ్యాయ బృందం ఈశ్వరిని అభినందించారు. అంతర్జాతీయ వేదికపై తన ప్రతిభను చాటుకుని, దేశానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. భారత జెర్సీతో అంతర్జాతీయ క్రీడా వేదికపై అడుగుపెడుతున్న బానోతు ఈశ్వరికి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు క్రీడాభిమానులు ఘనంగా శుభాకాంక్షలు తెలిపారు.

# గూడెం గ్రామంలో భక్తిశ్రద్ధలతో గణనాథుడి నిమజ్జనం కార్యక్రమం

- సనాతన ధర్మ యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిమజ్జనం



**చిన్నంబావి ప్రజావాణి సెప్టెంబర్ 25** చిన్నంబావి మండల కేంద్రంలోని గూడెం గ్రామంలో సనాతన ధర్మ యూత్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక చవితి ఉత్సవాలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా ముగిశాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతిష్ఠించిన వినాయకుడి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం నిమజ్జన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా గ్రామంలో భక్తుల సందడి నెలకొంది. యువత, భక్తులు ఉత్సాహంగా పాల్గొని గణనాథుడికి వీడ్కోలు పలికారు. భక్తులజయజయధ్వానాలు, వినాయక నామస్మరణలతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. "భక్తి.. శ్రద్ధ.. ఐక్యతకు ప్రతీకఉత్సవాలు" సనాతన ధర్మ యూత్ కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. గ్రామంలో ప్రతి సంవత్సరం వినాయక చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది కూడా కమిటీ సభ్యులు, యువత సమన్వయంతో ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించి, చివరగాగణనాథుడినిమజ్జనకార్యక్రమాన్ని పూర్తి చేశామని పేర్కొన్నారు. వినాయక చవితి ఉత్సవాలు గ్రామ ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించేలా సాగాయని కమిటీ సభ్యులు తెలిపారు. నిమజ్జన కార్యక్రమంలో గ్రామ ప్రజలు, యువత, పాల్గొనిగణనాథుడికి ఘనంగా వీడ్కోలు పలికారు. ఇట్టి కార్యక్రమంలో సనాతన ధర్మ యూత్ కమిటీ సభ్యులు మద్దూరి నాగరాజు కుటుంబ సభ్యులు, మధకం కురుమయ్య కుటుంబ సభ్యులు, తోట బాలకృష్ణ కుటుంబ సభ్యులు, మేకల శివుడు కుటుంబ సభ్యులు, మద్దూరి ప్రవీణ్ కుటుంబ సభ్యులు, మేకల సతీష్ యాదవ్ కుటుంబ సభ్యులు, గొందిపర్ల మూర్తి బాలకృష్ణ బాలపీరు కుటుంబ సభ్యులు, మద్దూరి సత్తయ్య కుటుంబ సభ్యులు అందరూ కలిసి కార్యక్రమాన్ని విజయవంతంగా చేశారు.

# అర్వణపల్లిలో కన్నీటి సముద్రం..యాదమ్మ మరణంతో మూగబోయిన ఆత్మీయ పలకరింపు!

- చిన్న-పెద్ద తేడా లేని చల్లని గొంతుక దూరం!
- శోకసంద్రంలో గంధసిరి కుటుంబం!
- పార్థివ దేహానికి పూలమాలలు వేసిన
- రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి.





**కేసముద్రం సెప్టెంబర్ 25,ప్రజావాణి.**
అర్వణపల్లి గ్రామంలో ఎటుచూసినా గుండెల్ని పిండేసే రోదనలే వినిపించాయి . ఊరిలో అందరితోనూ ఎంతో ఆప్యాయంగా ఉంటూ, మంచి పేరు తెచ్చుకున్న గంధసిరి యాదమ్మ (భర్త- వెంకన్న, కొడుకు-కోడలు, రాజు - రచన) కూతురు- అల్లుడు, రాధిక- విజయ్) యాదమ్మ అనారోగ్యంతో కన్నుమూశారన్న వార్త అర్వణపల్లి గ్రామానికి కోలుకోలేని గుండెకోతను మిగిల్చింది. ఈ చేదు వార్త వినగానే గ్రామమంతా ఒక్కసారిగా దిగ్భ్రాంతికి లోనైంది. తమ ఇంట్లోని మనిషి దూరమైనట్లుగా గ్రామస్తులంతా శోకసంద్రంలో మునిగిపోయారు.

మూగబోయిన ఆత్మీయ గొంతుక!

ఏమ్మా.. బాగున్నావా? తిన్నావా నాయనా?అంటూ పొలం గట్టున వెళ్తున్నా, వీధి అరుగుపై కూర్చున్నా, ఊరిలో ఎక్కడ కనిపించినా చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరించే ఆ చల్లని గొంతు ఇక ఎప్పటికీ వినపడదని తెలిసి గ్రామస్తులు కన్నీరుమున్నీరవుతున్నారు. యాదమ్మ గారి పలకరింపులో ఒక కన్నతల్లి ప్రేమ, ఒక తోబుట్టువు ఆత్మీయత దాగి ఉండేవని ఊరి మహిళలు గుర్తు చేసుకుంటూ బావురుమంటున్నారు. గ్రామంలో ఎవరి ఇంట్లో శుభకార్యం జరిగినా నేనంటూ ముందుండేది యాదమ్మ. ఎవరికైనా కష్టం వస్తే నేనున్నాను.. అధైర్యపడకండి అంటూ కొండంత అండగా నిలిచే ఒక పెద్ద దిక్కును తాము కోల్పోయామని వృద్ధులు, యువకులు కన్నీటి శోకంలో మునిగిపోయారు. ప్రతి ఇంటా యాదమ్మ తో ఉన్న అనుబంధాన్ని, ఆత్మీయ క్షణాలను గుర్తుచేసుకుంటూ ఊరి ప్రజలు శోకసంద్రంలో మునిగిపోయారు. ఆమె లేని అర్వణపల్లి గ్రామం వెలవెలబోతోంది.

గ్రామస్తుల కన్నీటి వీడ్కోలు!

యాదమ్మ భౌతికకాయాన్ని చూసి గ్రామస్తులంతా ఒక్కసారిగా కన్నీటి సముద్రమయ్యారు. వృద్ధులు, మహిళలు ఆమె పార్థివ దేహంపై పడి రోదించిన తీరు అక్కడున్న ప్రతి ఒక్కరి చేత కన్నీరు పెట్టించింది. ఊరి కోసం, చుట్టుపక్కల వారి కోసం ఎల్లప్పుడూ తపించే ఒక మంచి మనసున్న మనిషిని భగవంతుడు ఇంత త్వరగా తీసుకెళ్లిపోయాడేంటని పల్లె జనం ఆవేదన వ్యక్తం చేశారు. యాదమ్మ తో తమకున్న దశాబ్దాల అనుబంధాన్ని తలచుకుంటూ గ్రామ పెద్దలు సైతం కన్నీళ్లు ఆపుకోలేకపోయారు.

అంజలి ఘటించిన రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి!

సొంత గ్రామస్తురాలైన యాదమ్మ మరణవార్త తెలుసుకున్న రాజ్యసభ సభ్యులు వేం నరేందర్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. తన రాజకీయ, సామాజిక ప్రస్థానంలో గ్రామానికి చెందిన పెద్దలతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ ఆయన ఆవేదన చెందారు. వెంటనే అర్వణపల్లి గ్రామానికి చేరుకున్న ఆయన,యాదమ్మ పార్థివ దేహానికి పూలమాలలు వేసి భావోద్వేగంతో శ్రద్ధంజలి ఘటించారు. ఈ సందర్భంగా వేం నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. యాదమ్మ మరణం కేవలం గంధసిరి కుటుంబానికే కాదు, మన అర్వణపల్లి గ్రామానికి తీరని లోటు. అందరితో ఎంతో మర్యాదగా, ప్రేమగా ఉండే ఒక ఆత్మీయురాలిని మనం కోల్పోయాం అని అన్నారు. యాదమ్మ ఆత్మకు సంపూర్ణ శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థించారు. అనంతరం కన్నీరుమున్నీరవుతున్న ఆమె కుటుంబ సభ్యులను, భర్త వెంకన్నను ఆత్మీయంగా ఓదార్చి, ఆ కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని హామీ ఇస్తూ తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. యాదమ్మ అంతిమ యాత్రలో గ్రామస్తులు భారీ సంఖ్యలో పాల్గొని అశ్రునయనాలతో వీడ్కోలు పలికారు.

# జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో వయోవృద్ధుల వారోత్సవాలు





**భూపాలపల్లి, సెప్టెంబర్ 25:** అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం సందర్భంగా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో సెప్టెంబర్ 24 నుండి అక్టోబర్ 1వ తేదీ వరకు వయోవృద్ధుల వారోత్సవాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం ఐడీఓసీ కార్యాలయంలో వయోవృద్ధుల వారోత్సవాల పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... వయోవృద్ధుల సంక్షేమం, రక్షణ మరియు గౌరవప్రదమైన జీవనానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. తల్లిదండ్రులు మరియు వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం – 2007పై ప్రజలు, కుటుంబ సభ్యులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వయోవృద్ధుల హక్కులను పరిరక్షిస్తూ, వారికి అవసరమైన సహాయం, భద్రత, సంక్షేమ సేవలు అందేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. వయోవృద్ధులు తమ ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వయోవృద్ధుల పట్ల కుటుంబ సభ్యులు, సమాజం గౌరవం, బాధ్యతతో వ్యవహరించాలని పేర్కొన్నారు. వారోత్సవాల్లో భాగంగా వయోవృద్ధుల హక్కులు, ఆరోగ్యం, భద్రత, సామాజిక భద్రత, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చట్టపరమైన రక్షణపై వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జి. మల్లేశ్వరి, జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్, సంక్షేమ శాఖ జూనియర్ అసిస్టెంట్ అర్జున్, డే కేర్ సెంటర్ సూపరింటెండెంట్ కొలగూరి సంజీవరావు, సీనియర్ సిటీజన్స్ అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తాత్కాలిక "గెస్ట్ ఫ్యాకల్టీ" నియామకం కొరకు దరఖాస్తులు ఆహ్వానం

- ఐటిడిఏ పిఓ బి.రాహుల్



**భద్రాచలం/మన ప్రజావాణి (సెప్టెంబర్ 25):** 2026–27 విద్యా సంవత్సరం నాకు గాను, ఖమ్మం రీజియన్ లో గల గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో తాత్కాలిక ప్రతిపాదికన పనిచేయుటకు బోధన సిబ్బంది (గెస్ట్ ఫ్యాకల్టీ) కొరకై అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను కోరుతున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ శుక్రవారం రోజు ఒక ప్రకటనలో తెలిపారు. బోధన సిబ్బంది నియామకం పొందగోరు అభ్యర్థులు పీజీ నందు 55శాతంతో పాటు, నెట్/సెట్/పిహెచ్డిలలో ఏదైనా అర్హత కలిగి ఉండవలెనని, అట్టి అర్హతలు గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగలరని ఆయన అన్నారు.

ఖమ్మం రీజియన్ (ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు)లో గల ఖాళీల వివరాలు

మహిళలు : మైక్రో బయాలజీ :02

కావున అర్హత గల ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అభ్యర్థులు తమ దరఖాస్తులను నకలు విద్యార్హతల ధృవ పత్రములతో జతపరిచి, నేరుగా తేది: 26-09-2026 ఉదయం 10.00 గంటల నుండి, 28-09-2026 సాయంత్రం 05.00 గంటల వరకు వరకు ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయము (గురుకులం), ఐటీడీఏ భద్రాచలంనందు కార్యాలయ పనిదినాలలో మాత్రమే సమర్పించగలరని, అభ్యర్థులు సాధించిన అర్హత మార్కులు ఆధారంగా మాత్రమే ఎంపిక చేయబడునని, పైన చూపిన ఖాళీల సంఖ్యను తగ్గించుట పెంచుటకు, ఈ ప్రకటన పూర్తిగా రద్దుపరుచుటకు ప్రాజెక్టు అధికారి, ఐటిడిఏ, భద్రాచలం వారికి పూర్తి అధికారం కలదని ఆర్సిఓ గురుకులం అరుణ కుమారి తెలిపారు. మరిన్ని వివరములకు చరవాణి నెం. 9949723291 సంప్రదించాలని ఆమె కోరారు.

# ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

- ఏఐకేఎంఎస్ నాయకులు పుల్లెల సైదులు



**గరిడేపల్లి సెప్టెంబర్ 25 (ప్రజావాణి):** అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం నాయకులు పుల్లెల సైదులు పిలుపునిచ్చారు. గడ్డిపల్లి గ్రామంలో శుక్రవారం ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పుల్లెల సైదులు మాట్లాడుతూ ఖమ్మం పట్టణంలో ఈ నెల 28, 29, 30 తేదీల్లో ఏఐకేఎంఎస్ జాతీయ మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాసభల తొలిరోజైన 28వ తేదీన రైతులు, వ్యవసాయ కూలీలతో భారీ ప్రదర్శన నిర్వహించి అనంతరం బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. బహిరంగ సభలో జాతీయ నాయకుల ప్రసంగాలతో పాటు కళాకారుల కళారూపాలు ఉంటాయని తెలిపారు. దేశవ్యాప్తంగా రైతాంగం, వ్యవసాయ కూలీలు ఎదుర్కొంటున్న సమస్యలపై జాతీయ మహాసభల్లో విస్తృతంగా చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న రైతాంగ విధానాలపై చర్చించి, వాటికి వ్యతిరేకంగా భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. గతంలో నిర్వహించిన రైతాంగ ఉద్యమాలను సమీక్షించడంతో పాటు భవిష్యత్తులో రైతులు, వ్యవసాయ కూలీలు, సామాన్య ప్రజలను సంఘటితం చేసి చేపట్టాల్సిన పోరాటాలపై మహాసభల్లో నిర్ణయాలు తీసుకోనున్నట్లు తెలిపారు. అధిక సంఖ్యలో రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు పాల్గొని జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని పుల్లెల సైదులు కోరారు. ఈ కార్యక్రమంలో రేగట్టి అరవింద్, శివకృష్ణ, వెంకటరాములు, నర్సింగ్, నాగమణి, సరిత, కానుగు సాయిలు, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

# తాత్కాలిక "పార్ట్ టైం ఫ్యాకల్టీ" నియామకం కొరకు దరఖాస్తులు ఆహ్వానం

- ఐటీడీఏ పిఓ బి.రాహుల్



**భద్రాచలం/మన ప్రజావాణి (సెప్టెంబర్ 25):** 2026 27 విద్యా సంవత్సరంలకు గాను ఖమ్మం రీజియన్ లోగల గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాలలో తాత్కాలిక ప్రతిపాదికన పనిచేయుటకు బోధన సిబ్బంది (పార్ట్ టైమ్ ఫ్యాకల్టీ) కొరకై అర్హులైన గిరిజన అభ్యర్థుల నుండి దరఖాస్తులను కోరుతున్నట్లు ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ శుక్రవారం రోజు ఒక ప్రకటనలో తెలిపారు. బోధన సిబ్బంది నియామకం పొందగోరు అభ్యర్థులు పీజీ నందు 55శాతం మార్కులతో పాటు, ఏదైనా యూనివర్సిటీ నుండి బీఈడీ పూర్తి చేసి ఉండవలెనని, అట్టి అర్హతలుగల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోగలరని ఆయన అన్నారు.

ఖమ్మం రీజియన్ (ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలు)లో గల ఖాళీల వివరాలు

మహిళలు : జెఎల్ : తెలుగు-01, జెఎల్ జనరల్ : తెలుగు-01, జెఎల్ : గణితం-02, జెఎల్ : ఫిసిక్స్-01, పిజిటి : గణితం -01, మొత్తం = 05

అర్హత గల ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అభ్యర్థులు తమ దరఖాస్తులను నకలు విద్యార్హతల ధృవ పత్రములతో జత పరిచి, నేరుగా తేది: 26-09-2026. ఉదయం 10.00 గంటల నుండి, తేది:- 28-09-2026 సాయంత్రం 05.00 గంటల- వరకు ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయము (గురుకులం), ఐటీడీఏ భద్రాచలం నందు కార్యాలయ పనిదినాలలో మాత్రమే సమర్పించగలరని, అభ్యర్థులు సాధించిన అర్హత మార్కులు ఆధారంగా, డెమో ద్వారా మాత్రమే ఎంపిక చేయబడునని ఆయన అన్నారు. పైన చూపిన ఖాళీల సంఖ్యను తగ్గించుట, పెంచుటకు ఈ ప్రకటన పూర్తిగా రద్దుపరుచుటకు ప్రాజెక్టు అధికారి, ఐటిడిఏ, భద్రాచలం వారికి పూర్తి అధికారం ఆర్సిఓ గురుకులం అరుణ కుమారి తెలిపారు. ఇతర వివరములకు చరవాణి నెం. 8500136628 సంప్రదించాలని అన్నారు. గమనిక: మహిళ విద్యాలయంలో మహిళలను మాత్రమే ప్రాధాన్యత ఇవ్వబడునని ఆమె అన్నారు.

# సుందిల్ల బ్యారేజ్ దిగువన వరద ముప్పు..

- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- అక్టోబర్ చివరి వరకు హెచ్చరికలు అమల్లో..
- చేపల వేట, పశువుల మేతకు వెళ్లొద్దు



**మంథని నియోజకవర్గ ప్రతినిధి, సెప్టెంబర్ 25, ప్రజావాణి:** గోదావరి నదికి వరద ప్రవాహం కొనసాగుతున్న నేపథ్యంలో పార్వతీ (సుందిల్ల) బ్యారేజ్ దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇరిగేషన్ శాఖ అధికారులు హెచ్చరించారు. వర్షాల కారణంగా ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉందని, సుందిల్ల బ్యారేజ్ గేట్లన్నీ ఎత్తి ఉంచినందున దిగువ ప్రాంతాల్లో ఎప్పుడైనా వరద నీరు వచ్చే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

## అశ్వారావుపేటలో అట్టహాసంగా జిల్లా స్థాయి అండర్-20 బాలికల కబడ్డీ పోటీలు.పోస్టర్ ఆవిష్కరణ!






**అశ్వారావుపేట, సెప్టెంబర్ 25 (మన సమగ్ర ప్రజావాణి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ప్రత్యేక సహకారంతో నియోజకవర్గ కేంద్రంలో జూనియర్ అండర్–20 బాలికల జిల్లా స్థాయి కబడ్డీ పోటీలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. వచ్చే అక్టోబర్ 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు మూడు రోజుల పాటు ఈ క్రీడా సంబరాలు కొనసాగనున్నట్లు నిర్వాహకులు బుధవారం వెల్లడించారు.గ్రామీణ మరియు గిరిజన ప్రాంతాల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి, యువతలో క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఈ పోటీలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉత్తమ జట్లు ఈ పోటీల్లో పాల్గొననున్నాయి. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు భవిష్యత్తులో రాష్ట్ర మరియు జాతీయ స్థాయిలో రాణించడానికి మెరుగైన అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రం, మండల అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ, జిల్లా నాయకులు తుమ్మ రాంబాబు, కోలా లక్ష్మీనారాయణ, కౌన్సిలర్లు మిండా హరి బాబు, అల్లాడి రామారావు, నార్లపాటి దివాకర్, వెంకన్న బాబు, సర్పంచ్ కొరష రాజేష్, సత్తిబాబు, దండబత్తుల రమేష్, వెలుపుల సత్యనారాయణ తదితర ముఖ్య నేతలు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## హబ్సిగూడ లో గణ నాధుడి సేవలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్





**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సెప్టెంబర్ 25 గాడిపల్లి పరమేశ్వర్ జిల్లా ప్రతినిధి (ప్రజావాణి )** హబ్సిగూడ గణనాథుడి సేవలో అసెంబ్లీ స్పీకర్ హబ్సిగూడా ప్రధాన రహదారిపై జువెలరీ షాప్ వారు ఏర్పాటు చేసిన వినాయక మండపంలో వినాయక చవితి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, ఉప్పల్ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై గణనాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు సుమారు 5వేల మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేపడుతున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని ప్రసాదాన్ని స్వీకరిస్తున్నారు.ఈ కార్యక్రమంలో దీ=ూ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## కుటుంబ కలహాలతో వ్యక్తి మృతి

**రాయపోల్. సెప్టెంబర్ 25 (ప్రజావాణి)..**కుటుంబ సమస్యలతో మనస్థాపానికి గురైన వ్యక్తి మృతి చెందిన సంఘటన దౌల్తాబాద్ మండలం ఇందుప్రియల్ గ్రామంలో చోటుచేసుకుంది. దౌల్తాబాద్ ఎస్సై అరుణ్ కుమార్ తెలిపిన ప్రకారం హిందూప్రియ గ్రామానికి చెందిన మరికంటి యాదయ్య 62 తండ్రి నారాయణ యాదయ్యకు ఇద్దరు కుమారులు ఉన్నారు పెద్ద కుమారుడు స్వామి దాంపత్య జీవితానికి సంబంధించిన కుటుంబ సమస్యల నేపథ్యంలో యాదయ్య వీర మనస్థాపానికి గురైనట్లు పోలీసులు తెలిపారు ఈ క్రమంలో యాదయ్య మృతి చెందారు యాదయ్య భార్య పీజాది మేరకు కేసు నమోదు చేసి డైలాగ్ చేసినట్లు ఎస్సై అరుణ్ కుమార్ తెలిపారు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

## ట్రాక్టర్ లో ఉయ్యాల ఏర్పాటు - నిమజ్జనంలో ప్రత్యేక ఆకర్షణగా బాల వినాయకుడు



**రాయికల్, సెప్టెంబర్ 25 (ప్రజావాణి):** రాయికల్ మండలం చెర్లకొండాపూర్ గ్రామంలో లయన్స్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన వినాయక నిమజ్జనం కార్యక్రమం వినూత్నంగా సాగింది. ట్రాక్టర్ లో ప్రత్యేకంగా ఉయ్యాలను ఏర్పాటు చేసి అందులో బాల వినాయకుడి విగ్రహాన్ని ఉంచి నిమజ్జన శోభయాత్ర నిర్వహించడం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.బంగారు ఉయ్యాలలో చిన్నారి గణనాథుడు ఊగుతున్నట్లుగా విగ్రహాన్ని తీర్చిదిద్ది ట్రాక్టర్ ట్రాలీలో అందంగా అలంకరించారు. చుట్టూ రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో ముస్తాబు చేసి గ్రామ పురవీధుల గుండా మేళతాళాలు, డీజే మోతలు, కోలాట నృత్యాలు,గణపతి బప్పా మోరియా నినాదాల మధ్య ఊరేగించారు. దారిపొడవునా మహిళలు హారతులు పట్టి గణనాథుడికి వీడ్కోలు పలికారు. అనంతరం భక్తిశ్రద్ధలతో వినాయకుడి నిమజ్జనం ఘనంగా నిర్వహించారు.నవరాత్రులు పొడవునా ప్రత్యేక పూజలు, అన్నదానం, భజన కార్యక్రమాలు నిర్వహించామని, భిన్నంగా ఆలోచించి ట్రాక్టర్ లో ఉయ్యాల వినాయకుడి కాన్సెప్ట్ తో నిమజ్జనం నిర్వహించామని లయన్స్ యూత్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ యూత్ సభ్యులు, గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## కోదాడ మున్సిపాలిటీలో 210 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ..

- వార్డుల వారీగా మొదటి విడతలో మంజూరు పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి..





**కోదాడ, సెప్టెంబర్ 25/ ప్రజావాణి** కోదాడ మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మొదటి విడతగా మంజూరైన 210 మంది లబ్ధిదారులకు మంజూరు పత్రాలను కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి శుక్రవారం కోదాడ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో వార్డుల వారీగా పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇంటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ జిల్లా బాలుర జూనియర్ కబడ్డీ జట్టుకు క్రీడా దుస్తులు అందించిన

- వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్,, పుల్లూరి శ్రీనివాస్ గౌడ్




**సెప్టెంబర్ 25 ప్రజావాణి న్యూస్/సంగెం** వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత పది రోజులుగా సైనిక్ స్కూల్ అశోక్ నగర్ లో కొనసాగుతున్న జూనియర్ బాలుర కబడ్డీ శిక్షణ శిబిరంలో వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్లా ఖాన్ అధ్యక్షతన నిర్వహించిన క్రీడా దుస్తుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ప్రొఫెసర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎస్సార్ యూనివర్సిటీ వరంగల్ డాక్టర్,, పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ విచ్చేసి వరంగల్ జిల్లా నుండి ప్రాతినిధ్యం వహిస్తూ తెలంగాణ రాష్ట్ర స్థాయి బాలుర కబడ్డీ పోటీల్లో పాల్గొనే వరంగల్ జిల్లా బాలుర కబడ్డీ జట్టుకు క్రీడా దుస్తులు అందించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ పుల్లూరి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ అక్టోబర్ 1వ తేదీ నుండి 4వ తేదీ వరకు రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ లో జరిగే రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో వరంగల్ జిల్లా జట్టు విజయం సాధించాలని క్రీడాకారులు క్రమశిక్షణతో తమ నైపుణ్యాలను కనబరిచి తెలంగాణ రాష్ట్రం నుండి జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనాలని, క్రీడాకారుల అభివృద్ధికి ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తానని, కబడ్డీ క్రీడ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్లా ఖాన్ మాట్లాడుతూ కబడ్డీ శిక్షణ శిబిరాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకొని రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరచాలని వరంగల్ జిల్లాకు పేరు ప్రఖ్యాతలు వచ్చే విధంగా కృషి చేయాలని వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ నుండి క్రీడాకారులను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు.ఈ యొక్క కార్యక్రమ ప్రత్యేక అతిథులు సైనిక్ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపల్ అనూష, సైనిక్ జూనియర్ కళాశాల వైస్ ప్రిన్సిపల్, సాయిలు మాట్లాడుతూ వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సైనిక్ స్కూల్లో కబడ్డీ క్యాంపు నిర్వహించడం ఆనందదాయకమని, క్రీడాకారులు ప్రతిరోజు క్రమశిక్షణతో శిక్షణ శిబిరంలో పాల్గొంటున్నారని రాష్ట్రస్థాయి పోటీలో వరంగల్ జిల్లా జట్టు విజయం సాధించాలని కోరారు..ఈ యొక్క కార్యక్రమంలో వరంగల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ కోశాధికారి ముఖర్జీ ,సహాయ కార్యదర్శి కక్కెర్ల మల్లికార్జున్ గౌడ్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రవీందర్, నర్సంపేట స్టేడియం ఇన్చార్జి కబడ్డీ కోచ్ యాట రవికుమార్ ముదిరాజ్, సైనిక్ స్కూల్ లెఫ్టినెంట్ కల్నల్ కిరణ్, సైనిక్ స్కూల్ స్కూల్ ఉపాధ్యాయ బృందం మహేష్,తిరుపతి కబడ్డీ క్రీడాకారులు తదితరులుపాల్గొన్నారు..

## నేటికీ స్వంత భవనంలేని వెంగంపేట గ్రామపంచాయతీ

- శిధిలావస్థలో ఉన్న ఫారెస్ట్ క్వార్టర్స్ కార్యాలయంలో గ్రామపంచాయతీ విధులు
- తీవ్రఇబ్బందులు ఎదురుకుంటున్న వెంగంపేట పాలకవర్గం, ప్రజలు
- సర్పంచ్ గుగులోత్ జవహర్





**గూడూరు మండల ప్రతినిధి:- సెప్టెంబర్ 25. (మన సమగ్ర ప్రజావాణి):-** మహబూబాబాద్ జిల్లా, గూడూరు మండల కేంద్రం పరిధిలోని వెంగంపేట గ్రామ పంచాయితీ ఏర్పడి దాదాపు 8సంవత్సరాల నుండి నేటి వరకు గ్రామ పంచాయితీకి స్వంత భవనం లేకపోవడంతో, గత పాలకవర్గం 5సంవత్సరాలు గ్రామంలోని ఒక ఇంటిని అద్దెకు తీసుకొని గ్రామ పంచాయితీ కార్యక్రమాలన్ని ఆ ఇంటి నుండే కొనసాగించేవారు. జనరల్ బాడీ, గ్రామసభ సమావేశాలు అందులో నిర్వహించేవాళ్ళమని, కానీ మండల పంచాయితీ రాజ్ అధికారుల ఆదేశాలమేరకు ప్రైవేట్ వ్యక్తులకు చెందిన భవనంలో గ్రామ పంచాయితీ కార్యాలయం విధి నిర్వహణలు కొనసాగించవద్దని ఆదేశాలు జారీ చేయడంతో, గత్యంతరం లేక వెంగంపేట గ్రామంలో శిధిలావస్థలో ఉన్న స్థానిక ఫారెస్ట్ క్వార్టర్ కార్యాలయం కాళిగా ఉండడంతో అందులోనే గ్రామ పంచాయితీ కార్యక్రమాలు కొనసాగిస్తున్నామని, గ్రామ పంచాయితీ కార్యాలయంలో జరగాల్సిన కార్యక్రమాలన్ని జనరల్ బాడీ, గ్రామసభ లాంటి సమావేశాలు, నిర్వహించడం, రికార్డుల నిర్వహణ, చాలా ఇబ్బందిగా ఉందని, కనీసం వాష్ రూమ్స్ కూడా లేకపోవడంతో పాలకవర్గం తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారని, వర్షాలతో ఎప్పుడు నేలమట్టం అవుతుందో తెలియని భవనంలో గ్రామ పంచాయతీ పరిపాలన కొనసాగించడం, సమావేశాలు నిర్వహించడం, దినదిన గండంగా ఉందని, మా గ్రామసమస్యను స్థానిక పంచాయితీ రాజ్ అధికారులు, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క దృష్టికి తీసుకెల్లి వెంగంపేట గ్రామ పంచాయితీ భవనం మంజూరు అయ్యేవిధంగా సహకరించగలరని, వెంగంపేట గ్రామ సర్పంచ్ గుగులోత్ జవహర్, పాలకవర్గం విజ్ఞప్తి చేసారు.

## చెరువు నిండింది.."రావిరాల"మురిసింది

- పూజలు చేసిన సర్పంచి కళ్యాణి యాకాంతం





**ప్రజావాణి,నెల్లికుదురు:** తెగిన చెరువు కట్టకు మరమ్మతులు చేయడంతో నిండుకుండలా నీటితో నిండింది. దీంతో రైతుల ముఖాల్లో చిరునవ్వు తొనికి సలాడుతోంది. గ్రామ ప్రజల్లో ఆనందం వెల్లి విరుస్తోంది. మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం రావిరాల గ్రామం చెరువు గత రెండు సంవత్సరాల క్రితం అప్పటి భారీ వర్షాలకు అర్ధరాత్రి తెగిపోయింది. దీంతో రెండు సంవత్సరాలుగా గ్రామంలో కరువు విలయతాండవం చేసింది. వేసవిలో తెగిన కట్టకు మరమ్మతులు చేయడంతో నిన్న మొన్న కురిసిన వర్షాలకు చెరువు నీటితో నిండి నిండికుండలా మారింది. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పూజలు చేసిన సర్పంచి కళ్యాణి యాకాంతం

కరువు తీరా వర్షం కురిసి చెరువు నిండడంతో గ్రామ సర్పంచి కత్తుల కళ్యాణి యాకాంతం, ఉపసర్పంచి తరుణ్, వార్డు సభ్యులతో సహా గ్రామస్తులతో కలిసి శుక్రవారం చెరువు వద్దకు వెళ్లి చెరువు నీటికి జల పూజలు చేశారు. ఈ సందర్భంగా పసుపు కుంకుమలు సమర్పించి గంగాదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడిపంటలు పండి గ్రామం సుభిక్షంగా ఉండాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే డా.భూక్య మురళి నాయక్ ప్రత్యేక కృషితో తెగిన చెరువు కట్టకు మరమ్మతులు చేయడంతో మళ్లీ చెరువు నీటితో నిండుకుండలా నిండి పూర్వవైభవం చేకూరిందన్నారు. దీంతో రైతుల, గ్రామస్తుల నీటి కష్టాలు తీరాయని ఎమ్మెల్యే కు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలోవార్డు సభ్యులు తాళ్లపల్లి సాగర్, ఆకుల సుప్రియకృష్ణ,గుండెపాక స్వప్న మల్లేష్ కడారి శ్రీకాంత్,కడారి వెంకటమల్లు,పబ్బ సూర్యప్రసాద్,కత్తుల కుమార్,రాస అనూష యాకిరెడ్డి,అక్కర నాగరాణి ప్రసాద్ పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆ పలకరింపు ఇక వినిపించదు.. అర్పణపల్లి కన్నీటి సంద్రమైంది!

- 'ఏమ్మా.. బాగున్నావా? తిన్నావా?' అని పలకరించిన ఆత్మీయ గొంతు మూగబోయింది!
- మంచితనంతో ఊరి మనసుల్లో చోటు సంపాదించిన గంధసిరి యాదమ్మకు కన్నీటి వీడ్కోలు!
- యాదమ్మ లాంటి ఆత్మీయురాలిని కోల్పోవడం గ్రామానికి తీరని లోటు..
- మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్!





**కేసముద్రం సెప్టెంబర్ 25,ప్రజావాణి.**నిన్నటి వరకు ఆప్యాయంగా పలకరించిన గొంతు.. నేడు నిశ్శబ్దమైంది.నిన్నటి వరకు కనిపించిన ఆత్మీయ చిరునవ్వు.. ఇక జ్ఞాపకమైంది.అర్పణపల్లి గ్రామంలో ప్రతి ఒక్కరినీ పేరుపేరునా పలకరిస్తూ, ఆప్యాయతను పంచిన గంధసిరి యాదమ్మ (భర్త వెంకన్న ) భార్య అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామం విషాదంలో మునిగిపోయింది.

ఒక్క పలకరింపుతో బంధాన్ని పెంచుకున్న మనిషి..!

'ఏమ్మా.. బాగున్నావా? తిన్నావా?' అంటూ పలకరించడం యాదమ్మకు అలవాటు మాత్రమే కాదు.. ఎదుటివారిపై ఉన్న ఆప్యాయతకు నిదర్శనం. వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరితో కలిసిమెలిసి ఉండే ఆమె స్వభావం గ్రామస్తుల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించింది. కష్టాల్లో ఉన్నవారిని పలకరించడం, బాధలో ఉన్నవారికి ధైర్యం చెప్పడం ఆమె వ్యక్తిత్వంలో భాగమని గ్రామస్తులు గుర్తుచేసుకున్నారు.ఇప్పుడు అదే గ్రామంలో ఆమెను వెతుక్కుంటూ చూపులు తిరుగుతున్నాయి. కానీ ఎక్కడా యాదమ్మ కనిపించదు. ఆమె పలకరింపు వినిపించదు. మిగిలింది ఆమెతో కలిసి గడిపిన జ్ఞాపకాలే. ఈ దృశ్యం గ్రామస్తులను తీవ్రంగా కలచివేసింది.

మంచి మనసున్న వ్యక్తిని కోల్పోయాం!

యాదమ్మ మృతివార్త తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ అర్పణపల్లికి చేరుకుని పార్థివదేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ.. యాదమ్మ మృతి అత్యంత బాధాకరమని, ప్రతి ఒక్కరితో ఆప్యాయంగా మెలుగుతూ మంచి పేరు సంపాదించుకున్న ఆమెను కోల్పోవడం గ్రామానికి తీరని లోటని అన్నారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. యాదమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.యాదమ్మ అంతిమయాత్రకు గ్రామస్తులు, బంధువులు, కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆప్యాయంగా పలకరించిన ఆత్మీయురాలికి చివరిసారిగా కన్నీటి వీడ్కోలు పలికారు. ఆమెను తలుచుకుంటూ పలువురు భావోద్వేగానికి లోనయ్యారు.మనిషి జీవితం ఎంతకాలం అన్నది కాదు.. ఎంతమంది మనసుల్లో చోటు సంపాదించాడన్నదే ముఖ్యమని యాదమ్మ జీవితం మరోసారి గుర్తుచేసింది. ఆమె లేకపోవడం కుటుంబానికే కాదు.. ఆప్యాయతను కోల్పోయిన అర్పణపల్లి గ్రామానికీ తీరని లోటుగా మిగిలి పోయిందంటున్నారు

# మట్టేవాడ గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల ఆకస్మిక తనిఖీ

● మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్







**గూడూరు మండల ప్రతినిధి:- సెప్టెంబర్ 25. (మన సమగ్ర ప్రజావాణి):-** మహబూబాబాద్ జిల్లా, శుక్రవారం రోజున జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ గూడూరు మండల కేంద్రం పరిధిలోని మట్టేవాడ గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ గూడూరు మండలం, మట్టేవాడ గ్రామంలో ఉన్నా గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల (బాలురు) ఆకస్మికంగా తనిఖీ చేసి, పిల్లలకు అందిస్తున్న విద్యా బోధనలు, డైట్ మెనూ, యూనిఫార్మ్, టెస్ట్ బుక్కు, తదితర వివరాలను పిల్లలను అడిగి తెలుసుకుని, స్వయంగా పరిశీలించి పిల్లలకు యూనిఫామ్ లు అందజేశారు. పిల్లలతో మాట్లాడుతూ.. వారి యొక్క విద్య సామర్థ్యాలను పరిశీలించారు. పిల్లలకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, పక్కాగా డైట్ మెనూ పాటించాలని, క్రమం తప్పకుండా షెడ్యూల్ ప్రకారం వైద్య పరీక్షలు పిల్లలకు, భోజనం సిద్ధం చేసే సిబ్బందికి నిర్వహించాలని, సిబ్బంది, ఉపాధ్యాయులు, పిల్లల హాజరు వివరాలను వంద శాతం నమోదు అయ్యేవిధంగా చూడాలని, టెస్ట్ బుక్కులు, యూనిఫార్ములు అందించాలని, ఇంగ్లీష్ భాష తోపాటు ఇతర సబ్జెక్టులపై క్లుప్తంగా అర్థమయ్యే విధంగా పిల్లలకు డిజిటల్ తరగతులను నిర్వహించాలని, పిల్లలకు అందించే ఆహారం, వసతి,సౌకర్యాలపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట గిరిజన సంక్షేమశాఖ అధికారి దేశీ రామ్ నాయక్, గూడూరు తహసిల్దార్ నిమ్మతోట నాగ భవాని, సంబంధిత అధికారులు ఉన్నారు.

# సాయి భగవాన్ కాలనీలో ఘనంగా గణనాథుడి ఉత్సవాలు!

- 17వసారి కొలువుదీరిన గణపయ్య..
- ఎమ్మెల్సీ అంజిరెడ్డి, పలువు రు ప్రముఖుల దర్శనం
- భక్తులకు మహా అన్నదానం



**బీరంగూడ, సెప్టెంబర్ 25 (ప్రజావాణి):** భక్తి సందడి.. ఆధ్యాత్మిక శోభ.. సేవా కార్యక్రమాలతో బీరంగూడ డివిజన్ పరిధిలోని సాయి భగవాన్ కాలనీ గణేశ్ ఉత్సవాలతో కళకళలాడుతోంది. శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వరుసగా 17వసారి గణనాథుడిని ప్రతిష్ఠించి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, ఉత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.ఏటా సంప్రదాయబద్ధంగా వినాయకుడిని ప్రతిష్ఠిస్తూ ఉత్సవాలను నిర్వహిస్తున్న కమిటీ.. ఈ ఏడాది కూడా ఘనంగా ఏర్పాట్లు చేసింది. ఉత్సవాల్లో భాగంగా ఎమ్మెల్సీ అంజిరెడ్డితో పాటు పలువురు ప్రముఖులు గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.గణపయ్య దర్శనానికి తరలివచ్చిన భక్తుల కోసం శ్రీ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పెద్ద సంఖ్యలో కాలనీ వాసులు, భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహగౌడ్, మాజీ కౌన్సిలర్ అనిరుద్‌రెడ్డి, కొల్లూరు మల్లేష్, అనిల్‌కుమార్, బోయిని బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

మహా అన్నదాన కార్యక్రమం రాజశేఖర్, మోహన్, శంకర్, కృష్ణగౌడ్, శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, వీరేందర్, సతీష్, సాగర్, సత్యనారాయణరెడ్డి, సత్యనారాయణ, రాజు, ఇందుశేఖర్‌రెడ్డి, సంజీవ్, విట్టల్, సోమశేఖర్, కోటిరెడ్డి, రవీందర్‌రెడ్డి, రాజ్, దీపక్‌సింగ్, సత్యనారాయణ, శరత్, భాస్కర్‌రెడ్డి, లక్ష్మణ్, నరసింహారెడ్డి తదితరుల ఆధ్వర్యంలో కొనసాగింది.

# జంక్ ఫుడ్ తో చిన్నారుల ఆరోగ్యానికి ముప్పు



**రాయికల్, సెప్టెంబర్ 25 (ప్రజావాణి)** చిన్నారులకు అమృతం లాంటి పోషకాహారం అందించాల్సిన తల్లిదండ్రులు నోరూరించే జంక్ ఫుడ్స్ కు అలవాటు చేయడంతో పిల్లలు అనారోగ్యాల బారిన పడుతున్నారు. చిప్స్, కుర్కురే, బర్గర్లు, పిజ్జాలు, కూల్ డ్రింక్స్, రంగురంగుల చాక్లెట్లు తినిపించడం ఫ్యాషన్ గా మారింది.వైద్యుల హెచ్చరిక ప్రకారం జంక్ ఫుడ్ లో అధికంగా ఉండే నూనె, ఉప్పు, చక్కెర,మైదా,రసాయనాలుపిల్లల్లో చిన్న వయసులోనే ఊబకాయం, మధుమేహం, దంతక్షయం, జీర్ణ సమస్యలు, రక్తహీనతకు దారితీస్తున్నాయి. దీంతో బడికి వెళ్లే పిల్లల్లో ఆకలి లేకపోవడం, నీరసం, ఏకాగ్రత లోపం, తరచూ జ్వరాల బారిన పడటం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. పోషణ మాసం వేడుకల్లో అంగన్వాడీలు,వైద్యులు ఎంత అవగాహన కల్పిస్తున్నా తల్లిదండ్రుల్లో మార్పు రావడం లేదు.మార్కెట్ ధరలు పెరిగాయని సాకు చెప్పకుండా ఇంటి పెరటిలోనే తోటకూర, మునగాకు, గోంగూర, పాలకూర వంటి ఆకుకూరలు పండించుకుని పిల్లలకు పెడితే ఐరన్, విటమిన్లు పుష్కలంగా అందుతాయని పోషకాహార నిపుణులు సూచిస్తున్నారు. ప్యాకెట్ ఫుడ్ కు బదులు రాగిజావ, పప్పన్నం, సద్దన్నం, కూరగాయలతో కూడిన ఇంటి భోజనం పెడితేనే పిల్లలు బలంగా ఎదుగుతారని చెబుతున్నారు. తల్లిదండ్రులు పిల్లల మొండితనానికి తలొగ్గి జంక్ ఫుడ్ కొనివ్వడం మాని, ఇప్పటికైనా పోషకాహారంపై దృష్టి పెట్టాలని, లేకుంటే భవిష్యత్తులో పెద్ద మూల్యం చెల్లించుకోక తప్పదని వైద్యులు హెచ్చరిస్తున్నారు. అంతేకాకుండా ఫుడ్ సేఫ్టీ అధికారులు జంక్ ఫుడ్స్ ను యథేచ్ఛగా విక్రయిస్తున్న దుకాణాల్లో తనిఖీలు చేసి చిన్నారుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

# అశ్వారావుపేటలో రాష్ట్ర స్థాయి అండర్-20 కబడ్డీ పోటీల వాల్ పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే జారె



**అశ్వారావుపేట, ప్రజావాణి న్యూస్, సెప్టెంబర్ 25:** అశ్వారావుపేట భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి జూనియర్ అండర్-20 బాలికల కబడ్డీ పోటీలకు బంధించిన వాల్ పోస్టర్‌ను శుక్రవారం అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో ప్రముఖులు ఆవిష్కరించారు.భద్రాద్రి కొత్తగూడెం కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సహకారంతో ఈ కబడ్డీ పోటీలను అక్టోబర్ 10వ తేదీ నుంచి 12వ తేదీ వరకు మూడు రోజుల పాటు అశ్వారావుపేటలో నిర్వహించనున్నారు. 33 జిల్లాల అండర్-20 బాలికల కబడ్డీ క్రీడాకారులు తమ ప్రతిభను ప్రదర్శించేందుకు ఈ పోటీలు వేదికగా నిలవనున్నాయి.గ్రామీణ గిరిజన ప్రాంతాల్లోని యువ క్రీడాకారులను ప్రోత్సహించడం వారిలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి రాష్ట్ర స్థాయిలో రాణించేలా అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కబడ్డీ తదితర క్రీడల ద్వారా యువతలో శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ జట్టు స్ఫూర్తి పట్టుదల పెంపొందుతాయని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ తెలిపారు.అశ్వారావుపేట నియోజకవర్గంలో క్రీడా రంగానికి ప్రోత్సాహం అందించడంతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులకు అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు అక్టోబర్ 10 నుంచి 12 వరకు మూడు రోజుల పాటు జరగనున్న ఈ పోటీలను విజయవంతం చేసేందుకు కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు క్రీడాకారులు, కోచ్‌లు క్రీడాభిమానులు సహకరించాలని కోరారు వాల్ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో అశ్వారావుపేట మండల అధ్యక్షుడు చిన్నంశెట్టి సత్యనారాయణ , మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్ బాబు , ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవల్లి వీరభద్రరావు , జిల్లా PCC సభ్యులు తుమ్మా రాంబాబు, కోలా లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా పోషణ మాసం వేడుకలు



**రాయికల్, సెప్టెంబర్ 25 (ప్రజావాణి):** పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం సాధ్యమని, ప్రతి ఒక్కరూ సమతుల్య ఆహారం తీసుకోవాలని సూచిస్తూ రాయికల్ మున్సిపల్ పరిధిలోని 2, 3, 6వ వార్డులు, భూపతిపూర్ గ్రామంలో పోషణ మాసం వేడుకలను ఘనంగా నిర్వహించారు.రాయికల్ మున్సిపల్ పరిధిలోని 2, 3వ వార్డులోని 1వ అంగన్వాడీ సెంటర్ లో కౌన్సిలర్ భూక్య రాకేష్ నాయక్ అధ్యక్షతన వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆకుకూరలు, కూరగాయలు, పప్పు దినుసుల్లో పోషక విలువలు అధికంగా ఉంటాయని, ముఖ్యంగా మునగాకులో ఐరన్ శాతం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. గర్భిణీలు, బాలింతలు, పిల్లలు ప్రతిరోజూ సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని సూచించారు. తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించి, బ్రెస్ట్ ఫీడింగ్ పై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు ఏ.సుజాత, ఎస్.రాజేశ్వరి, గర్భిణీలు, బాలింతలు, తల్లులు, ప్రీ-స్కూల్ పిల్లలు పాల్గొన్నారు. 6వ వార్డులోని 8వ అంగన్వాడీ కేంద్రంలో కౌన్సిలర్ వేముల మౌనిక రాము ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నవజాత శిశువుల సంరక్షణపై తల్లులకు సూచనలు చేశారు. పుట్టిన వెంటనే తల్లిపాలు అందించాలని, బిడ్డను ఎత్తుకునే ముందు చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని, బిడ్డ ఏడ్చిన ప్రతిసారి పాలు పట్టించాలని తెలిపారు. పిల్లలను అంగన్వాడీ కేంద్రాలకు పంపడం ద్వారా ఆటపాటలతో కూడిన విద్య, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై అవగాహన కలుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు పద్మ, ఉమాదేవి, రమాదేవి, ఆయమ్మ సుభద్ర తదితరులు పాల్గొన్నారు.భూపతిపూర్ 2వ అంగన్వాడీ కేంద్రంలో సర్పంచ్ గుర్రం భావన-మహేందర్, కార్యదర్శి ఆదిత్య రాజు పాల్గొని గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కల్పించారు. గర్భధారణ సమయంలో, ప్రసవానంతరం సమతుల్య ఆహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డల ఆరోగ్యం బాగుంటుందని, పరిశుభ్రత పాటించడం, సమయానికి టీకాలు వేయించడం, రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. అనంతరం ఐదు నెలల గర్భిణీకి శ్రీమంతం నిర్వహించి, పోషణ ప్రతిజ్ఞ చేయించారు.

# భక్తి.. అభిమానం.. పాలన

● ఒకే ఫ్రేమ్‌లో మూడు భావాలు.. ఆకట్టుకుంటున్న అద్భుత దృశ్యం



**హైదరాబాద్, సెప్టెంబర్ 25 (ప్రజావాణి):** హైదరాబాద్ హుస్సేన్‌సాగర్‌లో వినాయక నిమజ్జన వేళ కెమెరాకు చిక్కిన ఓ అద్భుత దృశ్యం చూపరులను ఆకట్టుకుంటోంది. ఒకే ఫొటోలో భక్తి, అభిమానం, పాలనకు ప్రతీకలుగా కనిపిస్తున్న మూడు విభిన్న అంశాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

భక్తి:హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనం అవుతున్న వినాయక విగ్రహం భక్తికి ప్రతీకగా కనిపిస్తోంది. గణనాథుడిపై ప్రజలకు ఉన్న విశ్వాసం, ఆధ్యాత్మిక భావన ఈ దృశ్యంలో స్పష్టంగా ప్రతిబింబిస్తోంది. అభిమానం:వినాయకుడికి ఘనంగా వీడ్కోలు పలికేందుకు తరలివచ్చిన భక్తులు, నిమజ్జన వేడుకలో పాల్గొంటున్న ప్రజల సందడి అభిమానం, ఆప్యాయతకు ప్రతీకగా నిలుస్తోంది.పాలన:వినాయక నిమజ్జన దృశ్యానికి వెనుక భాగంలో కనిపిస్తున్న పరిపాలనా సౌధం ప్రజా పాలనకు ప్రతీకగా నిలుస్తోంది. ప్రజల భక్తి, అభిమానం మధ్యలో ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థ కూడా ఒకే ఫ్రేమ్‌లో కనిపించడం ఈ ఫొటోకు ప్రత్యేకతను తీసుకొచ్చింది.భక్తి.. అభిమానం.. పాలన.. ఈ మూడు భావాలను ఒకే ఫ్రేమ్‌లో ఆవిష్కరించిన ఈ అరుదైన దృశ్యం నేటి ప్రత్యేక ఫొటోగా నిలిచింది.

# పుట్టపహాడ్‌లో రూ. 51 వేలకు వినాయక లడ్డూ కైవసం.. దక్కించుకున్న మాజీ ఎంపీటీసీ చిల్ల వెంకన్న దంపతులు!



**పరిగి, సెప్టెంబర్ 25 (ప్రజావాణి):** కులకచర్ల మండల పరిధిలోని పుట్టపహాడ్ గ్రామంలో గణేష్ నిమజ్జనోత్సవాల సందర్భంగా నిర్వహించిన స్వామివారి లడ్డూ ప్రసాదం వేలంపాట భక్తుల జయజయధ్వానాల నడుమ అత్యంత ఉత్సాహంగా సాగింది. గ్రామంలోని 'హిందూ ఉత్సవ కమిటీ' ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వేలంపాటలో స్థానిక మాజీ ఎంపీటీసీ చిల్ల వెంకన్న, సుభద్ర దంపతులు హోరాహోరీ పోటీ నడుమ రూ. 51,000 వేలం పాడి లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకున్నారు. గ్రామంలో నిర్వహించే ఉత్సవాలకు వరుసగా మూడు సంవత్సరాలుగా వినాయక విగ్రహాన్ని స్వయంగా సమకూర్చి (దాతగా వ్యవహరించి) తన భక్తిభావాన్ని చాటుకుంటున్న చిల్ల వెంకన్న, ఈసారి లడ్డూ ప్రసాదాన్ని కూడా సొంతం చేసుకోవడం పట్ల గ్రామస్తులు, భక్తులు హర్షం వ్యక్తం చేశారు. విఘ్నేశ్వరుని కృపాకటాక్షాలతో గ్రామం సుభిక్షంగా, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా వెంకన్న దంపతులు ఆకాంక్షించారు.ఉత్సవాల విజయవంతానికి నిరంతరం తోడ్పడుతున్న దాత చిల్ల వెంకన్న దంపతులకు, సహకరించిన భక్తులకు హిందూ ఉత్సవ కమిటీ ప్రతినిధులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హిందూ ఉత్సవ కమిటీ అధ్యక్షులు, యువజన సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, గ్రామ పెద్దలు, నాయకులు, యువకులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ద

# పోక్సో కేసులో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష



**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజావాణి):-** ములుగు జిల్లా మంగపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన క్రైమ్ నం.146/2020, సెక్షన్ 376(అ), 366, 506 IPC మరియు POCSO Act సెక్షన్ 5 r/w 6 కింద నమోదైన కేసులో నిందితుడు మాతూరి రమేష్‌ను దోషిగా నిర్ధారిస్తూ ములుగు ప్రత్యేక పోక్సో కోర్టు తీర్పు వెలువరించింది.ఈ కేసులో ములుగు ప్రత్యేక పోక్సో కోర్టు-కమ్ ప్రిన్సిపల్ జిల్లా డ సెషన్స్ జడ్జి శ్రీమతి S.V.P. సూర్య చంద్రకళ తీర్పు వెలువరించారుఈ కేసులో నిందితుడికి లి20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షలితో పాటు రూ.8,500 జరిమానా, బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని కోర్టు ఆదేశించింది.ఈ కేసులో దర్యాప్తు అధికారులు గా అప్పటి ఏటూరునాగారం శరత్ చంద్ర పవార్ ఐపీస్ , గౌస్ ఆలం ఐపీస్ వ్యవహరించగా ఎస్సై శ్రీనివాస్ ఎఫ్ ఐ ఆర్ నమోదు చేశారు.ఈ కేసును చేదించడంలో ప్రస్తుత అధికారులైన ASP మానన్ భట్ IPS, C× సూర్యప్రకాశ్, ఎస్ ఐ టీ వి ఆర్ సూరి కోర్టు మానిటరింగ్ అధికారి DSP కిషోర్, కోర్టు లైజనింగ్ అధికారి ASI కుమారస్వామి, స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డి. రామ్‌సింగ్, జనులు ఖ. మౌనిక WPC-187, జీ. మంగీలాల్ PC-164 తదితరులు కీలకంగా పనిచేశారు.కేసు దర్యాప్తు, కోర్టు సమన్వయం మరియు ప్రాసిక్యూషన్‌లో సమిష్టిగా కృషి చేసిన ప్రతి ఒక్కరినీ ములుగు జిల్లా ఎస్పీ శ్రీ కేకన్ సుధీర్ రామనాథ్ ఐపీస్ అభినందించారు. కేసుల్లో నాణ్యమైన దర్యాప్తుతో పాటు బాధితులకు న్యాయం జరిగేలా పోలీసుఅధికారులు,సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ సూచించారు.

# రాజస్థాన్ స్వీట్ హౌస్ ప్రారంభించిన సంగెం సర్పంచ్



**సెప్టెంబర్ 25. ప్రభంజనం న్యూస్/సంగెం** వరంగల్ జిల్లా పరకాల నియోజకవర్గం సంగెం మండలంలోనీ సంగెం మండల కేంద్రంలోన, రాజస్థాన్ స్వీట్ హౌస్ సంగెం మండల పరిసర ప్రాంతాలైన వంటి రూరల్ రుచులతో కూడిన స్వీట్ షాపులు ఎంతో ప్రసిద్ధి చెందాయి.మన దగ్గరి రాజస్థాన్ స్వీట్ స్టాల్స్‌లో లభించే ప్రత్యేకమైన తినుబండారాలు వాటి విశేషాలు ఇక్కడ చూద్దాం మైదా పిండి నెయ్యి, చక్కెర పాకంతో తయారు చేస్తారు.ప్రత్యేకతముఖ్యంగా శ్రావణ మాసం, సంక్రాంతి, రక్షాబంధన్ పండగల సమయంలో దీనికి విపరీతమైన డిమాండ్ ఉంటుంది. దీనిపై బాదం, పిస్తా ముక్కలు చల్లటి రబ్రీ మలైవేసి వడ్డిస్తే ఆరుచే వేరు.కాలాకాండ్ మల్పువా ప్యూర్ మిల్క్ పాల కోవాతో చేసేఇక్కడి స్వీట్ హౌస్‌లలో ఎంతో తాజాగా నోట్లో వేస్తే కరిగిపోయేలాదొరుకుతుంది,అలాగే పిండిని నెయ్యిలో కాల్చి చక్కెర పాకంలో ముంచే మల్పువా కూడా చాలా ఫేమస్.రాజస్థానీ కచోరీ,సమోసా కేవలం తీపి పదార్థాలే కాకుండా,ఉల్లిపాయ కచోరీ, దాల్ కచోరీ వేడివేడి సమోసాలు కూడా ఇక్కడ లభిస్తాయి. పుదీనా చట్నీ,తీపి చట్నీలతో కలిపి ఇచ్చే ఈ సమోసాలరుచి అద్భుతంగా ఉంటుంది తెలంగాణలోని రాజస్థాన్ స్వీట్ హౌస్‌ల ప్రత్యేకతలు:స్వచ్ఛమైన నెయ్యి వాడకం: చాలా వరకు రాజస్థానీ స్వీట్లను సాంప్రదాయ పద్ధతిలో ఆవు నెయ్యి లేదా విధానంలో తయారు చేస్తారు. సరసమైన ధరలు,గ్రామీపట్టణ ప్రాంతాల ప్రజలందరికీ అందుబాటులో ఉండేలా తక్కువ ధరలకే నాణ్యమైన స్వీట్లు మిక్చర్ కారా అందిస్తారు.ఈ కార్యక్రమంలో వృక్షాల సంగెం గ్రామ పంచాయతీ వార్డ్ నెంబర్ సాగర్,సంగెం మాజీ సర్పంచ్ గుండేటి బాబు,సంగెం సొసైటీ డైరెక్టర్ కోడూరు సదయ్య, బిట్ల లక్ష్మణ్,రావుల ప్రభాకర్, పీర్ల లక్ష్మీనరసయ్య, ఎండిఖాజా పాషా, రొట్టె కొమ్మలు, కోడూరు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# 8 కిలోల గంజాయి పట్టివేత -- ఒకరి అరెస్ట్

- గూడూరు సబ్ ఇన్ - స్పెక్టర్ సిహెచ్. రమేష్ బాబు ఆధ్వర్యంలో



**గూడూరు మండల ప్రతినిధి:- సెప్టెంబర్ 25. (మన సమగ్ర ప్రజావాణి):–** మహబూబాబాద్ జిల్లా, శుక్రవారం రోజున సాయంత్రం గూడూరు సబ్ ఇన్ – స్పెక్టర్ సిహెచ్. రమేష్ బాబు సిబ్బందితో కలిసి, బ్రాహ్మణపల్లి వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో, ఒక వ్యక్తి ఆటో నుంచి దిగి అనుమానాస్పదంగా కనిపించడంతో అతని వద్ద తనిఖీలు నిర్వహించగా 8కిలోల గంజాయి లభించింది. పట్టుబడిన గంజాయి విలువ సుమారు అంచన విలువ 4,18,000/– రూపాయలు. విచారణలో సదరు వ్యక్తి ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని కొనుగోలు చేసి, బీదర్‌లో విక్రయించేందుకు తీసుకువెళ్తున్నట్లు వెల్లడించాడు. బ్రాహ్మణపల్లి వద్ద నిర్వహించిన వాహన తనిఖీల సందర్భంగా గంజాయితో అతడు పట్టుబడ్డాడు. ఈ ఘటనపై సదరు వ్యక్తిపై చట్టప్రకారం కేసు నమోదు చేసి, తదుపరి న్యాయస్థానంలో హాజరుపరిచి జైలుకు పంపించే చర్యలు చేపడుతున్నామని,అదేవిధంగా గంజాయిని రవాణా చేసే వారు, విక్రయించే వారు, కొనుగోలు చేసే వారు, వినియోగించే వారు, అక్రమంగా నిల్వ ఉంచే వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని, గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగం అలాగే అక్రమ నిల్వను అరికట్టేందుకు గూడూరు పోలీస్ శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తూ, చట్టపరమైన కఠిన చర్యలు చేపడుతుందని, గూడూరు పోలీస్ సర్కిల్ ఇన్ – స్పెక్టర్ వస్రా వినయ్ సిహెచ్. రమేష్ బాబు లు తెలిపారు.

# ముగిసిన గణనాధుల నిమజ్జనం

- భక్తి పారవశ్యంలో తేలియాడిన భక్తజనం,
- జననీరాజనం నడుమ ఊరేగిన విఘ్నేశ్వరుడు,
- శివా యూత్ ఆధ్వర్యంలో కోలాటల నడుమ గణేశునికి ఘనంగా వీడ్కోలు





**పెద్దవంగర: సెప్టెంబర్ 25 ప్రజావాణి**లోక నాయకుడైన గణపతి నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా మండల వ్యాప్తంగా నిర్వహించారు. గత 11 రోజులుగా విశేష పూజలు అందుకున్న గణేష్ నికి శుక్రవారంతో భక్తులు వీడ్కోలు చెప్పారు. వడ్డే కొత్తపల్లి గ్రామంలో శివ యూత్ ఆధ్వర్యంలో గణేష్ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా చివరి రోజు గణపతికి ఆడపడుచులకు కోలాటాల నడుమ అశేష భక్తజనంతో ప్రశాంతత వాతావరణంలో పురవీధుల్లో తిప్పుతూ అంగరంగ వైభవంగా గణపతి నిమజ్జన ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. అనంతరం గణపతిని గంగమ్మ ఒడికి చేర్చి మళ్లొచ్చే యేడుకి మళ్ళీరా గణపయ్య అంటూ ఎంతో భక్తి శ్రద్ధలతో వేడుకుంటామని, మీ దర్శన భాగ్యం అందరికీ కలగాలని వేడుకుంటూ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో మద్దెల సురేష్, బొల్లు వెంకన్న, మద్దెల వెంకన్న, ఓర్సు ఎల్లయ్య, తాటిపాముల సాయి, పల్లె రాజు పల్లె సాయి, సతీష్,మద్దెల సుజాత, బొల్లు శైలజ,మమత, తాటిపాముల రేణుక, ఓర్సు రేణుక, మహిళలు, యూత్ సభ్యులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# తాళ్లపల్లిలో ఘనంగా గణనాథుని నిమజ్జన వేడుకలు



**ఇల్లంతకుంట, సెప్టెంబర్ 25 (ప్రజావాణి)**రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో గణేశ్ ఉత్సవాల ఆరవ వార్షికోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జనం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. నవరాత్రుల పాటు పూజలందుకున్న గణనాథుని లడ్డూ వేలంపాటను ఉత్సాహంగా నిర్వహించగా, గ్రామానికి చెందిన అబ్బు నారాయణరెడ్డి–లత రూ.7 వేలతో లడ్డూను దక్కించుకున్నారు.ఈ యొక్క వేలంపాటలో భక్తులు,గ్రామస్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం గణనాథునికి ప్రత్యేక పూజలు నిర్వహించి నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టారు.

# జగన్ కు ప్రజలు బుద్ధి చెప్పినా ఏమీ మార్పు లేదు

- గురువులుగా భావించే టీచర్లను రోడ్డు మీదకు తెచ్చి వారి మనోభావాలను దెబ్బతీస్తున్నారు
- గతంలో జగన్ రెడ్డి ఉపాధ్యాయులను బ్రాందీ షాపుల వద్దా కాపలా ఉంచారు
- మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి



**అనంత పురం బ్యూరో సెప్టెంబర్ 25 ప్రజా వాణి** గురువులుగా భావించే ఉపాధ్యాయుల మనోభావాలను జగన్ రెడ్డి రోడ్డుమీదకు తెచ్చి వారిని అవమానిస్తున్నారని, గతంలో ఉపాధ్యాయులను బ్రాందీ షాపుల వద్ద కాపలా ఉండే విధంగా వ్యవహరించారని ప్రజలు సాధారణ ఎన్నికల్లో బుద్ధి చెప్పినా ఆయనలో ఎటువంటి మార్పు రాలేదని మార్కెట్ యార్డ్ చైర్ పర్సన్ బల్లా పల్లవి విమర్శించారు. అనంతపురం నగర సమీపంలో ఉన్న ఆమె కార్యాలయంలో మాట్లాడారు. గత 2024 సాధారణ ఎన్నికల్లో ప్రజలు ఆయనకు 11 సీట్లు మాత్రమే ఇచ్చారని కనీసం ఆయనకు ప్రతిపక్ష హోదా కూడా లేదని వచ్చే ఎన్నికల్లో జగన్కు సింగిల్ డిజిట్ కూడా రాదని ఎద్దేవా చేశారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని అయితే తెలుగుదేశం ప్రభుత్వంలో పేద విద్యార్థులు కష్టపడి రాత్రింబవళ్లు చదివి డీఎస్సీ ద్వారా వారు సెలెక్ట్ అయినా వారిని అడ్డుకుంటున్నారని ప్రశాంతంగా ప్లకార్డులు ప్రదర్శిస్తున్న స్పోర్ట్స్ కోటా టీచర్లు ఒకవైపు, రౌడీలు, గుండాలతో టీచర్లను బూతులు తిట్టిస్తూ రాళ్లు కర్రలు వాటర్ బాటిల్లతో దాడి చేయిస్తున్న గొడ్డలి పార్టీ నేతలు మరోవైపు ఎవరిది అరాచకం జగన్ అంటూ ప్రశ్నించారు. జగన్ రెడ్డికి వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్తారని ఆమె విమర్శించారు.

# రేకులతండాలో తప్పిన విద్యుత్ ప్రమాదం..

- గాలికి తెగి ఇంటి మీద పడ్డ మెయిన్ లైన్ వైర్లు

**ప్రజావాణి,ఇనుగుర్తి:** గాలి వర్షానికి విద్యుత్ మెయిన్ లైన్ వైర్లు తెగి ఇంటి మీద పడిన ఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం తారా సింగ్ తండా గ్రామపంచాయతీ పరిధిలోని రేకుల తండాలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. తండావాసులు వెంటనే అప్రమత్తమై ట్రాన్స్ఫార్మర్ వద్ద ఫీజు వైర్ ను కట్టేతో కొట్టి కట్ చేయడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే రేకుల తండాలోని బానోతు ఆలు ఇంటి పైనుంచి విద్యుత్ మెయిన్ లైన్ వైర్లు ఉన్నాయి.గురువారం రాత్రి గాలి వర్షానికి వైర్లు తెగి ఇంటిపై పడ్డాయి.దీంతో సంబంధిత ఇంటి వారు పాక్షికంగా విద్యుత్ షాక్కు గురయ్యారు. వెంటనే కేకలు వేయడంతో తండావాసులు అప్రమత్తమై సమీపంలోని ట్రాన్స్ఫార్మర్ వద్దకు పరుగున వెళ్లి ఫీజు వైర్లను కట్టెతో బలంగా కొట్టి కట్ చేశారు.విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో గిరిజనులు ఊపిరి పీల్చుకున్నారు.

కరెంటు అధికారులు పట్టించుకోవడం లేదు..



తండావాసి యాకూబ్



ఇంటి మీద నుంచి ఉన్న మెయిన్ లైన్ ను తొలగించాలని కరెంటు అధికారులు దృష్టికి పలుమార్లు తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని తండావాసి బానోతు యాకూబ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.మేం గుర్తించకపోతే సంబంధిత ఇంట్లోని కుటుంబం కరెంట్ షాక్ తో మృతి చెందే వారిని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ఆఫ్ చేద్దామన్నప్పటికీ ఆన్ ఆఫ్ స్విచ్ కూడా లేదని, తామే సమయస్ఫూర్తితో కర్రతో ఫీజులను కొట్టి తెంపామన్నారు తండాకు విద్యుత్ పునరుద్ధరణ కోసం ఫోన్ చేసినప్పటికీ రాలేదని, తామే వైరు జాయింట్ చేసి లైన్ బిగించిన తర్వాత కనెక్షన్ ఇచ్చారని తెలిపారు.గత రెండు మూడు మాసాల నుంచి తండాకు విద్యుత్ పోల్స్ వచ్చి ఉన్నప్పటికీ వాటిని ఉపయోగించి కొత్త లైన్లు ఏర్పాటు చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు.గత సర్పంచులు,ప్రస్తుత పాలకమండలి పట్టించుకోవడంలేదని చెప్పారు. వెంటనే తండాలో కొత్త విద్యుత్తు లైన్లు ఏర్పాటు చేసి గృహాలకు హాని కలగకుండా చూడాలని యాకూబ్‌తో పాటు తండావాసులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నీట మునిగిన శ్రీకాకుళం ఆర్టీస్ట్ కాంప్లెక్స్

- చిన్న పాటి వర్షానికి కాంప్లెక్స్ లో భారీ ఎత్తున నీరు

**పలాస ప్రజావాణి ప్రతినిధి** పాలకులు మారినా మారని మారని శ్రీకాకుళం ఆర్టీసీ కాంప్లెక్స్ తీరు మారలేదుకోట్ల రూపాయలు ఆదాయము ఇస్తున్న ప్రజలు కు న్యాయం చేయాల్సిన పాలకుల ఎందుకు న్యాయము చేయరని ఇక్కడ ప్రజలు కోరుతున్నారు. ముఖ్యంగా పలాస, ఇచ్ఛాపురం, పాలకొండ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఇక్కడ వర్షం వస్తె నీరు బారీగా చేరిపోయి ప్రయాణికులకు ఇక్కడ ఇబ్బందులకు గురి చేస్తున్నారు. ప్రభుత్వాలు మారినా శ్రీకాకుళం ఆర్టీసీ సముదాయము నీరుతో నిండి పోతుందని ప్రయాణికులు విచారము వ్యక్తం చేస్తున్నారు.
ఆర్టీసీ సముదాయ సమస్యను పరిష్కారము చేస్తానని కొత్త ఎమ్మెల్యే రెండు శంకర్ హామీ ఇచ్చారు
అధికారము లోకి వచ్చిన మూడేళ్ళు కావస్తున్న శ్రీకాకుళం ఆర్టీసీ బస్సు సముదాయము సమస్య పరిష్కారము చేస్తానని ఇచ్చిన హామీ అమలు కాలేదని ఇక్కడ చర్చ జరుగుతుంది.
రాజు వచ్చిన రెడ్డి వచ్చినా పల్లకి మోత తప్పలేదని ప్రభుత్వాలు మారాయి..పాలకులు మారారు కానీ శ్రీకాకుళం ఆర్టీసీ బస్సు సముదాయము సమస్య ఎందుకు మారలేదని ఇక్కడ ప్రజలు చర్చ జరుగుతుంది అసలు శ్రీకాకుళం జిల్లా కేంద్రము లోని ఆర్టీసీ బస్సు సముదాయము సమస్యను పరిష్కారము చేయాలని ఇక్కడ ప్రజలు కోరుతున్నారు..






# యువత భవితకు భరోసా... యువతే దేశ భవిష్యత్తు.. వారి కలలకు, లక్ష్యాలకు ప్రభుత్వం భరోసా

**అనంత పురం సెప్టెంబర్ 25 ప్రజా వాణి** అనంతపురం నగరంలోని రుద్రంపేట పంచాయతీ పరిధిలోని పి వి కె కె ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (అటానమస్) బాలాజీ ఫార్మసీ కాలేజీలో నిర్వహించిన "యువత భవితకు భరోసా" కార్యక్రమానికి అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ
ముఖ్య అతిథిగా హాజరయ్యారుఈ సందర్భంగా విద్యార్థుల భవిష్యత్తు, సమాజ అభివృద్ధిలో యువత పాత్ర, ప్రభుత్వం అందిస్తున్న విద్యా, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాల గురించి వివరించాను. విద్యార్థులకు అందుతున్న ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మ ఒడి తదితర పథకాల గురించి వివరించాను.
ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో యువత అభివృద్ధికి అనేక కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, ఎం ఎస్ ఎం ఈ రంగం ద్వారా యువత పారిశ్రామికవేత్తలుగా ఎదిగేందుకు విస్తృత అవకాశాలు కల్పిస్తున్నామని తెలియజేశాను. రాష్ట్ర విద్య, ఐటీ యువత భవిష్యత్తుకు ప్రాధాన్యతనిస్తూ గౌరవ మంత్రి శ్రీ నారా లోకేష్ చేస్తున్న కృషిని వివరించాను.ప్రస్తుతం ప్రపంచం వేగంగా మారుతున్న నేపథ్యంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఏ ఐ, క్వాంటమ్ టెక్నాలజీ, రోబోటిక్స్, సెమీకండక్టర్స్, డేటా సైన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల్లో అపారమైన అవకాశాలు ఉన్నాయని విద్యార్థులకు వివరించాను.
భవిష్యత్తులో ఉద్యోగాల స్వరూపం కూడా సాంకేతికతకు అనుగుణంగా మారనున్నందున విద్యార్థులు కేవలం డిగ్రీకి పరిమితం కాకుండా కొత్త టెక్నాలజీలను నేర్చుకుంటూ నిరంతరం






తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించాను. ఏ ఐ క్వాంటమ్ టెక్నాలజీ వంటి ఆధునిక రంగాల్లో ప్రాథమిక అవగాహనతో పాటు పరిశోధన, ఆవిష్కరణల వైపు విద్యార్థులు అడుగులు వేయాలని పిలుపునిచ్చాను.విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ పోటీ ప్రపంచానికి అనుగుణంగా తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలి. తల్లిదండ్రుల కష్టాన్ని, వారి ఆశయాలను బాధ్యతగా తీసుకుని జీవితంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలి. భవిష్యత్తులో మంచి ఉద్యోగాలు పొందడమే కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదిగి మరెందరికో ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించాను.ఫార్మసీ విద్యార్థులతో మాట్లాడుతూ భవిష్యత్తులో ఫార్మసీ రంగం మరింత వేగంగా అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయని, పరిశోధన, ఔషధ తయారీ, ల్యాబొరేటరీలు, ఫార్మా పరిశ్రమలు, స్వయం ఉపాధి వంటి అనేక రంగాల్లో అవకాశాలు ఉన్నాయని వివరించాను. ప్రభుత్వ ప్రోత్సాహకాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకుని ఈ రంగంలో కూడా యువత ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించాను.విద్యార్థులతో నేరుగా మాట్లాడటం, వారి ఆలోచనలు తెలుసుకోవడం ఎంతో సంతోషాన్ని కలిగించింది. మన యువత కొత్త సాంకేతికతలను అందిపుచ్చుకుని, జ్ఞానం, నైపుణ్యం, ఆవిష్కరణలతో ప్రపంచ స్థాయిలో పోటీపడేలా సిద్ధం కావాలి.
యువత లక్ష్యాలను నిర్దేశించుకుని కష్టపడి పనిచేస్తే అవకాశాలకు కొదవ ఉండదు. మన యువత విజయం సాధించడం ద్వారా కుటుంబంతో పాటు సమాజం, రాష్ట్రం, దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎం పి అంబికా లక్ష్మీనారాయణ సూచించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ సుబ్బారావు , పి వి కె కె టెక్నాలజీ ప్రిన్సిపల్ బి. సురేష్ , మేనేజ్‌మెంట్ ప్రతినిధి శ్రీకాంత్ రెడ్డి బాలాజీ ఫార్మసీ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రదీప్ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

# ఏసూరి సేవలు మరువలేనివి

- సూరి ఆశయ సాధనకు పునరాంకితం కావాలి సిపిఎం.

**వత్సవాయి సెప్టెంబర్ 25 మన ప్రజావాణి** సీతారాం ఏచూరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు పునరు అంకితం కావాలని సిపిఎం పా ర్టీ జిల్లా కమిటీ సభ్యులు ఏ వెంకటేశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన వత్సవాయిలో బొగ్గవరపు వెంకటేశ్వర్లు విజ్ఞాన కేంద్రం నందు శుక్రవారం సిపిఎం మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి రెండవ వర్ధంతి కార్యక్రమం సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బి.రాము అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు కర్నాటి సూర్య ప్రకాష్ రావు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీతారాం ఏచూరి రెండో వర్ధంతి సందర్భంగా మండల స్థాయిలో, గ్రామస్థాయిలో సభలు సమావేశాలు నిర్వహించాలని నిర్వహించాలని పార్టీ నిర్ణయించినట్లు తెలిపారు 1952 లో జన్మించిన ఆయన19 74 లో ఎస్ఎఫ్ఐ లో పని చేశారని అన్నారు 1975లో పార్టీ సభ్యులుగా సభ్యత్వం తెలిపారు. పార్టీ సభ్యులుగా పార్టీ కేంద్ర కమిటీ సభ్యులుగా ప్రధాన కార్యదర్శిగా, 2005,2017 సంవత్సరంలో రెండు తపాలుగా రాజ్యసభ సభ్యులుగా పనిచేశాడని అన్నారు. రెండు సంవత్సరాల క్రితం చనిపోయిన ఆయన రెండవ వర్ధంతి జరుపుకోవడం ఆయన చేసిన సేవలు మరొక ఫోటో ప్రజల హృదయాలో స్థిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు పార్టీలకు అతీతంగా రాజకీయాలకు అతీతంగా సిద్ధాంతం పట్ల కరుకుగా పనిచేసి నారాయణ అన్నారు





చనిపోయేంతవరకు ప్రధాన పాత్ర పోషించారని తెలిపారు. సమాచార హక్కు చట్టం, ఉపాధి హామీ పథకం అమలు పరచటంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. లౌకిక పార్టీలన్నీ కలుపుకొని ఐక్యంగా పనిచేశారని తెలిపారు బిజెపి యొక్క ప్రమాదకరమైన మతోన్మాదం పార్టీల్ని వ్యతిరేకంగా పోరాడని అన్నారు మార్క్ లిస్ట్ సిద్ధాంతంగా పనిచేశారని తెలిపారు.సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు మండే పూడి చంద్రశేఖర్ మాట్లాడుతూ సీతారామయ్య సూరి గోల్డ్ మెడలిస్ట్ గా అదే యూనివర్సిటీలో యూనియన్ ప్రెసిడెంట్ గా ఎన్నికయ్యారని అన్నారు జాతీయ ప్రధాన కార్యదర్శిగా పని చేశారని అన్నారు. విద్యార్థుల సమస్య లపై ఆనాడు ప్రధానమంత్రిగా ఉన్న ఇంటి కెళ్ళి సమస్యల్ని పరిష్కరించాలని ఇచ్చిన జీవో నీ వెనక్కి తీసుకోవాలని ఖండించిన వ్యక్తి సీతారామయ్య సూరి అన్నారు.12 సంవత్సరాల పాటు అనేక సమస్యలపై పోరాడిన వ్యక్తి సీతారా0 ఏచూరి అని అన్నారు. ఆర్యవైశ్య సంఘం ఎన్టీఆర్ జిల్లా తొలి అధ్యక్షులు, బొగ్గవరపు వెంకటేశ్వర్లు విజ్ఞాన కేంద్రం ట్రస్టు సభ్యులు బొగ్గవరపు వెంకట రాజారావు మాట్లాడుతూ సిపిఎం పార్టీ రాబోవు రోజుల్లో ఏ పార్టీకి పొత్తు పెట్టుకోకుండా మూడవ ప్రత్యామ్నాయ పార్టీగా ఉండాలని కోరారు. పోటీ చేయాలని తెలిపారు. రాజకీయాల్లోకి వచ్చే ప్రతి నాయకుడు డబ్బులు ఇచ్చి ఓటు కొనకూడదని పార్టీలకు అతీతంగా పనిచేయాలని ఏ పార్టీ అయినా సరే ప్రజాసేవ చేయాలని కోరారు. గంజాయి వలన నేడు యువత బారిన పడుతుందని అన్నారు. కోట్ల ఐదు రూపాయలు ఉన్న వ్యక్తులకి కూడా పెన్షన్ ఇస్తున్నారని అన్నారు. నేడు విద్య, హాస్పటల్ రాజకీయం ఒక వ్యాపారంలా మారిందని చేశారు. సీతారాం ఏచూరి సేవలు మరువలేని అని నేను కొనియాడారు ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ సీనియర్ నాయకులు చిరుమామిళ్ల హనుమంతరావు, తమ్మినేని రాంబాబు, తమ్మినేని రమేష్, బిల్లా విశ్వనాథం, జనార్దన్ రావు, వెంకయ్య, కనక పూడి పటేల్, రాయల వెంకటి, కంచర్ల కొండయ్య, లక్ష్మీనారాయణ, తాళ్లూరి మధు కుమారి కూచిపూడి దావీదు మాడుగుల అర్జున్ రావు తదితరులు పాల్గొన్నారు

# బీరంగూడలో గణేష్ నవరాత్రి ఉత్సవాల సందడి!

- 6 వేల మందికి పైగా భక్తులకు మహా అన్నదానం
- ఆదివారం 300 మంది కళాకారులతో భారీ శోభాయాత్ర, నిమజ్జనం

**అమీన్‌పూర్, సెప్టెంబర్ 25 (ప్రజావాణి):** బీరంగూడ ఓల్డ్ విలేజ్‌లో గణేష్ నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, వైభవంగా కొనసాగుతున్నాయి. ఎన్.ఎన్.జి యువసేన ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి నిర్వహించిన మహా అన్నదానానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం ప్రారంభమైన అన్నదాన కార్యక్రమంలో 6 వేల మందికి పైగా భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.
అమీన్‌పూర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ నందారం నరసింహా గౌడ్ మిత్రుడు, ఎన్నార్ ఇన్‌ఫ్రా అధినేత రాజశేఖర్‌రెడ్డి సౌజన్యంతో మహా అన్నదానాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన భక్తులు, కాలనీవాసులకు నందారం నరసింహా గౌడ్ కృతజ్ఞతలు తెలిపారు.

**ఆదివారం భారీ శోభాయాత్ర**

ఆదివారం సాయంత్రం 5 గంటల నుంచి స్వామివారి మహా శోభాయాత్ర, నిమజ్జన మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు నందారం నరసింహా గౌడ్ తెలిపారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, కేరళ,



మహారాష్ట్ర తదితర రాష్ట్రాల నుంచి 300 మందికి పైగా కళాకారులు హాజరై ప్రత్యేక ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కోలాటాలు,అఘోరాల విన్యాసాలు,వివిధ వేషధారణలు శోభా యాత్రకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయని పేర్కొన్నారు. మధుప్రియ ఆటపాటలతో సందడి ప్రముఖ తెలంగాణ గాయని



మధుప్రియ పాల్గొనే ప్రత్యేక ఆర్కెస్ట్రా కార్యక్రమం కూడా ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసు, ట్రాఫిక్, విద్యుత్ శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నందారం నరసింహా గౌడ్ వెల్లడించారు. బీరంగూడ, అమీన్‌పూర్ పరిసర ప్రాంతాల ప్రజలు, కాలనీవాసులు, యువత భారీ సంఖ్యలో తరలివచ్చి నిమజ్జనోత్సవాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎన్.ఎన్.జి యువసేన సభ్యులు, ప్రజాప్రతినిధులు, ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

# కాకతీయుల శిల్పకళా వైభవం.. ప్రకృతి వర్ణశోభకు నిలయంగా ములుగు జిల్లా

- విశ్వవేదికపై విరాజిల్లుతున్న ప్రపంచ వారసత్వ రామప్ప దేవాలయం
- చారిత్రక, ప్రకృతి సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క














**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25**

కాకతీయుల శిల్పకళా వైభవం, పచ్చని అడవులు, సెలయేళ్లు, జలపాతాలు, గుట్టలు, వాగులతో ప్రకృతి వర్ణశోభకు ములుగు జిల్లా నిలయంగా ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు.
శుక్రవారం వెంకటాపూర్ మండలం పాలంపేట ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం ఆవరణలో వరల్డ్ టూరిజం డే--2026ను పురస్కరించుకొని పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధ్యక్షతన హెరిటేజ్ వాక్స్, తెలంగాణ దర్శిని, కాంపిటీషన్స్, కల్చరల్ కార్యక్రమాలను నిర్వహించారు.
ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా మంత్రి దనసరి అనసూయ సీతక్క హాజరయ్యారు. గొల్లల గుడి నుంచి రామప్ప దేవాలయం వరకు నిర్వహించిన హెరిటేజ్ వాక్‌ను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి మంత్రి ప్రారంభించి కార్యక్రమంలో పాల్గొన్నారు. 2026 వరల్డ్ టూరిజం డేను "డిజిటల్ ఎజెండా అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టు రీడిజైన్ టూరిజం" అనే థీమ్‌తో నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులు, విద్యార్థినీ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు, పౌర సంబంధాల శాఖ సంస్కృతిక కళాసారథి కళాకారుల బృందం గేయాలు అతిథులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా మంత్రిఅనసూయ సీతక్క మాట్లాడుతూ 13వ శతాబ్దంలో నిర్మితమైన రామప్ప దేవాలయం కాకతీయుల కళా సంపదకు నిలువెత్తు నిదర్శనమని పేర్కొన్నారు. ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన రామప్ప దేవాలయ గొప్పతనాన్ని విశ్వవ్యాప్తం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. శతాబ్దాలుగా తరతరాలకు అందుతున్న ఈ అపురూప వారసత్వ సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాలని పిలుపునిచ్చారు.
రాష్ట్రంలోనే అత్యధిక అటవీ విస్తీర్ణం కలిగిన ములుగు జిల్లాలో పచ్చని అడవులు, అందమైన చెట్లు, గుట్టలు, సెలయేళ్లు, వాగులు, వన్యప్రాణులతో అపారమైన ప్రకృతి సంపద ఉందన్నారు. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతరగా పేరొందిన మేడారం సమ్మక్క--సారలమ్మ జాతర, లక్నవరం సరస్సు, బొగత జలపాతం, మల్లూరు లక్ష్మీనరసింహస్వామి ఆలయం వంటి పర్యాటక ప్రాంతాలు జిల్లాకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చాయని తెలిపారు. చారిత్రక కట్టడాలు, ప్రకృతి సంపదను పూర్వీకులు అందించిన వారసత్వంగానే కాకుండా భావితరాలకు తిరిగి అందించాల్సిన విలువైన ఆస్తిగా భావించాలని మంత్రి సూచించారు. పర్యావరణం, చరిత్ర పరిరక్షణను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా స్వీకరించాలన్నారు. పర్యాటక రంగంలో ములుగు జిల్లాకు పురస్కారం లభించడం గర్వకారణమని పేర్కొన్నారు.
అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, కాంపిటీషన్స్‌లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. చల్వాయి టీజీఎంఎస్‌కు చెందిన డి. శ్రీజ బృందం ప్రథమ బహుమతి, దేవగిరిపట్నం తెలంగాణ మైనారిటీ బాలికల పాఠశాలకు చెందిన ఆర్. శ్రీవల్లి ద్వితీయ బహుమతి, గోవిందరావుపేట బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎన్. మనస్విని, ఎ. శ్రుతి, ఎం. పావలి తృతీయ బహుమతి అందుకున్నారు. మరో విభాగంలో గోవిందరావుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన ఎం.డి. యాస్మిన్ విజేతగా, మంగపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన కె. దిలీప్ రన్నరప్‌గా నిలిచారు. తాడ్వాయి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన రంజిత్, రుత్విక్ ప్రోత్సాహక బహుమతి అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి, సంపత్ రావు, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ భగవాన్ రెడ్డి, టూరిజం నోడల్ అధికారి ధర్మ నాయక్, స్థానిక సర్పంచ్ రాజు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మండల ప్రత్యేక అధికారిగా వెంకటరమణ



**తవణంపల్లి సెప్టెంబర్ 25 ప్రజావాణి :** తవణంపల్లి మండలంలోని మండల ప్రత్యేక అధికారిగా వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ (ఎస్ ఎస్ ఏ )జిల్లా ప్రాజెక్టు అధికారిగా విధులు నిర్వహిస్తున్న ఆయనను ప్రభుత్వం ప్రత్యేక అధికారిగా నియమించడం జరిగింది. బాధ్యతలు స్వీకరించిన వెంకటరమణను మండల స్థాయి అధికారులు ఎంపీడీవో హరి ప్రసాద్ రెడ్డి, ఎంఈఓ హేమలత, మోహన్ రెడ్డి, ఏవో రెడ్డి బాబు, సిబ్బందులు ఆయనకు స్వాగతం పలికారు. ప్రభుత్వ ఆదేశాను ప్రకారం మండల అభివృద్ధికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

## మహిళా ఆరోగ్యంపై అవగాహన కల్పించాలి



**తవణంపల్లి, సెప్టెంబర్ 25 ప్రజావాణి :** మండలంలోని బీసీ కాలనీలో నిర్వహించిన పోషణ కార్యక్రమంలో మహిళలకు ఆరోగ్య పరిరక్షణ, ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అంగన్వాడి సూపర్వైజర్ నాగరత్న అవగాహన కల్పించడం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా ఆరోగ్య పరిరక్షణలో భాగంగా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు అందుతున్న సేవలపై వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న పౌష్టికాహారం, ఆరోగ్య పరీక్షలు, టీకాలు తదితర సేవలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం ఐ సి డి ఎస్ తదితర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. గర్భిణీలు,బాలింతలు,చిన్నారుల ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

## ఆత్మగౌరవ భవణాలు, మేడారం జాతరలో, 2004 లో జరిగిన ఒప్పందం సాదించేవరకూ సమరశీల ఉధ్యమాలకు నాయిబ్రాహ్మణులు సిద్ధం కావాలి

**ములుగు జిల్లా ప్రతినిధి సెప్టెంబర్ 25**

ములుగు జిల్లా కేంద్రంలోని ఎంఎల్ఎ క్యాంప్ ఆఫీస్ ప్రాంగణంలో జరిగిన అత్యవసర సమావేశంలో పాల్గొన్న గౌరవ అధ్యక్షులు మధ్దూరు రాములు జిల్లా అధ్యక్షులు చిక్కుల వెంకటేష్ మాట్లాడుతూ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు చెన్న కుమార్ కార్యదర్శులు ముత్యాల ప్రకాష్ ములుగు జిల్లా కేంద్రంలో ఏటూరునాగారం మేడారం లో నాయిబ్రాహ్మణ కమ్యూనిటీ హాల్స్, (ఆత్మగౌరవ భవణాలు) మేడారం జాతరలో 2004 లో జరిగిన ఒప్పందాలను పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖా ధనసరి అనసూయ (సీతక్క) సహకారం తో సాదించుకునే వరకూ, జిల్లాలోని నాయిబ్రాహ్మణలు సమరశీల సంఘటిత ఉధ్యమాలకు సిద్ధం కావాలని పిలపునిచ్చారు, ఈ సమావేశంలో పాల్గొన్నవారు, జిల్లా కోశాధికారి దుబ్బాక ప్రవీణ్, జిల్లా కమిటీ సభ్యులు ముత్యాల రాజు,మధ్దూరు రాజు,అన్నం తిరుపతి, కురిమిల్ల సంపత్, జంపాల చంద్రశేఖర్, దేవరకొండ వేణు,మద్రిపెల్లి కిషన్,నవీన్, తదితరులు,

## వరంగల్ విమానాశ్రయానికి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టాలి

- తెలంగాణ ఆత్మగౌరవం కోసం మంత్రి పదవినే త్యాగం చేసిన మహనీయుడికి ఇదే సముచిత గౌరవం
- 27న జరగబోయే బాపూజీ జయంతి సందర్భంగా సీఎం ప్రకటన చేయాలి
- పద్మశాలి సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్

**మొగుళ్ళ పల్లి ప్రతినిధి సెప్టెంబర్ 25**

తెలంగాణ ఆత్మగౌరవం, ప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన కొండా లక్ష్మణ్ బాపూజీ పేరును వరంగల్ విమానాశ్రయానికి పెట్టాలని పద్మశాలి సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు క్యాతం సతీష్ కుమార్, ప్రధాన కార్యదర్శి భీమనాథుని సత్యనారాయణ డిమాండ్ చేశారు. శుక్రవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ కోసం మంత్రి పదవినే త్యాగం చేసి ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం పోరాడిన బాపూజీ సేవలను చిరస్మరణీయంగా నిలిపేలా కొండా లక్ష్మణ్ బాపూజీ విమానాశ్రయంగా నామకరణం చేయాలని కోరారు. ఈ నెల 27న బాపూజీ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనున్న అధికారిక కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ మేరకు ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. పదవుల కంటే ప్రజల ఆకాంక్షలు, తెలంగాణ ప్రాంత ప్రయోజనాలే ముఖ్యమని తన ఆచరణ ద్వారా బాపూజీ చాటిచెప్పారన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, అట్టడుగు వర్గాల హక్కుల కోసం బాపూజీ చేసిన పోరాటం చిరస్మరణీయమన్నారు. తెలంగాణ సమాజానికి కాకుండా ఆయన సేవలు పద్మశాలి సమాజానికి గర్వకారణమని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కోసం జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడి పేరును విమానాశ్రయానికి పెట్టడం ద్వారా ఆయన సేవలకు తగిన గౌరవం లభిస్తుందన్నారు.

## భరత్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం తొలి వార్షికోత్సవానికి మంత్రి శ్రీధర్‌బాబుకు ఆహ్వానం

**బాలానగర్ సెప్టెంబర్ 26** సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మూసా పేట సర్కిల్ భరత్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం తొలి వార్షికోత్సవ కార్యక్రమానికి హాజరుకావాల్సిందిగా కోరుతూ సంఘం ప్రతినిధులు తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా భరత్‌నగర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు డాక్టర్ పటోళ్ల నాగిరెడ్డి ఆధ్వర్యంలో సంఘం కమిటీ సభ్యులు మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 27వ తేదీ ఆదివారం ఉదయం నిర్వహించనున్న సంఘం తొలి వార్షికోత్సవ సమావేశం, కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబును ప్రత్యేకంగా ఆహ్వానించారు. కాలనీ అభివృద్ధి, ప్రజల సంక్షేమం, మౌలిక వసతుల మెరుగుదల, స్థానిక సమస్యల పరిష్కారం వంటి అంశాలపై సంక్షేమ సంఘం నిరంతరం పనిచేస్తోందని ప్రతినిధులు తెలిపారు. తొలి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని కాలనీ వాసులను, ప్రజాప్రతినిధులను, ప్రముఖులను భాగస్వాములను చేస్తూ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్‌బాబును కలసి ఆహ్వాన పత్రిక అందజేసిన వారిలో సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి. నాగిరెడ్డి, కమిటీ సభ్యులు వెంకటేష్ యాదవ్, చందిరి కొండల్‌రెడ్డి, రమేష్ యాదవ్, నాగేశ్వర్‌రావు, నరేష్‌కుమార్, మధు, వెంకటేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. కాలనీ సంక్షేమ సంఘం తొలి వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించ నున్న కార్యక్రమానికి మంత్రి హాజరై సభ్యులు, కాలనీ వాసులను



# అదరగొట్టిన భారత కబడ్డీ జట్టు.. ఫైనల్స్‌కి దూసుకెళ్లింది..

ఐచి: ఆసియా క్రీడల్లో భారత పురుష, మహిళ కబడ్డీ జట్లు అదరగొడుతున్నాయి. ఇప్పటికే మహిళ జట్టు ఫైనల్స్‌కి దూసుకెళ్లగా.. తాజాగా పురుషుల జట్టు ఫైనల్స్‌కు చేరింది. శుక్రవారం ఐచి వేదికగా థాయ్‌లాండ్‌తో జరిగిన పోరులో ఘన విజయం సాధించి తుది పోరుకు చేరుకుంది. థాయ్‌లాండ్‌పై భారత్ 66-28 స్కోర్‌తో ఘన విజయం సాధించింది. దీంతో ఈ ప్రతిష్టాత్మక క్రీడల్లో భారత్‌కు మరో పతకం ఖాయమైంది. శనివారం జరిగే ఫైనల్ పోరులో భారత పురుషుల కబడ్డీ జట్టు తైవాన్ లేదా ఇరాన్‌తో తలపడే అవకాశముంది. అంతకు ముందు భారత మహిళల కబడ్డీ జట్టు కూడా సత్తా చాటింది. సెమీ ఫైనల్‌లో నేపాల్‌ను 48-24 తేడాతో భారత్ చిత్తు చేసింది. కాగా టోర్నమెంట్‌లో మెన్స్, ఉమెన్స్ కబడ్డీ జట్లు ఇప్పటివరకు ఒక్క మ్యాచ్‌లో కూడా ఓడిపోలేదు.

# ఆసియా క్రీడలు.. ఆఫ్ఘానిస్థాన్‌పై నేపాల్ ఘన విజయం



ఆసియా క్రీడల్లో భాగంగా శుక్రవారం అఫ్ఘానిస్తాన్‌తో జరిగిన మ్యాచ్‌లో నేపాల్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన అఫ్ఘానిస్థాన్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 102 పరుగులు మాత్రమే చేసింది. అఫ్ఘాన్ బ్యాటింగ్‌లో ఫైజల్ ఖాన్ 30, నజీబుల్లా జద్రాన్ 30 మినహా మిగితా వాళ్లందరూ సింగిల్ డిజిట్ స్కోర్‌కే పరిమితమయ్యారు. నేపాల్ బౌలింగ్‌లో కౌషల్ భుర్టెల్ 4 వికెట్లు, లలిత్ రాజ్‌బాన్సీ 3 వికెట్లు తీశారు. ఆ తర్వాత ఈ లక్ష్యాన్ని 17.2 ఓవర్లలో ఛేధించింది. నేపాల్ బ్యాటింగ్2లో సందీప్ జోరా 34, రోహిత్ పౌడెల్ 33(నాటౌట్) రాణించారు. అఫ్ఘాన్ బౌలింగ్‌లో ఫరిదూన్, అద్బొల్లా, అరబ్ గుల్ తలో వికెట్ తీశారు.

# విండీస్‌తో తొలి వన్డే.. సచిన్ రికార్డును కోహ్లీ బ్రేక్ చేస్తాడా?



వెస్టిండీస్ జట్టుతో ఆదివారం నుంచి టీం ఇండియా వన్డే సిరీస్‌లో తలపడనుంది. తొలి వన్డే తిరువనంతపురం వేదికగా జరగనుంది. ఇప్పటికే అక్కడకు చేరుకున్న భారత జట్టు ప్రాక్టీస్ ప్రారంభించింది. అయితే ఈ తొలి మ్యాచ్‌లో టీం ఇండియా పరుగుల రారాజు విరాట్ కోహ్లీ ఓ ప్రపంచ రికార్డును బ్రేక్ చేసే అవకాశం ఉంది. అది ప్రస్తుతం భారత దిగ్గజ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ పేరిట ఉంది. తిరువనంతపురంలో జరిగే వన్డేలో కోహ్లీ మరో 59 పరుగులు చేస్తే.. అంతర్జాతీయ వన్డేల్లో అత్యంత వేగంగా 15,000 పరుగులు పూర్తి చేసుకున్న క్రికెటర్‌గా ప్రపంచ రికార్డు సృష్టిస్తాడు. విరాట్ ఇప్పటివరకూ 311 ఇన్నింగ్స్‌లో 14,941 పరుగులు చేశాడు. సచిన్ టెండూల్కర్ 377 ఇన్నింగ్స్‌లో ఈ మైలురాయి చేరుకున్నారు. మరోవైపు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ఓ మైలురాయికి చేరువలో ఉన్నాడు. ఈ మ్యాచ్‌లో రోహిత్ 105 పరుగులు చేస్తే.. వన్డేల్లో 12,000 పరుగుల మైలురాయిని చేరుకుంటాడు. మరి విరాట్-రోహిత్ ఈ రికార్డులు సాధిస్తారో లేదో చూడాలి.

# ఆసియా క్రీడలు.. భారత్‌కు రెండో స్వర్ణ పతకం..



జపాన్‌లో ఆసియా క్రీడలు 2026 ఘనంగా జరుగుతున్నాయి. ఈ క్రీడల్లో తమ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చడంలో అథ్లెట్లు పోటీ పడుతున్నారు. కాగా, ఇప్పటికే భారత్‌కు క్రికెట్‌లో స్వర్ణపతకం లభించిన విషయం తెలిసిందే. ఇప్పుడు మన దేశానికి మరో స్వర్ణ పతకం లభించింది. షూటింగ్ విభాగంలో తొలుత మను బాకర్ వంటి స్టార్ షూటర్లు నిరాశ పరిచినా.. ఇప్పుడు ఏకంగా గోల్డ్ మెడల్ దక్కింద. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఈవట?ంలో భారత షూటర్లు కమల్‌జీత్, సురుచి సింగ్ స్వర్ణం సాధించారు. దీంతో ఈ క్రీడల్లో భారత్‌కు రెండో పసిడి పతకం లభించింది. ఈ విభాగం మెడల్ రౌండ్‌లో మొత్తం నాలుగు జోడీలు ఫైనల్2కు అర్హత సాధించారు. ఇందులో కమల్‌జీత్, సురుచి కలిసి మొత్తంగా 484.6 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచారు. దక్షిణ కొరియా ద్వయానికి రజతం, ఇరాన్ జోడీకి కాంస్యం దక్కాయి.

## రజనీకాంత్ 'జైలర్-2' పాటకు డేవిడ్ వార్నర్ డ్యాన్స్ చేస్తే..



ఆసీస్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ అంటే క్రికెట్ అభిమానులకే కాదు.. సినీ ప్రియులకు కూడా ఎంతో ఇష్టం. లాక్‌డౌన్ సమయంలో ఆయన పలు పాటలకు డ్యాన్స్‌లు చేస్తూ అప్‌లోడ్ చేసిన వీడియో ఎంతో వైరల్ అయ్యాడు. ఆ తర్వాత నుంచి వార్నర్‌ని డేవిడ్ భాయ్ అని పిలవడం ఫ్యాన్స్‌కి అలవాటు అయింది. గత ఏడాది నితిన్ హీరోగా వచ్చిన 'రాబిన్‌హుడ్' అనే సినిమాలో ఈ ప్రత్యేక పాత్రలో కనిపించారు వార్నర్. అయితే ఆ సినిమా ఊహించినంత సక్సెస్ సాధించలేదు.ఇప్పుడు డేవిడ్ వార్నర్ మరో వీడియోతో ఫ్యాన్స్ ముందుకొచ్చారు. 'జైలర్-2' చిత్రంలోని 'అల బోలేలో' పాటకి వార్నర్ డ్యాన్స్ చేస్తే ఎలా ఉంటుందో అనేలా ఓ ఎఐ వీడియోని క్రియేట్ చేశారు. దీన్ని వార్నర్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేశాడు. "ఇది ఎవరు చేశారో నాకు తెలీదు.. కానీ, నా డ్యాన్స్‌కు ఎన్ని మార్కులు ఇస్తారు' అని క్యాప్షన్ పెట్టాడు. దీనిపై అభిమానులు రకరకాలుగా కామెంట్లు చేస్తున్నారు.




# మన్‌ప్రీత్ కౌర్‌కు కాంస్యం

-హైదరాబాద్: ఆసియా క్రీడల్లో మహిళల షాట్ పుట్ విభాగంలో భారత్‌కు చెందిన మన్‌ప్రీత్ కౌర్ కాంస్య పతకాన్ని గెలుచుకుంది. మన్‌ప్రీత్ తన నాల్గో ప్రయత్నంలో 17.17 మీటర్ల అత్యుత్తమ దూరాన్ని నమోదు చేసి పతకాన్ని ఖరారు చేసుకున్నారు. చైనాకు చెందిన సాంగ్ జియాయువాన్ 19.40 మీటర్ల ప్రదర్శనతో స్వర్ణాన్ని, అదే దేశానికి చెందిన జాంగ్ లిన్‌రు 18.14 మీటర్లతో రజతాన్ని కైవసం చేసుకున్నారు. ఇదే ఈవెంట్‌లో మరో భారత క్రీడాకారిణి కృష్ణ జయశంకర్ మీనన్ ఐదవ స్థానంలో నిలిచారు.

# తొలి రౌండ్‌లోనే సాత్విక్-చిరాగ్ ఓటమి



హైదరాబాద్: ఆసియా క్రీడల పురుషుల డబుల్స్ బ్యాడ్మింటన్ విభాగంలో డిఫెండింగ్ ఛాంపియన్స్ సాత్విక్‌సాయిరాజ్ రెడ్డి చిరాగ్ శెట్టి తొలి రౌండ్‌లోనే నిష్క్రమించారు. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో థాయిలాండ్‌కు చెందిన సుక్‌ఫున్, పక్కపోన్ టీరారత్సాకుల్ జోడీ చేతిలో ఓడిపోయారు. ఊహించని విధంగా నాలుగో సీడ్ హోదాలో బరిలోకి దిగిన ఈ భారత జోడీ, 21-12, 19-21, 14-21 తేడాతో ఓటమిని చవిచూసింది.



# ఆసియా క్రీడల్లో భారత్‌కు మరో స్వర్ణం

హైదరాబాద్ : ఐచీ-నగోయా ఆసియా గేమ్స్‌లో ఆరో రోజు భారత్‌కు అద్భుతమైన ఆరంభం లభించింది. షూటర్లు సత్తా చాటడంతో భారత్ ఖాతాలో ఒక స్వర్ణం, ఒక రజతం చేరాయి. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్‌లో సురుచి, కమల్‌జీత్ జోడీ పసిడి పతకాన్ని ముద్దాడింది. పురుషుల 50 మీటర్ల రైఫిల్ 3 పొజిషన్స్ టీమ్ ఈవెంట్‌లో ఐశ్వరీ ప్రతాప్ సింగ్ తోమర్, నీరజ్ కుమార్, రుద్రాంక్ష్ పాటిల్‌తో కూడిన జట్టు రజత పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ విజయంతో దేశ పతకాల సంఖ్య 19కి చేరింది. మరోవైపు, స్వర్ణం గెలిచిన సురుచి-కమల్‌జీత్ జోడీ, క్వాలిఫికేషన్ రౌండ్‌లో ఆసియా రికార్డును సమం చేయడం విశేషం



# అప్పుడు కాంస్యం.. ఇప్పుడు రజతం.. మారథాన్‌లో మళ్లీ మెరిసిన గుల్వీర్..!

జపాన్‌లోని నగోయలో జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు మెరుస్తున్నారు. పురుషుల100 మీటర్ల పరుగులో గురిందెర్వీర్ సింగ్, అనిమేశ్ కుజుర్‌లు నిరాశపరిచినా.. 'నేనున్నాంటూ' మారథాన్ పరుగులో గుల్వీర్ సింగ్ పతకంతో మెరిశాడు. 10 వేల మీటర్లలో సత్తా చాటిన గుల్వీర్ రెండో స్థానంలో నిలిచి దేశానికి సిల్వర్ మెడల్ అందించాడు. దాంతో.. ఆసియాడ్‌లో వరసగా రెండో పతకం ఖాతాలో వేసుకున్నాడీ రన్నర్. 2023లో హంగ్జూలో గుల్వీర్ కాంస్యం సాధించాడు.పద్దెనిమిదో ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్ గుల్వీర్ సింగ్ వెండి వెలుగులు విరజిమ్మాడు. పురుషుల 10 వేల మీటర్ల పరుగులో అసమాన పట్టుదలను ప్రదర్శించిన అతడు సిల్వర్ మెడల్ సాధించాడు. ఆసియాడ్ వంటి పెద్ద వేదికలపై నేను ఎప్పుడూ నిరాశపరచను అని చాటుతూ పోడియం మీద సగర్వంగా నిలబడ్డాడీ రన్నర్. శుక్రవారం జరిగిన పురుషుల 10 వేల మీటర్ల పరుగులో గుల్వీర్ 28:29.38 నిమిషాల్లో లక్ష్యాన్ని చేరుకున్నాడు. అతడి కంటే 1.87 సెకన్ల ముందుగా పరుగు పూర్తి చేసిన బిర్హను బలెవ్(బహ్రెయిన్) స్వర్ణం ఎగరేసుకుపోయాడు.

# ‘ది ప్యారడైజ్’లో కయాదు లోహర్ పాత్రపై విమర్శలు.. శ్రీకాంత్ ఓదెలకి నెటిజన్ల ప్రశ్నలు



నేచురల్ స్టార్ నాని నటించిన ‘ది ప్యారడైజ్’కు విడుదల తర్వాత మిశ్రమ స్పందన వస్తోంది. సినిమా కథ, నాని నటన, యాక్షన్ సన్నివేశాలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నప్పటికీ.. ఈ చిత్రంలో కయాదు లోహర్ పోషించిన సుబ్బు పాత్ర మాత్రం ప్రత్యేకంగా చర్చకు వచ్చింది. ముఖ్యంగా ఆ పాత్రను దర్శకుడు శ్రీకాంత్ ఓదెల తెరకెక్కించిన విధానంపై సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సినిమాలో సుబ్బు పాత్రకు సినీ నటి కావాలనే కోరిక ఉంటుంది. తల్లి వద్దని వారించినా మద్రాస్ వెళ్లి సినిమాల్లో అవకాశాల కోసం ప్రయత్నిస్తుంది. అయితే అనుకున్న స్థాయిలో అవకాశాలు రాకపోవడంతో తీవ్ర నిరాశకు గురవుతుంది. అదే సమయంలో తన తండ్రి చేసిన అప్పుల కారణంగా కుటుంబం ఎదుర్కొంటున్న అవమానాలను చూస్తుంది. ఎలాగైనా ఆ అప్పులు తీర్చాలని నిర్ణయించుకున్న సుబ్బు.. డబ్బు కోసం బీ గ్రేడ్ చిత్రాల్లో నటించడం ప్రారంభిస్తుంది. ఇక్కడే ‘ది ప్యారడైజ్’లోని కొన్ని సన్నివేశాలపై ప్రేక్షకుల నుంచి అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. సుబ్బు నటించే బీ గ్రేడ్ చిత్రాలకు ‘చుక్క చిత్రాలు’ అనే పేరు పెట్టడం, వాటిని ప్రదర్శించే సన్నివేశాల్లో హీరోయిన్ పాత్రను చూపించిన తీరు అవసరానికి మించి గ్లామర్‌ను ప్రధానంగా చూపించిందని కొందరు ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. కథలో ఆ పాత్ర ఎదుర్కొంటున్న బాధ, పరిస్థితుల తీవ్రత ప్రేక్షకులకు బలంగా కనెక్ట్ కావాల్సిన చోట.. కొన్ని సన్నివేశాలు వేరే విధంగా స్పందన తెచ్చుకున్నాయని సోషల్ మీడియాలో చర్చ జరుగుతోంది. మరోవైపు సుబ్బు నడుముపై ఉండే సీతాకోకచిలుక టాటూ కూడా కథలో కీలకంగా ఉపయోగించారు. బీ గ్రేడ్ చిత్రాల్లో ఆమె ముఖాన్ని చూపించకుండా ఆ టాటూ ద్వారా గుర్తుపట్టేలా సన్నివేశాలను రూపొందించారు. అయితే ఆ విషయాన్ని హీరో తెలుసుకున్న తర్వాత వచ్చే సన్నివేశంలో నాని చెప్పే కొన్ని సంభాషణలపైనా విమర్శలు వచ్చాయి. ముఖ్యంగా మహిళలను అవమానించేలా అనిపించే పదజాలాన్ని ఉపయోగించడంపై కొందరు ప్రేక్షకులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి సుబ్బు పాత్ర వెనుక ఉన్న ఉద్దేశం భావోద్వేగంగా ప్రేక్షకులను కదిలించడమే అయి ఉండొచ్చనే అభిప్రాయాలు కూడా వినిపిస్తున్నాయి. కుటుంబ అప్పులు తీర్చడానికి ఒక యువతి తనకు ఇష్టం లేని మార్గంలోకి వెళ్లాల్సి రావడం, ఆ తర్వాత ఆ విషయం హీరోకు తెలియడం వంటి అంశాలతో బలమైన భావోద్వేగాన్ని పండించాలని దర్శకుడు ప్రయత్నించినట్లు కనిపిస్తోంది. అయితే ఆ సన్నివేశాల చిత్రీకరణ కారణంగా ఆశించిన భావోద్వేగం కంటే భిన్నమైన స్పందన వచ్చిందని కొందరు ప్రేక్షకులు అంటున్నారు. సోషల్ మీడియాలో కొంతమంది కయాదు లోహర్ సన్నివేశాలనే సినిమాకు సంబంధించిన చర్చలో ప్రధాన అంశంగా మార్చుకుని ట్రోల్ చేస్తున్నారు. మరికొందరు మాత్రం ఆ పాత్రను విమర్శించాల్సిన అవసరం లేదని, పాత్రను ఎలా రాశారు, ఎలా చూపించారు అనే అంశంపైనే చర్చ జరగాలని అంటున్నారు. అంటే.. విమర్శల ప్రధాన కేంద్రం కయాదు లోహర్ కాదు, ఆమె పాత్రను తెరపై ఆవిష్కరించిన విధానమే అన్నది వారి అభిప్రాయం.

# మీ ప్రేమతో పాటు.. ట్రోల్స్‌ను కూడా స్వీకరిస్తున్నా: నాని



నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం ‘ది ప్యారడైజ్’. గురువారం (సెప్టెంబర్ 24న) విడుదలైన ఈ సినిమాకి మిక్స్‌డ్ టాక్ వచ్చింది. కొంతమంది సినిమా బాగుందని చెబుతుంటే.. కొంతమంది తమకు నచ్చలేదని అంటున్నారు. అయితే సినిమాపై వచ్చిన రివ్యూలపై నాని స్పందించారు. సినిమాపై చూపిస్తున్న ప్రేమ, విమర్శలు రెండింటినీ స్వాగతిస్తున్నానని అన్నారు. “ది ప్యారడైజ్‌పై అభిప్రాయాలు, స్పందన అన్నింటినీ చూశా. మీరు చూపించిన ప్రేమతో పాటు, సరదా ట్రోల్స్‌ను కూడా స్వీకరిస్తున్నా. దీనిని తమ సినిమాగా ప్రేక్షకులు స్వీకరించిన తీరు నా హృదయానికి హత్తుకుంది. అదే సమయంలో సినీ విమర్శకులు, రివ్యూవర్లు ఎత్తి చూపిన పొరపాట్లు, లోటుపాట్లను పరిగణనలోకి తీసుకుంటాను. మీ అందరికీ కృతజ్ఞతలు. మీకు ప్రత్యేకమైన అనుభూతిని అందించాలనే ఉద్దేశంతో రక్తం, చెమట చిందించి #TheParadise తీర్చిదిద్దాం. మీరు దీన్ని సంబరంగా చేసుకోవచ్చు. విమర్శించవచ్చు. సినిమాపై మీరు చూపించిన ఉత్సాహం, నాపై కురిపించిన ప్రేమ, ఆప్యాయతకు నాలో కృతజ్ఞత భావాన్ని నింపాయి” అని నాని ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కాగా, భారీ అంచనాల నడుమ విడుదలైన ప్యారడైజ్ చిత్రం తొలిరోజు ప్రపంచవ్యాప్తంగా రూ.88 కోట్లు వసూళ్లు చేసినట్లు చిత్ర బృందం తెలిపింది. నాని కెరీర్‌లోనే ఇవి రికార్డుస్థాయి కలెక్షన్స్ అని వెల్లడించింది.

# సైలెంట్‌గా ఒటిటిలోకి వచ్చేసిన సూపర్ హిట్ సినిమా



కొన్ని సినిమాలు ఎటువంటి అంచనాలు లేకుండా విడుదలై.. సూపర్ హిట్‌గా నిలుస్తాయి. అలా వచ్చిన సినిమానే ఇమ్రాన్ హష్మీ హీరోగా నటించిన ‘ఆవారాపన్-2’. 2007లో వచ్చిన ‘ఆవారాపన్’ సినిమాకి ఇది సీక్వెల్. మొదటి భాగం సినిమాని ప్రేక్షకులు థియేటర్లలో అంతగా పట్టించుకోలేదు. కానీ, ఆ తర్వాత టివిల్లో చూసి సినిమాని ఇష్టపడ్డారు. దీంతో ఆ సినిమా సీక్వెల్‌పై ఎన్నో అంచనాలు ఏర్పడ్డాయి. అనుకున్నట్లుగానే ‘ఆవారాపన్-2’ గత నెల 14న థియేటర్లలోకి వచ్చి బ్లాక్‌బస్టర్ హిట్‌గా నిలిచింది. రూ.45 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కిన ఈ సినిమా రూ.213 కోట్ల వసూళ్లు సాధించింది. అయితే ఇప్పుడు ఈ సినిమా సైలెంట్‌గా ఒటిటిలోకి వచ్చేసింది. అమెజాన్ ప్రైమ్‌లో అద్దె విధానంలో అందుబాటులోకి వచ్చింది. త్వరలో ఉచితంగానూ స్ట్రీమింగ్‌లోకి రావచ్చు. హిందీలో మాత్రమే ఇది అందుబాటులో ఉంది.

# ‘పార్కింగ్’ దర్శకుడితో శివకార్తికేయన్ కొత్త సినిమా.. పూజా కార్యక్రమాలతో లాంచ్!




కోలీవుడ్‌లో భారీ అంచనాలు నెలకొన్నాయి. శివకార్తికేయన్ తన తదుపరి సినిమాలతో పాటు ఈ ‘ఎస్కే27’ షూటింగ్ షెడ్యూల్స్‌ను కూడా బ్యాలెన్స్ చేయనున్నారు. కోలీవుడ్ టాలెంటెడ్ హీరో శివకార్తికేయన్ (ాఅఙుఝుఝుతీష్ట్రఅనెవఝుఅ) హీరోగా తెరకెక్కుతున్న తాజా సినిమా ‘ఎస్కే27’ అధికారికంగా ప్రారంభమైంది. ప్రముఖ నిర్మాణ సంస్థ సత్యజ్యోతి ఫిలింస్ ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. విమర్శకుల ఈ చిత్రంలో శివకార్తికేయన్ సరసన కయాదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, యువ సంగీత సంచలనం సాయి అభ్యాంకర్ ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నట్లు సమాచారం. పర్ఫెక్ట్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్‌పై ప్రశంసలు పొందిన ‘పార్కింగ్’ (ఝుతీనెఅఅస్త్ర) చిత్రంతో జాతీయ అవార్డును గెలుచుకున్న టాలెంటెడ్ డైరెక్టర్ రామ్‌కుమార్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన ప్రొడక్షన్ పనులు గ్రాండ్‌గా మొదలయ్యాయి.

# తెలుగులోకి ‘హనుమాన్ అన్స్’.. త్రివిక్రమ్ తప్పుకోవడంతో ఇప్పుడు హోంబళే ఫిల్మ్స్ ఎంట్రీ?




హిందీ చిత్ర పరిశ్రమలో భక్తి ప్రధాన కథాంశంతో రూపొందిన కొన్ని సినిమాలు ఇటీవల భారీ విజయాలను అందుకుంటున్నాయి. అదే బాటలో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ‘హనుమాన్ అన్స్’ కూడా మంచి ఆదరణను సొంతం చేసుకుంటూ వసూళ్ల పరంగా దూసుకెళ్తున్నట్లు సమాచారం. భక్తి, పురాణ నేపథ్య అంశాలను ఆసక్తికరంగా మేళవించిన ఈ సినిమాపై ఉత్తరాది ప్రేక్షకుల్లో మంచి స్పందన కనిపించడంతో.. ఇప్పుడు దక్షిణాది భాషల్లోనూ విడుదల చేసే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా తెలుగు ప్రేక్షకులకు ఈ సినిమాను అందించేందుకు తొలుత ప్రముఖ దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ముందుకు వచ్చినట్లు వార్తలు వచ్చాయి. సినిమాకు తెలుగు డబ్బింగ్ వెర్షన్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావడంలో ఆయన భాగస్వామ్యం ఉండబోతుందని ప్రచారం జరిగింది. దీంతో తెలుగు ప్రేక్షకుల్లోనూ ఈ చిత్రంపై ఆసక్తి ఏర్పడింది. అయితే విడుదలకు కొన్ని రోజుల ముందు అనూహ్య పరిణామాలు చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. కొన్ని కారణాల వల్ల త్రివిక్రమ్ ఈ సినిమా తెలుగు విడుదల వ్యవహారం నుంచి తప్పుకున్నారని ప్రచారం మొదలైంది. దీంతో అసలు ‘హనుమాన్ అన్స్’ తెలుగు ప్రేక్షకుల ముందుకు వస్తుందా లేదా అనే సందేహాలు కూడా వ్యక్తమయ్యాయి. ఇప్పుడు తాజాగా ఈ సినిమాకు సంబంధించి మరో ఆసక్తికరమైన వార్త సినీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. దక్షిణాది ప్రేక్షకులకు సినిమాలను పరిచయం చేయడంలో ముందుండే ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబళే ఫిల్మ్స్ ‘హనుమాన్ అన్స్’ తెలుగు సహా దక్షిణాది భాషల విడుదల బాధ్యతలను తీసుకునేందుకు ఆసక్తి చూపిస్తున్నట్లు సమాచారం. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. హోంబళే ఫిల్మ్స్ ఈ సినిమాను దక్షిణాదిలో విడుదల చేస్తుందనే వార్త ప్రస్తుతం పరిశ్రమ వర్గాల్లో వినిపిస్తున్న ప్రచారం మాత్రమే. సంస్థ నుంచి అధికారికంగా ప్రకటన వచ్చిన తర్వాతే దీనిపై పూర్తి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. హోంబళే ఫిల్మ్స్‌కు భక్తి చిత్రాల విషయంలో ఇప్పటికే అనుభవం ఉంది. ఇటీవల హిందీ నుంచి వచ్చిన ‘మహావతార్ నరసింహ’ చిత్రాన్ని కూడా దక్షిణాది ప్రేక్షకులకు చేరువ చేయడంలో సంస్థ కీలకంగా వ్యవహరించింది. ఆ సినిమా కూడా పురాణ, భక్తి నేపథ్యంతో తెరకెక్కినదే కావడంతో.. ఇప్పుడు ‘హనుమాన్ అన్స్’ విషయంలోనూ ఇదే సంస్థ పేరు వినిపించడం ఆసక్తిని పెంచుతోంది. ఒకవేళ హోంబళే ఫిల్మ్స్ ఈ చిత్రాన్ని అధికారికంగా తీసుకుంటే.. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల చేసే అవకాశాలు ఉండొచ్చనే చర్చ జరుగుతోంది. ఇప్పటికే హిందీలో ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన దక్షిణాదిలోనూ సినిమాకు ఉపయోగపడుతుందనే అంచనాలు వ్యక్తమవుతున్నాయి.

# ‘అనుమాన పక్షి’ రివ్యూ.. విమల్ కృష్ణ టేకింగ్, రాగ్ మయూర్ నటన ఎలా ఉంది!




డిజె టిల్లు’ వంటి సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ తర్వాత దర్శకుడు విమల్ కృష్ణ తెరకెక్కించిన తాజా చిత్రం ‘అనుమాన పక్షి’. డిఫరెంట్ కాన్సెప్ట్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా కథాకథనాలు ఎలా ఉన్నాయో సమీక్షలో చూద్దాం. కథేంటంటే: సన్నీ (రాగ్ మయూర్) ‘అనుమాన పక్షి’ పేరుతో ఓ యూట్యూబ్ ఛానెల్ నడుపుతుంటాడు. ప్రతి విషయాన్ని అతిగా ఆలోచించడం, అందరినీ అనుమానించడం అతని నైజం. ఈ క్రమంలో తన స్నేహితుడు అనంతు డిప్రెషన్‌లో ఉన్నానని, కాశ్మీర్‌లో ఆత్మహత్య చేసుకుంటానని ఫోన్ చేస్తాడు. దాంతో సన్నీ, రమ్య అనే అమ్మాయిని ఇష్టపడే వర్మ (ప్రిన్స్) సహాయంతో కాశ్మీర్ బయలుదేరుతాడు. అక్కడ కన్య (మెరిన్ ఫిలిప్) పరిచయమవ్వడం, అనుకోకుండా వర్మ హత్యకు గురికావడం, రీల్స్ చేయడానికి పిచ్చిగా ప్రయత్నించే పోలీస్ ఆఫీసర్ వాసు (అజయ్) ఎంట్రీ ఇవ్వడం జరుగుతుంది. వీరందరి మధ్య సంబంధం ఏమిటి? ఈ చిక్కుముడిని సన్నీ ఎలా విప్పాడు? అనేదే ఈ చిత్ర అసలు కథ. విశ్లేషణ: దర్శకుడు విమల్ కృష్ణ ఎంచుకున్న పాయింట్ చాలా కొత్తగా ఉంది. ప్రతి చిన్న విషయానికి అనుమానపడే హీరో పాత్ర చుట్టూ తిరిగే సన్నివేశాలు విభిన్నంగా నవ్విస్తాయి. ప్రథమార్ధంలో హీరో చేసే అల్లరి, సిచ్యుయేషనల్ కామెడీ ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఇక ద్వితీయార్ధంలో అజయ్ పోలీస్ ఆఫీసర్‌గా చేసిన హంగామా, రీల్స్ కాన్సెప్ట్ ప్రస్తుత ట్రెండ్‌కు తగ్గట్టుగా సరదాగా సాగుతాయి. స్క్రీన్‌ప్లేలో సస్పెన్స్ ఎలిమెంట్స్ సినిమాపై ఆసక్తిని కలిగిస్తాయి. నటీనటుల ప్రతిభ: లీడ్ రోల్ చేసిన రాగ్ మయూర్ తన అనుమానాలతో కూడిన పాత్రలో చాలా సహజంగా నటించాడు.

Printed, Published and Owned by **RAYINIPATLA KUMARASWAMY**, Printed at **RAMANI WEB OFFSET PRINTERS**, Auto Nagar, Bommakal, Karimnagar, Editor : **RAYINIPATLA KUMARASWAMY, MANAPRAJAVAANI BROAD CASTING AND PUBLICATIONS**, Ankireddypally, Thanggellapally, Rajanna Sircilla, TELANGANA-505405. **RNI NO:TGTEL/25/A5443** Contact No : 9440032006. MAIL ID : Kumaraswamyrayinipatla@gmail.com